PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 158 | విజయవాడ, గురువారం 9 జనవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 9 January 2025 | Rs

**రాజకీయాలను శాసిస్తున్న మతోన్మాదం**

- పుస్తక మహోత్సవంలో బి.వి.రాఘవులు

2

# ఉక్కు ఊసే లేదు!

- రాష్ట్ర ప్రజల మనోభావాలు పట్టని ప్రధాని
- సంపన్న ఎపి లక్ష్యమంటూ ప్రకటన
- విశాఖ స్టీలు గురించి పెదవి విప్పని చంద్రబాబు, పవన్ కల్యాణ్
- మిట్టల్ స్టీల్ గురించి మాట్లాడిన సిఎం
- పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం

రోడ్డుషోలో అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ, చిత్రంలో చంద్రబాబు, పవన్

**ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో**

ప్రధానమంత్రి నరేంద్రమోడీ మరోసారి రాష్ట్రప్రజల మనోభావాలను నిర్లక్ష్యం చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం నాలుగేళ్లుగా ఆందోళన సాగుతున్న విశాఖపట్నం పర్యటనకు బుధవారం వచ్చిన ఆయన విశాఖ ఉక్కు గురించి నామమాత్రంగా కూడా స్పందించలేదు. విశాఖ ఉక్కు కార్మికులను, సిపిఎంతోపాటు వామపక్షాల నాయకులను ఎక్కడికక్కడ నిర్బంధించిన రాష్ట్రప్రభుత్వం ప్రధాని పర్యటనలోనూ, సభలోనూ నిరసన గళం ప్రధానికి వినిపించకుండా జాగ్రత్తపడింది. దీంతో విస్తృత ప్రజామద్దతుతో సుదీర్ఘకాలంగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన జరుగుతున్న విషయం అసలు తెలియనట్లుగానే ప్రధాని మోడీ వ్యవహరించారు. విశాఖ ఉక్కుతో పాటు, రాష్ట్రాభివృద్ధికి అత్యంత కీలకమైన ప్రత్యేకహోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధుల విషయాలను ఆయన అసలు ప్రస్తావించనే లేదు. ప్రధానితోపాటు రోడ్‌షోలోనూ, బహిరంగ సభలోనూ ప్రసంగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కూడా విశాఖ ఉక్కుతో పాటు, ఇతర అంశాలపై పెదవి విప్పకపోవడం గమనార్హం. అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మిట్టల్ స్టీల్ విషయాన్ని మాత్రం ప్రధాని సమక్షంలో ప్రస్తావించారు. తనదైన శైలిలో సుదీర్ఘంగా మాట్లాడిన ప్రధాని సుసంపన్న ఎపి తమ లక్ష్యమని ప్రకటించారు. విశాఖలోని ఎయు ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో టిడిపి కూటమి పార్టీల ఆధ్వర్యాన బుధవారం సాయంత్రం జరిగిన 'ప్రజావేదిక' సభలో తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించిన ఆయన 'విశాఖలో మీ స్వాగతం చూశాను. ఆంధ్రా ప్రజల ప్రేమ, అభిమానం చూశాను. సేవ చేయడం ద్వారా నా అభిమానాన్ని చూపిస్తాను' అని ఆయన అన్నారు. 'రాష్ట్రాభివృద్ధికి ప్రాజెక్టులు కీలకం. సుసంపన్న ఎపియే ఎన్‌డిఎ లక్ష్యం' అని ప్రకటించారు. విశాఖలో పది ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయడం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి మిగతా 7లో

## ప్రధాని పర్యటనకు నిరసన సెగ

రాజయ్యపేటలో సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావును అరెస్టు చేస్తున్నపోలీసులు

- వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తగదని, బల్క్ డ్రగ్ పార్కు వద్దని ఆందోళనలు
- పిఎం బహిరంగ సభ సమీపంలో హోరెత్తిన మోడీ గో బ్యాక్ నినాదాలు

8

భారీ క్యూలైనులో వేచి ఉన్న యాత్రికులు

# తిరుపతిలో తొక్కిసలాట

## ఆరుగురు దుర్మరణం

- వైకుంఠ ద్వార దర్శనం క్యూలైన్లలో ఘటన
- చంద్రబాబు, జగన్ దిగ్భ్రాంతి
- నేడు బాధితులను పరామర్శించనున్న ముఖ్యమంత్రి

మృతులు

నాయుడు బాబు

మల్లిక

**ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో, తిరుమల, తిరుపతి సిటీ**

తిరుపతిలో ఘోరం జరిగింది. వైకుంఠ ద్వారదర్శన టోకెన్ల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లలో భక్తులు పోటెత్తడంతో తీవ్ర స్థాయిలో తొక్కిసలాట జరిగింది. అనూహ్యంగా జరిగిన ఈ ఘటనలో ఆరుగురు భక్తులు మృతి చెందారు. వారిలో ముగ్గురు విశాఖకు చెందిన వారు ఉన్నారు. మరో 44 మందికిపైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో 15 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీంతో, మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. తిరుపతిలోని విష్ణు నివాసం, సత్యనారాయణపురం బైరాగిపట్టెడ రామానాయుడు స్కూలు వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాలలో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం నాడు తిరుపతికి వెళ్లి బాధితులను పరామర్శిస్తారని సిఎం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ఆస్పత్రి వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్, టిటిడి ఇఒ, ఎమ్మెల్యే

**ఏం జరిగింది...?**

తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం శుక్రవారం (10వ తేది) నుంచి 19వ తేదీ వరకూ పది రోజుల పాటు జరగనున్న సంగతి తెలిసిందే. శుక్రవారం నాటి దర్శనం కోసం గురువారం తెల్లవారుజామున ఐదు గంటలకు మిగతా 2లో

**రెండు దశల్లో రాజధాని నిర్మాణాలు**

- సిఆర్‌డిఎ నిర్ణయం

2

**న్యాయవ్యవస్థ అధికారాల సంగతేంటి?**

- సూటిగా ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం

7

**రెండో రోజూ అభ్యంతరాల వెల్లువ**

- ట్రూ అప్, ఎఫ్‌పిపిసిఎ, సర్‌ఛార్జీల రద్దుకు డిమాండ్
- విజయవాడలో ముగిసిన ఎపిఇఆర్‌సి అభిప్రాయ సేకరణ

2

# మోడీ మహామోసం

## విశాఖ పర్యటనపై సిపిఎం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ప్రధాన మంత్రి నరేంద్రమోడీ విశాఖ పర్యటన సందర్భంగా విశాఖ స్టీలుపై రాష్ట్రప్రజల మనోభావాలను ఏమాత్రం గౌరవించకుండా మరోసారి మోసం చేశారని సిపిఎం రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు బుధవారం సాయంత్రం విడుదల చేసిన ఒక ప్రకటనలో రాష్ట్రప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడకపోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మోడీ తన సుదీర్ఘ ప్రసంగంలో శంకుస్థాపన చేసిన ప్రాజెక్టుల గురించి గొప్పగా చెప్పారే తప్ప పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రత్యేక హోదా గురించి ఉత్తరాంధ్ర, రాయలసీమ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, ప్యాకేజి వంటి విభజన హామీల గురించి మాట్లాడకపోవడాన్ని ఆయన ప్రస్తావించారు. ఇది రాష్ట్రప్రజలను వంచించడమేనని పేర్కొన్నారు. విశాఖ ఉక్కును కాపాడి తీరుతామని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు కూడా తమ ప్రసంగాల్లో విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని చెప్పకపోవడం వారి చిత్తశుద్ధిలేమికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ వేదిక నుంచి ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ గురించి చంద్రబాబు విన్నపాలు చేశారే తప్ప విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని చెప్పకపోవడం దారుణమని పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకం రద్దు, స్వంత గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీనం సమస్యలపై ప్రధాని ప్రకటన చేస్తారని, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ప్రధానితో ప్రకటన చేయిస్తారని స్టీల్ కార్మికులు, విశాఖ ప్రజలు ఎదురుచూశారని తెలిపారు. కానీ వీరు ప్రజల ఆశలను వమ్ము చేశారని, ఇది దుర్మార్గ చర్య అని ఆయన పేర్కొన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నాలుగేళ్లకు పైగా పట్టుదలగా పోరాడుతున్న విశాఖ ఉక్కు కార్మికులు, వారికి సంఘీభావంగా నిలుస్తున్న రాష్ట్ర ప్రజలు మరింత బలమైన ఉద్యమం సాగిస్తేనే పాలకుల మెడలు వంచడం సాధ్యమవుతుందని తెలిపారు.

# ఇంటర్మీడియట్‌లో ఎన్‌సిఇఆర్‌టి సిలబస్

- మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు రద్దు
- కమిషనర్ కృతికా శుక్లా వెల్లడి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

విద్యారంగ నిపుణులతో నామమాత్రపు చర్చ కూడా జరపకుండా ఇంటర్మీడియట్ విద్యలో పలు సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఇంటర్మీడియట్ విద్య కమిషనర్, బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా సంస్కరణల వివరాలను తెలిపారు. సంస్కరణలను అమలు చేస్తున్నట్లు చెబుతూనే సూచనలను, అభ్యంతరాలను తెలియజేయాలని ఆమె కోరారు. ఇంటర్మీడియట్‌లో జాతీయ విద్య పరిశోధన మండలి (ఎన్‌సిఇఆర్‌టి) సిలబస్‌ను అమలు చేయనున్నట్లు ఆమె చెప్పారు. నూతన విద్యావిధానం-2020కు అనుగుణంగా ఇంటర్‌లో మార్పులు తీసుకొస్తున్నట్లు ఆమె తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ఉండవని, కానీ వార్షిక పరీక్షలు మాత్రం నిర్వహిస్తామని చెప్పారు. కేవలం ద్వితీయ సంవత్సరంలో మాత్రమే పబ్లిక్ పరీక్షలు ఉంటాయని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం (2025-26)లో ఇంటర్ మొదటి సంవత్సరంలో, ఆ తరువాత విద్యా సంవత్సరం (2026-27) ద్వితీయ సంవత్సరంలో సైన్స్ సబ్జెక్టులలో పూర్తిగా ఎన్‌సిఇఆర్‌టి సిలబస్‌ను ప్రవేశపెడతామన్నారు. ఆర్ట్స్ సబ్జెక్టుల్లో బోర్డు పాఠ్యపుస్తకాలు ఉంటాయన్నారు. ఈ సంస్కరణల వల్ల నీట్, జెఇఇలలో విద్యార్థులు విజయం సాధించడానికి అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. మూల్యాంకన విధానంలో సిబిఎస్‌ఇ, ఇతర రాష్ట్ర విద్యామండలిలో సారూప్యత, సమానత్వం సాధించాలంటే ప్రథమ సంవత్సరం పబ్లిక్ పరీక్షలను తొలగించాల్సిన అవసరం మిగతా 7లో

## విసిల నియామకానికి సెర్చ్ కమిటీలు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న వైస్ ఛాన్సలర్ పోస్టుల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఇందుకు సంబంధించిన వేర్వేరు ఉత్తర్వులను ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం విడుదల చేశారు. మొత్తం 17 యూనివర్సిటీలకు సెర్చ్ కమిటీలను ఏర్పాటుచేశారు. ముగ్గురితో కూడిన ఈ సెర్చ్ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒకరు, యుజిసి నుంచి ఒకరు, యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఇసి) నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు. యూనివర్సిటీ విసి పోస్టుకు దరఖాస్తు చేసుకున్న వారి నుంచి ముగ్గురి పేర్లను రాష్ట్ర ప్రభుత్వానికి ఈ కమిటీ ప్రతిపాదిస్తుంది.

**కార్చిచ్చుతో కకావికలం**

- లాస్‌ఏంజెల్స్‌ను చుట్టుముట్టిన దావానలం
- వీధుల్లోకి హాలివుడ్ తారలు

7

# సిపిఎస్ రద్దు చేయాల్సిందే

- ప్రాథమిక పాఠశాల వ్యవస్థను పునరుద్ధరించాలి
- యుటిఎఫ్ స్వర్ణోత్సవాల రాష్ట్ర మహాసభ డిమాండ్
- బకాయిల కోసం

**ఫిబ్రవరి 17 నుంచి ఆందోళన**

**ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి**

సిపిఎస్‌ను రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాల వ్యవస్థను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ స్వర్ణోత్సవాల రాష్ట్ర మహాసభ తీర్మానించింది. కాకినాడ పిఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో నాలుగు రోజులపాటు జరిగిన ఈ మహాసభ బుధవారం ముగిసింది. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన చివరిరోజు ప్రతినిధుల సభలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిల కోసం యుటిఎఫ్ కార్యాచరణ తీసుకుందని తెలిపారు. ఫిబ్రవరి 17 నుంచి ఆందోళన కార్యక్రమాలు మొదలు పెడతామన్నారు. దీనికోసం ఫిబ్రవరి 2న విజయవాడలో సన్నాహక సదస్సు జరుగుతుందని తెలిపారు. ఆ తర్వాత మిగతా 7లో



నక్కా వెంకటేశ్వర్లు

కెఎస్ఎస్.ప్రసాద్

**యుటిఎఫ్ అధ్యక్షునిగా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్ ఎన్నిక**

యుటిఎఫ్ రాష్ట్ర నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. సీనియర్ నాయకులు జి.ప్రభాకర్‌వర్మ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, అధ్యక్షులుగా ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కెఎస్ఎస్.ప్రసాద్, ఉపాధ్యక్షులుగా కె.సురేష్‌కుమార్, ఎఎన్.కుసుమకుమారి, కోశాధికారిగా ఆర్.మోహన్‌రావు మరో 15 మంది రాష్ట్ర కార్యదర్శులతో నూతన కమిటీ ఎన్నికైంది. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా మల్లేశ్వరరావు, ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులుగా కె.సురేష్‌కుమార్, ప్రచురణల కమిటీ చైర్మన్‌గా ఎం.హనుమంతరావు, కుటుంబ సంక్షేమ పథకం అధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, అధ్యయన కమిటీ అధ్యక్షులుగా బాబురెడ్డి ఎన్నికయ్యారు.

రోనా విల్సన్

సుధీర్ ధావలే

**ఎల్గర్ పరిషత్ కేసులో రోనా విల్సన్‌కు, సుధీర్ ధావలేకు బెయిల్**

**ముంబయి** : ఎల్గర్ పరిషత్-మావోయిస్టు సంబంధాల కేసులో పరిశోధకులు రోనా విల్సన్, హక్కుల కార్యకర్త సుధీర్ ధావలేకు బాంబే హైకోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. 2018 జనవరి 1వ తేదీన మహారాష్ట్రలోని పూనేలో జరిగిన భీమా కోరేగావ్ హింసకు సంబంధించి ఎల్గర్ పరిషత్ కేసు నమోదైంది. భీమా కోరేగావ్‌లో నాటి భూస్వామ్య పాలకులపై దళితులు, ఇతర అణగారిన ప్రజలు సాగించిన ధీరోదాత్తమైన పోరాట 200వ వార్షికోత్సవం సందర్భంగా 2017 డిసెంబర్ 31న పూనేలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఎల్గర్ పరిషత్ చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పౌర హక్కుల నేతలను, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకున్న మోడీ సర్కార్ ఈ ఎల్గర్ మిగతా 7లో

# ఆదుకోండయ్యా !

- కరువు బృందం సభ్యులకు రైతుల మొర
- రాయలసీమలో పర్యటించిన బృందాలు
- పశుపోషణ శిబిరాల ఏర్పాటు చేయాలని రైతుల వినతి

శ్రీసత్యసాయి జిల్లాలో జొన్న పంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న కేంద్ర కరువు బృందం సభ్యులు

**ప్రజాశక్తి - యాదమరి, అనంతపురం, మదనపల్లె అర్బన్**

ఖరీఫ్ సీజన్‌లో ఎకరా పొలంలో వేరుశనగ పంట సాగు చేశానని, సకాలంలో వర్షాలు పడకపోవడంతో కేవలం మూడు బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చిందని చిత్తూరు జిల్లా కోనాపల్లి గ్రామానికి చెందిన చిట్టిబాబు తన ఆవేదనను కరువు బృందం ఎదుట వెలిబుచ్చారు. ఎకరాకు రూ.25 వేలు ఖర్చు పెట్టానని, పెట్టుబడి కూడా రాలేదని కన్నీటి పర్యంతమయ్యారు. కరువును జయించాలంటే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని కరువు బృందం సభ్యులు సూచించారు. నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. పంట నష్టం, కరువు పరిస్థితులను అధ్యయనం చేసేందుకు కేంద్ర కరువు బృందాలు రాయలసీమ జిల్లాలకు బుధవారం వచ్చాయి. ఒక బృందం ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో, మరో బృందం చిత్తూరు, ఇంకో బృందం అన్నమయ్య జిల్లాలో పర్యటించింది. చిత్తూరు జిల్లా యాదమరి మండలం కోనాపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలో పంట పొలాలను కరువు బృందం సభ్యులు పరిశీలించారు. చిత్తూరు జిల్లాలో 16 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారని, అందులో మూడు మండలాలు మధ్యస్థ కరువు మండలాలుగా ఉన్నాయని, మిగిలిన మండలాల్లో తీవ్ర కరువు దృష్ట్యా రైతుల సంక్షేమం కోసం నష్టం అంచనా వేసేందుకు వచ్చామని బృందం సభ్యులు చెప్పారు. కేంద్ర బృందం కమిటీ సభ్యులు జిల్లా అధికారులతో కలిసి కోనాపల్లి గ్రామంలో సమావేశం ఏర్పాటు చేశారు. వేరుశనగ విత్తనాలు వంద శాతం సబ్సిడీతో అందించాలని, రైతులు కరువు మండలంగా ప్రకటించడంతో పాటు పాడి పశువులకు పశుపోషణా శిబిరాలు ఏర్పాటు చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ మిగతా 7లో

## ఆర్‌టిసి కార్మికులకు నైట్ అవుట్ అలవెన్స్ చెల్లింపులు

- నివేదికలు పంపాలని ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆర్‌టిసి (ఎపిపిటిడి) ఉద్యోగుల నైట్ అవుట్ అలవెన్స్ చెల్లింపులకు సంబంధించిన నివేదికలను త్వరితగతిన తయారు చేసి పంపాలని డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులకు ఎపిపిటిడి అడ్మిన్ విభాగం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా సిఐఎస్ ప్రాజెక్టు ఆపరేషన్స్ మాడ్యూల్‌లో వర్తించే విధంగా ఎపి పిటిడి ఆపరేషన్స్ డిస్ట్రిక్ట్ మంత్లీ రిపోర్టు, ఎపి పిటిడి ఆపరేషన్స్ సిటీ మంత్రి అలవెన్స్ రిపోర్టు రూపొందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## నేడు, రేపు భువనేశ్వర్‌లో ప్రవాస భారతీయ దివస్

- హాజరుకానున్న మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భువనేశ్వర్‌లో ఈ నెల 9, 10 తేదీల్లో జరగనున్న ప్రవాస భారతీయ దివస్ కార్యక్రమానికి రాష్ట్రప్రభుత్వం తరపున ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరుకానున్నారు. రెండు రోజులపాటు జరగనున్న ప్రవాస భారతీయ దినోత్సవం కార్యక్రమాన్ని తొలిరోజు గురువారం ఉదయం ప్రధాని మోడీ ప్రారంభించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో నివసించే భారతీయ సంతతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించి పరిష్కారం కనుగొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు.

## దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులు, ఇతర సిబ్బందికి కమిషనర్ విఆర్ కృష్ణతేజ సంక్రాంతి సందర్భంగా నూతన దుస్తులు, స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు. తాడేపల్లిలోని కమిషనర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సిబ్బంది అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో సంక్రాంతి ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ అదనపు కమిషనర్ సుధాకర్, ఇజిఎస్ డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్ తదితరలు పాల్గొన్నారు.

## 'సమగ్ర శిక్షా ఉద్యోగులకూ ఎంటిఎస్ వర్తింపజేయాలి'

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేసేలా ఇచ్చిన జిఒ నెంబరు 2ను సవరించి తమకూ ఎంటిఎస్ వర్తింపజేయాలని సమగ్ర శిక్షా యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సైకం శివకుమారిరెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలో సమగ్ర శిక్షాలో పనిచేసే వేలాది మంది ఉద్యోగులు ఎంటిఎస్‌తోపాటు పలు డిమాండ్ల సాధన కోసం అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేసిన సందర్భంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమగ్ర శిక్షా ఉద్యోగులందరికీ టైమ్ స్కేల్ అమలు చేయాలని, లేని పక్షంలో తాము అధికారంలోకి రాగానే ఉద్యోగులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

## అదాని కృష్ణపట్నం పోర్టుకు ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

అదాని కృష్ణపట్నం పోర్టుకు ఎన్విరాన్‌మెంట్ ఎక్సలెన్స్ అవార్డు దక్కింది. అదాని కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్‌కు ప్లాటినం కేటగిరీ కింద సేవా రంగంలో జాతీయ స్థాయి 18వ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసిసి) ఎన్విరాన్‌మెంట్ ఎక్సలెన్స్ అవార్డు-2024ను అందుకుంది. కోల్‌కతాలోని తాజ్ బెంగాల్ హోటల్‌లో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ శశి పంజా నుంచి పర్యావరణ శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి రోష్నిసేన్ అవార్డు అందుకున్నారు. సుస్థిరత, పర్యావరణ ఆవిష్కరణ, బాధ్యతాయుతమైన వ్యాపార విధానాల పట్ల నిబద్ధతకు ఈ అవార్డు నిదర్శనమని ఆదాని కృష్ణపట్నం పోర్టు సిఇఒ జగదీష్ పటేల్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# రాజకీయాలను శాసిస్తున్న మతోన్మాదం

### పుస్తక మహోత్సవంలో బి.వి.రాఘవులు

'విద్వేష రాజకీయాలు' పుస్తకాలను ఆవిష్కరిస్తున్న బివి రాఘవులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

రాజకీయాలను మతోన్మాదం, విద్వేషం శాసిస్తున్నా యని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న 35వ పుస్తక మహోత్సవం ఎనిమిదో రోజు బుధవారం రామోజీరావు సాహిత్య వేదికపై ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన 'రైతును ముంచుతున్న పాలకుల విధానాలు', 'అసమానతలు - ఆర్థిక విధానాలు', 'విద్వేష రాజకీయాలు' పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ రచించిన ఈ పుస్తకాలను ఆవిష్కరించిన అనంతరం రాఘవులు మాట్లాడుతూ.. ప్రార్థనా స్థలాల చట్టాన్ని కూడా కొన్ని రాజకీయ పార్టీలు అపహాస్యం చేస్తున్నాయని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని కూడా రాజకీయాలూ, పెట్టుబడి విధానాలూ ప్రభావితం చేయడం శోచనీయమన్నారు. ప్రకృతి వ్యవసాయం పేరుతో జంతువుల మధ్య కూడా వర్ణ వివక్ష ప్రదర్శించేలా పరిస్థితి కనిపిస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయం వెనుక కూడా వర్గపోరాట ధోరణిని ప్రతిబింబిస్తోందని వివరించారు. ప్రపంచంలో చాలా దేశాలకన్నా ఎక్కువగా భారతదేశంలో అసమానతలు ఎక్కువగా ఉండటం బాధాకరమన్నారు. పాత తప్పిదాలను సరి చేయడానికి కొత్త తప్పిదాలు చేయడం సరికాదని పేర్కొన్నారు. దేశంలో ఐక్యతనూ, సమానత్వాన్నీ ఈ విద్వేషాలు చెడగొడతాయని వెల్లడించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకులు ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ.. నాగరికత పేరుతో సామాజిక అంశాలకు దూరం కావడం దురదృష్టకరమన్నారు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మలచుకోవాలని సూచించారు.

సంప్రదాయ మూలాలను మరచిపోకూడదని తెలిపారు. రచయిత వి.రాంభూపాల్ మాట్లాడుతూ వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు పెరగడం, వ్యవసాయ రుణాలు నిజమైన రైతులకు అందకపోవడం, గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో రైతులకు వ్యవసాయం భారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు ప్రయోగాలు చేసినప్పుడు విజయం సాధించగలిగే పరిస్థితులు ఉంటాయ న్నారు. అలాంటి ప్రయోగాలకు ప్రభుత్వమూ, సమాజమూ మద్దతునివ్వాలని సూచించారు. వినిమయ సంస్కృతి వల్ల అనేక పేద కుటుంబాలు నిరుపేదలుగా, దరిద్రులుగా మారిపోతున్నా యన్నారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ కె.లక్ష్మయ్య మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక అంశాలపై తాము నిరంతరం కొత్త కొత్త రచనలను పాఠకులకు అందుబాటులోకి తెస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో వీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఔట్‌సోర్సింగ్‌పై కత్తెర?

- కొత్త బడ్జెట్‌కు ఆర్థికశాఖ మార్గదర్శకాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రానున్న బడ్జెట్ కోసం రాష్ట్ర ఆర్థికశాఖ కసరత్తు ప్రారంభించింది. ఈ మేరకు ప్రభుత్వ శాఖలు, శాఖాధిపతుల కార్యాలయాలు తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శకాలను విడుదల చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలుపై పలు ఆంక్షలు ఈ మార్గదర్శకాల్లో ఉండటం చర్చనీయాంశంగా మారింది. పూర్తిస్థాయిలో శాశ్వత ఉద్యోగాల నియామకాలకు కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వాలు సిద్ధపడని సంగతి తెలిసిందే. దీంతో నిరుద్యోగులకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలే దిక్కుగా మారాయి. తాజా ఆంక్షలతో భవిష్యత్తుల్లో ఈ మాత్రపు ఉపాధి లభించడం కూడా కష్టంగా మారనుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ తరహా కొత్త నియామకాలను అనుమతించేది లేదని స్పష్టంగా ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పుడున్న ఉద్యోగాల సంఖ్యను కూడా నిశితంగా సమీక్షిం చాలని, సంఖ్యను సాధ్యమైనంత మేర తగ్గించాలని సూచిం చారు. ప్రస్తుతం ఎంత మంది ఉన్నారు? వారికిస్తున్న జీతాలు, చేస్తున్న పని తదితర అంశాలను కూడా పూర్తిస్థాయిలో సమీక్షించాలని పేర్కొనడం గమనార్హం.

**కొనసాగుతున్న పథకాలపై..**

రాష్ట్రంలో కొనసాగుతున్న పథకాలపై దృష్టి పెట్టాలని, వాటి ప్రాధాన్యత, కొనసాగించేందుకు కావాల్సిన నిధులు, వాటివల్ల లభించే ఫలాలు కూడా బడ్జెట్ ప్రతిపాదనల్లో పేర్కొనాలని సూచించింది. ఉపయోగం లేని పథకాలను మూసేసి, ఉద్యోగులను ఇతర శాఖలకు బదిలీ చేయాలని సూచించింది.

## నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

- సంక్షేమ హాస్టళ్ల దుస్థితిని వివరించండి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

పేద పిల్లలు చదువుకునే హాస్టళ్ల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమని హైకోర్టు తేల్చి చెప్పింది. తగినంత నిధులు కేటాయించకుండా ఉంటే హాస్టల్ విద్యార్థులు అవస్థలు పడుతూనే ఉంటారని ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లలు నేలపై ఎందుకు నిద్రపోతారో అర్థం చేసుకోవాలంది. హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు, నిర్వహణపై ప్రభుత్వం నివేదిక ఇవ్వాలంది. ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన రూ.143 కోట్లు ఎలా సరిపోతాయని ప్రశ్నించింది. జిల్లాల్లోని హాస్టళ్లను సందర్శించి అందులోని విద్యార్థులతో మాట్లాడి నివేదిక ఇవ్వాలంది. విచారణను మూడు వారాలకు వాయిదా వేస్తున్నట్లు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ప్రకటించింది. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్ల దుస్థితిపై నివేదిక ఇవ్వాలంది. హాస్టళ్లకు కేటాయించిన నిధుల్లో ఎంత మేరకు ఖర్చు చేశారో, ఇంకా నిధులు ఉన్నాయా లేవా, ఇంకా అవసరం ఉందా వంటి వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణకు సంక్షేమశాఖ కమిషనర్ ఆన్‌లైన్‌లో హాజరుకావాలంది. జిల్లాల్లోని హాస్టళ్లను జిల్లా ఉన్న న్యాయ సేవాధికార సంస్థలు సందర్శించి అక్కడి స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని కూడా ఆదేశించింది. పౌష్టికాహారం, తాగునీరు, దుప్పట్లు, దోమ తెరలు వంటి కనీస వసతుల కల్పనపై రిపోర్టు ఇవ్వాలంది.

జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పించాలని, ఆ విధమైన వాతావరణం లేదంటూ కాకినాడకు చెందిన కీతినీడి అఖిల్ శ్రీగురు తేజ 2023లో పిల్ దాఖలు చేశారు. న్యాయవాది అరుణ్ శౌరి వాదిస్తూ, మరుగుదొడ్లు లేక ఆడపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సింగమనేని ప్రణతి ప్రతివాదన చేస్తూ, హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు పెంచుతామని, 1:7 నిష్పత్తిలో మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ కౌంటర్‌లో హాస్టల్స్‌లో చదివే పిల్లలు, వారి కులాల ప్రస్తావన చేయడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. పిల్లల కులాలు ఎందుకని, వారి కులాలతో సంబంధం ఏమిటని ప్రశ్నించింది. పూర్తి వివరాలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను ఆదేశించింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

## రెండో రోజూ అభ్యంతరాల వెల్లువ

- ట్రూ అప్, ఎఫ్‌పిపిసిఎ, సర్‌ఛార్జీల రద్దుకు డిమాండ్
- విజయవాడలో ముగిసిన ఎపిఇఆర్‌సి అభిప్రాయ సేకరణ

ఎపిఇఆర్‌సి అభిప్రాయ సేకరణలో వినతిని అందజేస్తున్న కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ వినియోగదారులపై మోయలేని భారంగా మారడం, పరిశ్రమలు మూతకు కారణమవుతున్న ట్రూ అప్ ఛార్జీలు, ఎఫ్‌పిపిసిఎ, సర్‌ఛార్జీలను రద్దు చేయాలని పలు పార్టీలు, వివిధ సంఘాలు, వినియోగదారులు, పరిశ్రమల యజమానులు.. విద్యుత్ నియంత్రణ మండలి దృష్టికి తీసుకొచ్చారు. విజయవాడలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ రెండో రోజైన బుధవారం కొనసాగింది. అభ్యంతరాలను మండలి ఛైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్, సభ్యులు పి వెంకటరామరెడ్డి వ్యక్తిగతంగా, ఆన్‌లైన్‌లో స్వీకరించారు.

అదానితో ఒప్పందానికి ఎపిఇఆర్‌సి అనుమతిని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. ఎపిఇఆర్‌సికి తమ అభ్యంతరాలు తెలిపిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేటు సంస్థలకు దోచిపెట్టేందుకే ప్రభుత్వాలు విద్యుత్ కొనుగోలు చేస్తున్నాయని తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయడంపైనా ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని కోరినట్లు చెప్పారు. అదానితో ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని కోరారు. సిఎం చంద్రబాబు ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లు, అదానితో విద్యుత్ ఒప్పందాలను వ్యతిరేకించారని, అధికారంలోకి వచ్చిన అనంతరం అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన తప్పులకు నేడు వినియోగదారులు మూల్యం చెల్లించాల్సి రావడంతో ప్రస్తుత ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందన్నారు.

అదనపు ఛార్జీలు కట్టలేని పేద, మధ్యతరగతి వినియోగదారులకు సమయం ఇవ్వకుండా కనెక్షన్ కట్ చేస్తున్నారని మండలి ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ ప్రమాద బీమాను పెంచాలన్నారు. 20 రోజుల్లోనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని, సిబ్బంది కొరతను తీర్చాలని కోరారు.

విద్యుత్ వినియోగదారుల ఐక్య వేదిక కన్వీనర్ ఎంవి ఆంజనేయులు మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రయోజనం ఉందని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడమేనన్నారు. దేశంలో లభ్యమవుతున్న బొగ్గును వదిలి, విదేశాల నుంచి అధిక ధరలకు బొగ్గును దిగుమతి చేసుకోవడాన్ని తప్పుబట్టారు. ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలన్నారు.

ఎపి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ ప్రతినిధి పి కోటిరావు మాట్లాడుతూ.. గ్రీన్ పవర్‌ను ప్రోత్సహించాలన్నారు. విద్యుత్ ఛార్జీలు ఏటా పెరిగిపోతున్నాయని, దీనికితోడు అదనపు ఛార్జీలతో పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, వినియోగదారులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

శ్రీకాకుళం జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్త రాజేష్‌బాబు మాట్లాడుతూ.. తన పరిశ్రమకు ఒకేసారి వివిధ ఛార్జీల పేరుతో రూ.4 కోట్లు చెల్లించాలని ఆదేశించారని చెప్పారు. తగిన సమయం కూడా ఇవ్వకుండా వెంటనే సరఫరా నిలిపివేయడంతో నష్టాల పాలైనట్లు తెలిపారు. విశాఖలో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు 22 మూతపడినట్లు పేర్కొన్నారు.

గన్నవరానికి చెందిన ఎ జీవా మాట్లాడుతూ.. విద్యుత్ సర్వీసు కోసం తాను సబ్‌స్టేషన్‌కు వెళ్లి అడిగితే అధికారులు ఫార్మాలిటీస్ ఇవ్వాలన్నారని మండలి దృష్టికి తీసుకొచ్చారు. తాతా సుబ్రమణ్యం, కుమారస్వామి, తాతినేని వెంకటేశ్వరరావు, పి సాంబశివరావు, గణేష్, హనుమయ్య తదితరులు తమ అభ్యంతరాలను తెలియజేశారు.

**అభిప్రాయం వ్యక్తం చేసిన 60 మంది**

విద్యుత్ నియంత్రణ మండలి నిర్వహించిన రెండు రోజుల ప్రజాభిప్రాయ సేకరణలో వ్యక్తిగతంగా, ఆన్‌లైన్ విధానంలో మొత్తం 60 మంది తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రెండో రోజైన బుధవారం 59 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, ప్రత్యక్షంగా 14 మంది, ఆన్‌లైన్‌లో 25 మంది అభ్యంతరాలు వ్యక్తం చేశారు. మొదటి రోజు 27 మంది నమోదు చేసుకోగా, 11 మంది ప్రత్యక్షంగా, 10 మంది ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు వ్యక్తం చేశారు. విద్యుత్ పంపిణీ సంస్థల ఎమ్‌డిలు, ఎపిఇఆర్‌సి అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న గంగారావు

## విశాఖ ఉక్కుపై వివక్ష ఎందుకు ?

- స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకే మిట్టల్ స్టీల్ ఏర్పాటు
- సిపిఎం కార్పొరేటర్ బి గంగారావు
- ముగిసిన ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ 36 గంటల దీక్ష

ప్రజాశక్తి - గాజువాక, ఉక్కునగరం (విశాఖపట్నం)

దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వివక్ష ప్రదర్శించడం దారుణమని సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకే అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రాంతంలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ను తీసుకొస్తున్నారని తెలిపారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగిస్తూ సెయిల్‌లో విలీనం చేయాలని, ఉద్యోగుల వేతనాలను సకాలంలో చెల్లించాలని, విశాఖ పర్యటనలోనే ప్రధాని మోడీ ఉక్కుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన 36 గంటల నిరవధిక దీక్ష బుధవారం రాత్రితో ముగిసింది. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ.. మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ముద్దు, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ వద్దా ? అని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఉక్కు కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పడి ఇన్నేళ్లవుతున్నా సొంత గనులు కేటాయించకపోవడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ నేడు ఆ మాటను తప్పారన్నారు. మోడీ సర్కారు పట్ల టిడిపి కూటమి ప్రభుత్వ మెతక వైఖరి తగదన్నారు. పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, డి.ఆదినారాయణ మాట్లాడుతూ విశాఖ ఉక్కుపై గత వైసిపి, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వాల తీరు ఒకేలా ఉందన్నారు. ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి, కెఎం.శ్రీనివాసరావు, వైటి.దాస్, వి.శ్రీనివాసరావు, ఎస్.మోహన్ బాబు, కారు రమణ, ఉరుకూటి సుహాసిని, దాసరి శ్రీనివాస్, ప్రసాద్, టివికె.రాజు, ఎన్.రాజేంద్రప్రసాద్, రామారావు పాల్గొన్నారు.

## రెండు దశల్లో రాజధాని నిర్మాణాలు

- సిఆర్‌డిఎ నిర్ణయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని పరిధిలో చేపట్టే నిర్మాణాలను రెండు దశల్లో చేయాలని సిఆర్‌డిఎ నిర్ణయించింది. దీనికి అనుగుణంగా ఈ నెలాఖరులోపు పనులు చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. మొత్తం పనులను సివిల్ వర్క్సు, ఇంటీరియర్‌గా విభజించి చేపట్టనున్నారు. సివిల్ పనులకు ప్లాన్లు సిద్ధమైనా ఇంకా ఇంటీరియర్ పనులకు ప్లాను సిద్ధం కాలేదు. ఈ ప్లాను కూడా సిద్ధం కావడానికి మరో తొమ్మిది నెలలు పట్టే అవకాశం ఉంది. అప్పటి వరకూ ఆగితే పనులు జాప్యం అయ్యే అవకాశం ఉండటంతో సివిల్ పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. ఈ పనులకు సంబంధించి ఈ నెల 18వ తేదిన టెండర్లు పిలిచిన సంగతి తెలిసిందే. బుధవారం మరో తొమ్మిది పనులకు టెండర్లు పిలిచారు. గురువారం మరో రెండు టెండర్లు పిలవనున్నారు. ఇప్పుడున్న ప్లానులో భాగంగా తొలిదశలో ఐదు సెక్రటేరియట్ భవనాలు, అసెంబ్లీ, హైకోర్టు భవనాలు నిర్మించనున్నారు. ఈ మూడింటికి ఇంటీరియర్ ప్లాను సిద్ధం కాలేదు. వీటిల్లో సెక్రటేరియట్ భవనాల(జిఎడి)లో ఒకటి 50 అంతస్తులు నిర్మిస్తారు. మరో నాలుగు 42 అంతస్తుల ఎత్తు వరకూ నిర్మిస్తారు. వాటికి సమాంతరంగా రోడ్ల పనులూ చేపడతామని అధికారులు చెబుతున్నారు. రెండేళ్లలో పనులన్నీ పూర్తయ్యేలా, మరో ఏడాదిలోపు సౌకర్యాల కల్పన పూర్తి చేసేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే హైకోర్టు వెనుకవైపు చేపట్టిన 12 బ్లాకుల్లో నిర్మాణాలన్నీ పూర్తయితే ఇంటీరియర్ పూర్తి కావాల్సి ఉంది. కొత్తగా నిర్మించబోయే సివిల్ వర్కులతోపాటు, గతంలో నిర్మించి వదిలేసిన భవనాల్లో ఇంటీరియర్ పనులూ చేపట్టనున్నారు. ఉద్యోగులు, అధికారుల భవనాల్లో ఇంటీరియర్ కోసమే రూ.1600 కోట్ల వరకూ ఖర్చయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు.

## ఆ 2 సినిమాల టిక్కెట్ల అధిక రేట్లు పది రోజులకే..

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

త్వరలో విడుదల కానున్న డాకు మహారాజ్, గేమ్ ఛేంజర్ సినిమా టిక్కెట్లను మొదటి 14 రోజులపాటు అధిక ధరలకు అమ్ముకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని తప్పుపడుతూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. అధిక ధరలకు టిక్కెట్లను అమ్ముకునేందుకు ఆ చిత్ర నిర్మాతలకు అనుమతినిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అధిక ధరలను మొదటి 10 రోజులకే పరిమితం చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశించింది. బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్, రామ్‌చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ సినిమాల టిక్కెట్లను మొదటి 14 రోజుల పాటు అధిక ధరలకు అమ్ముకునేందుకు ప్రభుత్వం అనుమతినివ్వడాన్ని గుంటూరుకు చెందిన అరిగెల శ్రీనివాసులు హైకోర్టులో సవాల్ చేస్తూ పిల్ దాఖలు చేశారు. న్యాయవాది గుండాల శివప్రసాద్ రెడ్డి వాదిస్తూ, రూ.100 కోట్లకు పైగా బడ్జెట్ ఉన్న సినిమాలకు మొదటి 10 రోజులకు అధిక ధరలకు టిక్కెట్లు అమ్ముకునేందుకు అనుమతినిస్తూ ప్రభుత్వం గతంలో జిఒ 13 జారీ చేసిందన్నారు. ఇప్పుడు అందుకు విరుద్ధంగా 14 రోజులపాటు అధిక ధరలకు టిక్కెట్లు అమ్ముకునేందుకు ప్రభుత్వం మెమో ఇచ్చిందన్నారు.

## తిరుపతిలో తొక్కిసలాట

(మొదటి పేజీ తరువాయి)

రుయా ఆస్పత్రికి చేరుకుని చికిత్స ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ ఘటనలో నేపథ్యంలో ఆంధ్ర, తెలంగాణా, తమిళనాడు రాష్ట్రాల నుంచి వచ్చిన సందర్శకుల కుటుంబసభ్యులు భయాందోళనకు గురవుతున్నారు. తమ వారి క్షేమ సమాచారం కోసం ఫోన్లలో ఆరా తీస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యులను సిపిఎం నాయకులు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం పరామర్శించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా యుద్ధప్రాతిపదికన భద్రతా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

**చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి... ఫోన్‌లో ఆరా...**

ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దుర్ఘటన తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. గాయాల పాలైన వారికి చికిత్స అందించాలని అధికారులతో చంద్రబాబు స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి వెళ్లి సహాయ చర్యలు చేపట్టాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. ప్రధాని మోడీ రాకతో వైజాగ్ పర్యటనలో ఉన్న చంద్రబాబునాయుడు గురువారం తిరుపతి చేరుకుని బాధితులను పరామర్శిస్తారని సమాచారం. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ మరో ప్రకటనలో పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

**మెరుగైన వైద్య సేవలందించాలి : వైఎస్ జగన్**

తిరుమల తొక్కిసలాట ఘటనపై మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడ్డవారికి మెరుగైన వైద్య సేవలందించాలని ప్రభుత్వాన్ని కోరారు. పరిస్థితులు చక్కదిద్దేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**రద్దీ నియంత్రణలో వైఫల్యం**

వైకుంఠ ఏకాదశి ద్వాదశిలను పురస్కరించుకుని తిరుపతిలో ఏర్పాటు చేసిన ఎనిమిది టోకెన్ జారీ చేయు కేంద్రాల వద్ద సందర్శకులు రద్దీని దృష్టిలో ఉంచుకుని, టోకెన్ల జారీ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు నెల రోజులుగా టిటిడి కసరత్తు చేస్తున్నా, నియంత్రణలో వైఫల్యం చెందిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా ఎస్పి ఎల్.సుబ్బరాయుడు, టిటిడి చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి శ్రీధర్ స్వయంగా పర్యవేక్షణ చేస్తూ రద్దీ నియంత్రణకు ఏర్పాట్లు చేపట్టారు. ప్రెజర్ పాయింట్ల వద్ద అదనపు సిబ్బందిని నియమించినా, కొందరు పోలీసుల ఓవర్ యాక్షన్ వల్ల తోపులాట చోటుచేసుకుందని తెలుస్తోంది. ఈ ఘటన నేపథ్యంలో క్యూలో ఉన్న వారికి వెంటనే టోకెన్లను టిటిడి జారీ చేసింది.

# ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం

- వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- నెల్లూరు జిల్లా నాయకులతో ముగిసిన సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి జెండా మోసిన ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని, వారిని జాగ్రత్తగా చూసుకుంటామని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నెల్లూరు జిల్లా నాయకులతో జగన్ బుధవారం సమావేశం నిర్వహించారు. వైసిపి కార్యకర్తలకు అన్యాయం చేసిన వారిని ఉపేక్షించేది లేదని ఆయన అన్నారు. ఆరు నెలలకే కూటమి ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత కనిపిస్తోందని, మేనిఫెస్టోలో హామీలు గాలికి వదిలేశారని అన్నారు. గతంలో ఇచ్చిన పథకాలను రద్దు చేశారని, కుటుంబంలో అందరికీ మేలు చేశామని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు మోసం చేస్తారని, అప్పుడే చెప్పానని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వంలో ప్రతి పథకాన్ని గడప వద్దకు తీసుకెళ్లామని, ఇప్పుడు ఒక్క పథకమూ అందడం లేదని వివరించారు. ఆరు నెలల కూటమి పాలనలో అంతా బాదుడేనని ప్రజలకు, ఇచ్చేదేమీ కనిపించడం లేదని తెలిపారు. 15 వేల కోట్ల కరెంటు ఛార్జీలు పెంచారని, గ్రామీణ రోడ్లకూ టోల్ బాదుడుకు సిద్ధమయ్యారని వివరించా రు. రిజిస్ట్రేషన్ ఛార్జీలూ పెంచుతున్నారని, పిల్లల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఎగ్గొట్టారని, విద్యాదీవెన, వసతిదీవెన పెండింగ్‌లో రూ.3,900 కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. మూడువేల కోట్లు ఆరోగ్యశ్రీకి బకాయి పడ్డారని, ఉచిత వైద్యం పేదవాడికి దూరమైందని, పథకాల కోసం టిడిపి నేతల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.

వైసిపి ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీని నెలకు రూ.800 కోట్లతో 3,300 ప్రొసీజర్లకు పెంచి అమలుచేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం మూడు లక్షల పెన్షన్లు రద్దు చేశారని తెలిపారు. తెలుగుదేశం నాయకులు అమలు చేస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ సమయంలో ప్రజలకు అండగా నిలవాలని కోరారు. సోషల్ మీడియాను ప్రజల కోసం బలమైన ఆయుధంగా వాడాలని, ప్రతి సమస్య మీద చంద్రబాబును నిలదీయాలని అన్నారు.

**7 నెలల్లో రూ.1.20 లక్షల కోట్ల అప్పు : గడికోట**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో రూ.1.20 లక్షల కోట్ల అప్పులు చేశారని మాజీ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. వైసిపి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెచ్చిన అప్పులు ఏమి చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, రాష్ట్రంలో ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తోందని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే జిడిపి 10 శాతం తగ్గిందని అన్నారు.

**పారిశ్రామిక వేత్తల బెంబేలు : మార్గాని**

టిడిపి నేతల బెదిరింపులతో పారిశ్రామికవేత్తలు బెంబేలు ఎత్తుతున్నారని వైసిపి అధికార ప్రతినిధి మార్గాని భరత్ అన్నారు. ఏడు నెలల్లో చంద్రబాబు ఒక్క పరిశ్రమనూ తీసుకురాలేకపోయారని విమర్శించారు. గతంలో జగన్ తెచ్చిన ప్రాజెక్టులకే ప్రధాని మోడీతో శంకుస్థాపనలు చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి ప్రధాని మోడీ రావడం మంచి పరిణామమని అన్నారు. గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు, రైల్వేజోన్, బల్క్ డ్రగ్ ప్రాజెక్టు అన్నీ వైసిపి ప్రభుత్వంలో తీసుకొచ్చినవేనని పేర్కొన్నారు.




## ఉపయుక్తంగా కౌలు రైతు సంఘం డైరీ

- స్పెషల్ సిఎస్ బి రాజశేఖర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కౌలు రైతులకు, రైతులకు ఉపయోగపడే ఎంతో సమాచారం ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రూపొందించిన డైరీలో ఉందని వ్యవసాయ శాఖ స్పెషల్ సిఎస్ బి రాజశేఖర్ తెలిపారు. సమగ్ర సమాచారంతో డైరీని తీసుకొచ్చిన సంఘం నాయకులను అభినందించారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సివిల్ సప్లైస్ కమిషనర్ వీరపాండియన్, ఎమ్‌డి మనజీర్ జిలానితో కలిసి రాజశేఖర్ నూతన డైరీని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు మాట్లాడుతూ.. వ్యవసాయానికి సంబంధించి వివిధ శాఖల్లో విడివిడిగా ఉన్న సమాచారాన్ని ఈ డైరీలో పొందుపరిచి రైతులకు, కౌలు రైతులకు, ఉపాధి హామీ కూలీలకు ఉపయోగపడే విధంగా ప్రచురించినట్లు తెలిపారు. ఈ డైరీ వ్యవసాయ రంగంలో ఉన్నవారికి కరదీపికగా ఉంటుందన్నారు. పంటలకు మద్దతు ధరలు, పంటల బీమాలో రైతుల వాటా, బ్యాంకు రుణాలు, కౌలు గుర్తింపు కార్డు పొందడం, ఇ-క్రాప్ నమోదు, తదితర అంశాలను డైరీలో వివరించామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ, గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర్, రైతు సంఘం నాయకులు ఎస్ మురళీకృష్ణారెడ్డి, కె నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాస్క్ తప్పనిసరి : టిటిడి

- హెచ్ఎంపివి వైరస్ నేపథ్యంలో అలర్ట్

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

దేశవ్యాప్తంగా హెచ్ఎంపివి కేసులు నమోదు కావడంతో అటు భారత ప్రభుత్వం, ఇటు తెలంగాణ, ఎపి ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. తాజాగా ఈ వైరస్‌పై తిరుమల తిరుపతి దేవస్థానం అలర్ట్ ప్రకటించింది. శుక్రవారం నుంచి వైకుంఠ ద్వారదర్శనాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో యాత్రికులు మాస్క్‌తో పాటు స్వీయ జాగ్రత్తలు పాటించాలని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు సూచించారు. బుధవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో మీడియాతో ఆయన మాట్లాడారు. వైరస్ నేపథ్యంలోయాత్రికులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి గోవిందమాల యాత్రికులకు ప్రత్యేకంగా ఎలాంటి ఏర్పాట్లు ఉండవన్నారు. అందరు యాత్రికులతో కలిసి ఎస్ఎస్‌డి టోకెన్లు తీసుకొని వైకుంఠద్వార దర్శనాలకు రావాలని విజ్ఞప్తి చేశారు. టోకెన్లు, టికెట్లు లేని యాత్రికులను తిరుమలకు అనుమతించరని...కొందరు అసత్య ప్రచారాలు చేయడంపై మండిపడ్డారు. తిరుమలకు వచ్చే యాత్రికులను ఎవరూ ఆపబోరన్నారు.

**నేడు ఉదయం ఐదు గంటలకు టోకెన్లు జారీ**

వైకుంఠ ద్వార దర్శనం ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం టోకెన్లు జారీ విధానంలో మార్పు చేశారు. గతంలో తెల్లవారుజామున రెండు గంటలకు టోకెన్లు ఇస్తామని టిటిడి ప్రకటించింది. స్వల్ప మార్పులు చేస్తూ గురువారం ఉదయం ఐదు గంటలకు టోకెన్లు జారీ చేయనున్నట్లు పేర్కొంది. రోజుకు 40 వేల చొప్పున సర్వదర్శనం యాత్రికులకు టోకెన్లు జారీ చేయనున్నారు.

# టిటిడి వేదికగా సంఘ్‌పరివార్ విద్వేష ప్రచారం

- సమాచార విభాగంలో ముస్లిం ఉన్నారని సోషల్ మీడియాలో ప్రచారం
- ఖండించిన ఇఒ... దర్యాప్తునకు ఆదేశం
- పోస్టు పెట్టింది ఉత్తరప్రదేశ్‌కు చెందిన బిజెపి కార్యకర్తగా గుర్తింపు

**ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో**

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) వేదికగా బిజెపి, ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు మతతత్వ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఎంతో ప్రశాంతంగా ఉన్న తిరుమలలో అబద్ధపు ప్రచారాలతో భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. మతాల మధ్య ఉద్రిక్తతలు రెచ్చగొట్టాలని చూస్తున్నారు. టిటిడి సమాచార విభాగంలో ప్రజాసంబంధాల అధికారిగా నిష్కా బేగం అనే ముస్లిం ఉన్నారని, ఆమె ఇంటిపై ఇడి దాడులు చేసిందని, నగలను స్వాధీనం చేసుకుందని మతతత్వవాదులు సోషల్ మీడియం వేదికగా ప్రచారం చేశారు. విషయం తెలుసుకున్న టిటిడి ఇఒ శ్యామలరావు దేవస్థానంలోని సోషల్ మీడియా విభాగానికి ఈ సమాచారం అందించారు. ఈ పోస్టు చేసిన వ్యక్తి ఎవరో గుర్తించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో టిటిడి సమాచార, సోషల్ మీడియా విభాగాలు ఆరా తీయగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన మాజీ సైనికుడు, బిజెపి కార్యకర్త, మోడీ అభిమాని కోల్ ఎకెఎస్ రాణా ఈ పోస్టు పెట్టినట్లు తేలింది. దీంతో, సీరియస్ అయిన టిటిడి అతనిపై కఠిన చర్యలు తీసుకునేందుకు నోటీసులు పంపేందుకు రంగం సిద్ధం చేసింది. సోషల్ మీడియాలో 'బిజెపి కార్యకర్త' రాణా పెట్టిన పోస్టులో 'ఫేక్' అని టిటిడి పెట్టింది. ఈ నేపథ్యంలో టిటిడి పిఆర్ఒ నీలిమ 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ భక్తుల మనోభావాలు దెబ్బతినేలా దేవస్థానంపై అభాండాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రధాని మోడీ పర్యటించిన రోజునే ఇటువంటి విద్వేష ప్రచారం జరగడం గమనార్హం.

**గతంలోనూ బిజెపి రాద్ధాంతం**

2014లో ఆలయ ప్రాకారం చుట్టూ సోలార్ విద్యుత్‌తో కూడిన సేఫ్టీ గ్రిల్స్ అమర్చారు. ఆ గ్రిల్స్ రూపకల్పనలో శిలువ గుర్తు ఉందని, కావాలనే ఆ విధంగా గ్రిల్స్ తయారు చేశారని అప్పట్లో బిజెపి రాద్ధాంతం చేసింది. దీనిపై టిటిడి వివరణ ఇస్తూ, నామాల ఆకారంలోనే ఉంది తప్ప, శిలువ ఆకారంలో లేదని పేర్కొంది. టిటిడి నిధులతో భక్తుల వసతి సముదాయం (పద్మావతి నిలయం) కట్టారు. శ్రీవారి నిధులతో కట్టిన ఈ భవనాన్ని కలెక్టరేట్‌కు ఇవ్వరాదని, ఒకవేళ ఇస్తే అన్యమతస్తులు రావడం వల్ల అపచారం అవుతుందని ప్రస్తుత బోర్డు సభ్యులు, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి అప్పట్లో కోర్టుకెక్కారు. హైకోర్టు సీరియస్ అయ్యి ప్రజలకు ఉపయోగపడేదే తప్ప, మత ధోరణితో చూడరాదని ఆయనకు మొట్టికాయలు వేసింది. తాజాగా దాదాపు 75 ఏళ్ల పాపవినాశనాన్ని నమ్ముకుని చిన్నచిన్న పూసల దండలు అమ్ముకుంటున్న 500 మంది షికారీ కుటుంబాలను 'మతముద్ర' వేసి కొండనుంచి తరిమేశారు. షికారీల్లో ఒకరు క్రిస్టియన్ యువతిని వివాహం చేసుకోవడాన్ని ఆసరాగా తీసుకొని మతోన్మాదుల ఫిర్యాదు మేరకు ఈ చర్యకు పాల్పడినట్లు ప్రజాశక్తి పరిశీలనలో వెల్లడైంది. తిరుమల అభివృద్ధికి బాసటగా నిలుస్తోన్న తిరుపతి అభివృద్ధికి టిటిడి నిధులు కేటాయించాలని సిపిఎం డిమాండ్ చేస్తుంటే, తిరుపతిలో హిందూయేతరులు కూడా ఉంటారని, అందువల్ల టిటిడి నిధులు ఇవ్వొద్దని బిజెపి అడ్డుపుల్ల వేస్తోంది. 2014లో కడపకు చెందిన పుట్టా సుధాకర్ యాదవ్‌ను టిటిడి చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆయన క్రిస్మస్ సందర్భంగా జరిగిన శాంతి సభలకు వెళ్లారని, అటువంటి వ్యక్తిని టిటిడి చైర్మన్‌గా ఎలా నియమిస్తారని సంఘపరివార్ శక్తులు గగ్గోలు పెట్టాయి. దీంతో, పుట్టా సుధాకర్‌యాదవ్ తాను హిందూవాదినని, క్రిస్టియన్ల ఆహ్వానం మేరకు రాజకీయ నాయకునిగా వెళ్లానని వివరణ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. తిరుమల శేషాచల అడవుల్లో ఫొటో క్రియేట్ చేసి శిలువ ఉందని భజరంగదళ్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఆందోళన చేశారు. ఆ సందర్భంగానూ టిటిడి వివరణ ఇచ్చింది. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఏన్నో ఏదేళ్లుగా బిజెపి, భజరంగదళ్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు అసత్య ప్రచారాలు చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నా టిటిడి వివరణ ఇచ్చుకోవడం తప్ప, వారిపై కఠినమైన చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. తాజా ఘటనలోనైనా కఠిన చర్యలు తీసుకోవాలని, మతోన్మాదుల విద్వేష ప్రచారాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

సోషల్ మీడియాలో 'బిజెపి కార్యకర్త' రాణా పెట్టిన పోస్టులో 'ఫేక్' అని పెట్టిన టిటిడి

సిఎంకు కృతజ్ఞతలు చెబుతున్న రైతు చలపతి

## మారకపోతే ...మారుస్తాం..!

- ఎమ్మెల్యేలకు చంద్రబాబు వార్నింగ్

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

'టిడిపి కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఎన్నికల్లో బ్రహ్మరథం పట్టారు.. వారి నమ్మకాన్ని వమ్ము చేయకూడని బాధ్యత మన అందరిపై ఉంది. రాష్ట్రంలో చాలామంది ఎమ్మెల్యేలు పనిచేయడం లేదు. ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఐదుగురు ఎమ్మెల్యేలు పనిలో లేరని నా దగ్గర లెక్కలున్నాయి. మీరు మారండి.. ప్రజల్లోకి వెళ్లండి... మారకపోతే వచ్చే ఎన్నికల్లో సీటు దక్కదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్మొహమాటంగా ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. మూడు రోజుల పర్యటనలో భాగంగా కుప్పం వచ్చిన చంద్రబాబు తొలిరోజు 'స్వర్ణకుప్పం విజన్ 2029'ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలకు సంబంధించిన 12 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అదేరోజు రాత్రి కుప్పం ద్రవిడ యూనివర్సిటీలో ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా నియోజకవర్గంలో ఎంతమాత్రం పట్టు సాధించారనే విషయమై చంద్రబాబు సమీక్షించారు. ప్రజలకు ఉపయోగపడేలా ఏయే కార్యక్రమాలు చేశారని ఎమ్మెల్యేలను ప్రశ్నించారు. మీ పనిపై తాను జరిపిన సర్వేలో సంతృప్తి లేదన్నారు. ఇకనైనా మార్పు రాకపోతే వచ్చే ఎన్నికల్లో సీటు ఆశించినా ఆశాభంగమే కలుగుతుందని సూచనప్రాయంగా చంద్రబాబు చెప్పినట్లు సమాచారం. తిరుపతి జిల్లాలో ముగ్గురు, చిత్తూరు జిల్లాలో ఇద్దరికి చంద్రబాబు వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది.

**సిఎంకు కృతజ్ఞతలు తెలిపిన రైతు**

వ్యవసాయ బోరుకు పంపుసెట్ కావాలని శాంతిపురం మండలం సోమాపురం గ్రామానికి చెందిన రైతు సి.చలపతి సిఎంకు మంగళవారం అర్జీ ఇచ్చారు. సిఎం ఆదేశాల మేరకు అదేరోజు సాయంత్రం రైతు పొలంలో వ్యవసాయ బోరుకు 10హెచ్‌పి /30 పంపుసెట్ ఏర్పాటు చేసి ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ అధికారులు నీరు అందించారు. బుధవారం ఆర్అండ్‌బి అతిథిగృహంలో ముఖ్యమంత్రిని లబ్ధిదారుడు చలపతి కలిసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. 'రూ.80 వేలు అప్పుచేసి పొలంలో బోరు వేశాను. డబ్బు సరిపోక పంపుసెట్ వేయించలేకపోయాను. పంట మొత్తం ఎండిపోయింది. ఈనెల ఏడో తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కుప్పంలో అర్జీ సమర్పించాను. సిఎం ఆదేశాలతో అధికారులు అదేరోజు సాయంకాలం పంపుసెట్ బిగించి పొలానికి నీరు అందించారు. నా ఆనందాన్ని అవధుల్లేవని, సిఎం చంద్రబాబు తనపాలిట దేవుడు' అని అభిమానాన్ని చాటుకున్నారు.

## విశాఖ కేంద్ర కారాగారంలో మళ్లీ సెల్‌ఫోన్ కలకలం

**ప్రజాశక్తి - ఆరిలోవ (విశాఖపట్నం)**

విశాఖ కేంద్ర కారాగారంలో తవ్వే కొద్దీ సెల్ ఫోన్లు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఇప్పటికే పెన్నా బ్యారక్, నర్మదా బ్యారక్ పరిసర ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు దొరికిన విషయం తెలిసిందే. ఆ ఘటనలను మరువకముందే బుధవారం గంగా బ్లాక్ వద్ద మరో కీ ప్యాడ్ సెల్‌పోన్ లభ్యమైంది. రోజువారీ తనిఖీలు, ప్రత్యేక తనిఖీల్లో భాగంగా బుధవారమూ జైలు అధికారులు చర్యలు చేపట్టారు. వారికి సెల్‌ఫోన్ లభ్యం కావడంతో ఆ విషయమై ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు సాగుతోంది.

## మరోసారి పోలీసు కస్టడీకి వర్రా

- సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో విచారణ

**ప్రజాశక్తి-కడప అర్బన్**

వైసిపి సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్‌రెడ్డిని పోలీసులు మరోసారి కస్టడీకి తీసుకున్నారు. కడప జిల్లా కోర్టు అనుమతి మేరకు రవీందర్‌రెడ్డిని రెండు రోజులపాటు పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. కడప సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్లో బుధవారం లాయర్ సమక్షంలో విచారించారు.

వర్రాను అదుపులోకి తీసుకున్న వెంటనే ఆయనను కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. గతంలో వర్రా ఇచ్చిన స్టేట్‌మెంట్ మేరకు కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి పిఎ బండి రాఘవరెడ్డిపై పులివెందుల పోలీసులు కేసు నమోదు చేయగా ఆయన ముందస్తు బెయిల్ తీసుకుని పలుమార్లు పోలీసు విచారణకు హాజరయ్యారు. ఇటీవల ఆయన బెయిల్ రద్దు కావడంతో పులివెందుల పోలీసులు కూడా ఆయనను మంగళవారం విచారించారు. గతంలో వర్రా రవీందర్‌రెడ్డిని కస్టడీలోకి తీసుకున్న పోలీసులు రాష్ట్రంలో నమోదైన పలు కేసులకు సంబంధించి విచారణలో భాగంగా సంబంధిత కోర్టుల్లో హాజరవుతున్నారు. కడప జిల్లా కోర్టు అనుమతి ఇచ్చిన మేరకు మరల రెండు రోజులపాటు వర్రాను పోలీసులు విచారిస్తున్నారు.

# గ్లోబల్ డిజిటల్ టెక్నాలజీ పవర్ హౌస్‌గా ఎపి

సమ్మిట్‌లో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

- పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పాఠ్యపుస్తకాల్లో మార్పులు
- రాష్ట్ర విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)**

రానున్న కాలంలో ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ డిజిటల్ టెక్నాలజీ పవర్ హౌస్‌గా మారనుందని రాష్ట్ర విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఎపి డిటిఐ (డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ), ఎస్‌టిపిఐ (సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు విశాఖలోని విఎంఆర్‌డిఎ వేదికగా నిర్వహిస్తున్న ఎపి డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్-2025కు ఆయన బుధవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మట్లాడుతూ ఇన్నోవేషన్, డీప్ టెక్ నైపుణ్యాన్ని పెంపొందించడం ద్వారా ఆర్థిక వృద్ధి, సామాజిక పురోగతి సాధ్యపడుతుందని తెలిపారు. అభివృద్ధికి ఇన్నోవేషన్ చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ఎఐ, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, హెల్త్ టెక్, ఎడ్యుటెక్, ఎనర్జీ స్మార్ట్ సొల్యూషన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ టెక్నాలజీ రాబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయని తెలిపారు. సామాజిక సమస్యల పరిష్కారానికి ఐటి, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్, స్మార్ట్ టెక్నాలజీస్ కలసికట్టుగా పని చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. 2047 నాటికి రాష్ట్రాన్ని రెండు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దిశగా తీర్చిదిద్దుతామన్నారు. ఉద్యోగాలు పొందేందుకు, కల్పించేందుకు ఇన్నోవేషన్‌తోపాటు పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలో సమూల మార్పులు తీసుకువస్తామని తెలిపారు. త్వరలోనే టిసిఎస్ రాబోతోందని, రాష్ట్రంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను నెలకొల్పుతామని, పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ ఎంపి ఎం శ్రీభరత్, డిటిఎస్ఎఫ్ చైర్మన్ శ్రీధర్ కొసరాజు, కెడిఇఎమ్ చైర్మన్ బివి.నాయుడు, అలోన్ ఒఎస్ కో-ఫౌండర్ సిపి గుర్నాని, ఎస్‌టిపిఐ డైరెక్టర్ సి.కవిత, ఐటిఎపి ప్రెసిడెంట్ లక్ష్మీ ముక్కవిల్లి పాల్గొన్నారు.

# తెలుగు భాషను కాపాడుకోవాలి

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- జిజియులో 2వ ప్రపంచ తెలుగు మహాసభ ప్రారంభం

**ప్రజాశక్తి - రాజానగరం (తూర్పు గోదావరి జిల్లా)**

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

తల్లి లాంటి తెలుగు భాషను కాపాడుకోవాలని, తెలుగు భాషా వికాసం ఉద్యమంగా సాగాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జిజియు) ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 2వ ప్రపంచ తెలుగు మహాసభ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. జిజియు ఛాన్సలర్ కెవివి.సత్యనారాయణరాజు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలుగు భాషను, సంస్కృతిని ఆంగ్లేయులు చెడగొట్టారన్నారని, వాటిని సరిదిద్దుకోవాలన్నారు. ఆదికవి నన్నయ, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం వంటి వారు తెలుగు భాషను సుసంపన్నం చేశారని తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు తెలుగును నేర్చుకుంటుంటే ఆంధ్రాలో ఉంటూ మనం ఎందుకు తెలుగు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. సినీ రచయితలు ఆంగ్ల పదాలను వీలైనంత మేరకు లేకుండా చూసుకోవాలని సూచించారు. తెలుగును ప్రేమించు, ప్రోత్సహించు, కాపాడు అని పిలుపునిచ్చారు.

అనంతరం మహాసహస్రావధాని గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ.. ఒకటో తరగతి నుంచి ఐదవ తరగతి వరకు విధిగా తెలుగు మాధ్యమమే ఉండాలన్నారు. డిగ్రీ వరకు తెలుగు పాఠ్యాంశంగా ఉండాలని కోరారు. రాష్ట్ర అధికార భాషా సంఘ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోన్ చేసి తనను కోరారని, అప్పుడు ఇదే విషయం చెప్పానన్నారు. ఈ రెండు పనులు జరగనప్పుడు భాషా సంఘం ఉన్నా ప్రయోజనం లేదని, ఈ రెండు అమలైతే భాషా సంఘంతో పనే లేదన్నారు. సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ.. తెలుగుదేశం ప్రభుత్వంలో తెలుగు లేశంగా ఉందని పేర్కొన్నారు. భాష కోసం ఉద్యమించే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠ్యాంశాల్లో దోషాలు సరిచేయాలని కోరారు. డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత మధ్య ఈ తెలుగు మహాసభను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త, పి.బంగారయ్య శర్మ, ప్రొఫెసర్ చామర్తి కెటి రామరాజు, మాజీ ఎమ్మెల్సీలు గొనె ప్రకాశరావు, రవివర్మ, శతావధాని కడిమెళ్ల వరప్రసాద్, న్యూక్లియర్ శాస్త్రవేత్త ఆర్.శ్యామసుందర్, సాహితీవేత్త ఎర్రాప్రగడ రామకృష్ణ, డాక్టర్ వేదుల శిరీష, జిజియు విసి ఉదయగిరి చంద్రశేఖర్, జిజియు ప్రో ఛాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ పాల్గొన్నారు.

రాఘవమ్మ పాడెను మోస్తున్న సిపిఎం నాయకులు జి.బేబిరాణి, ఐద్వా సీనియర్ నాయకులు సావిత్రి తదితరులు

## రాఘవమ్మ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలుస్తారు

- పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు
- తొత్తరమూడిలో ముగిసిన అంత్యక్రియలు

**ప్రజాశక్తి - అమలాపురం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)**

ప్రజల మనసుల్లో కుడుపూడి రాఘవమ్మ చిరస్థాయిగా నిలిచి ఉంటారని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు అన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం తొత్తరమూడిలో మంగళవారం రాఘవమ్మ అనారోగ్యంతో కన్నుమూశారు. స్వగ్రామం తొత్తరమూడిలో బుధవారం ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. ముందుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు ఆమె భౌతికకాయంపై సిపిఎం జెండాను ఉంచి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఐవి మాట్లాడుతూ ఒక మహిళ కమ్యూనిస్టుగా మారడం ప్రజా సమస్యలపై గొంతు విప్పడమంటే అప్పుడున్న పరిస్థితుల్లో సాధారణ విషయం కాదన్నారు. ఎర్ర జెండా పట్టుకుని ఏళ్ల తరబడి ప్రజా సమస్యలపై పోరాడిన ధీర వనిత రాఘవమ్మ అని కొనియాడారు.

ఒకే కుటుంబం నుంచి భార్యాభర్తలు ప్రజా సమస్యల కోసం ఉద్యమంలో పనిచేయడం అరుదైన విషయమన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘం, ప్రజా సంఘాల్లో రాఘవమ్మ చేసిన పోరాటాలు ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఆమె అంత్యక్రియల్లో సిపిఎం కోనసీమ జిల్లా జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, కాకినాడ జిల్లా సిపిఎం నాయకులు దువ్వా శేషబాబ్జి, బేబిరాణి, కెఎస్ శ్రీనివాస్, ఎం రాజశేఖర్, ఐద్వా సీనియర్ నాయకులు టి సావిత్రి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వచ్చే సీజన్ నాటికి హంద్రీనీవా పనులు

- లింకు పనులపై జలవనరులశాఖ మంత్రి వీడియో కాన్ఫరెన్స్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

వచ్చే సీజన్ నాటికి హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు పూర్తి చేసి రాయలసీమ ప్రాంతంలో చివరి ఎకరం వరకూ సాగునీరందించేలా వేగవంతంగా పనులు పూర్తి చేయాలని అధికారులకు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సూచించారు. హెచ్ఎన్ఎస్ఎస్ పనులపై బుధవారం ఇరిగేషన్ క్యాంపు కార్యాలయం నుండి ఉన్నతాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిపై మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో హంద్రీనీవా ప్రాజెక్టు పనులను గాలికి వదిలేసి రాయలసీమ రైతాంగానికి జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.2,629 కోట్లతో రాయలసీమ వరప్రదాయని అయిన హెచ్ఎన్ఎస్ఎస్ పనులు ప్రారంభించారని పేర్కొన్నారు. పనులు వీలైనంత త్వరగా ప్రారంభించి వచ్చే సీజన్‌కు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే గాలేరు నగరి సుజల స్రవంతి పథకం నుండి హంద్రీనీవాను కలిపే లింకు ప్రాజెక్టు పనుల గురించి, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి హంద్రీనీవాను కలిపే లింకు పనులపైనా ప్రత్యేకంగా చర్చించారు. ప్రధాన కాలువ చివరి వరకూ నీటిని తరలించేందుకు ఉన్న అడ్డంకులను వెంటనే పరిష్కరించేందుకు ఎటువంటి పనులు జరుగుతున్నాయనే వివరాలతో సమగ్ర నివేదిక తయారు చేసి త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసి రిపోర్టు అందజేస్తామని తెలిపారు. సిఎం సూచనలకు అనుగుణంగా తదుపరి పనులు వేగవంతం చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

# పట్టణ డిమాండ్ మందగింపు

- హెచ్చు ధరల దెబ్బ
- తక్కువ ఉద్యోగాల కల్పన ఎఫెక్ట్
- మీరే అసెట్ షేర్‌ఖాన్ రిపోర్ట్

**ముంబయి :** దేశ ఆర్థిక వ్యవస్థలో మందగింపు చోటు చేసుకోంటుందని రేటింగ్ ఏజెన్సీలు, విత్త సంస్థలు ఇటీవల పదేపదే హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. 2024 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో వినిమయ ఉత్పత్తుల రంగం వృద్ధి బలహీనంగా చోటు చేసుకుందని తాజాగా ప్రముఖ స్టాక్ బ్రోకర్, ట్రేడింగ్ వేదిక మీరే అసెట్ షేర్‌ఖాన్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. గ్రామీణ డిమాండ్‌లో కొంత రికవరీ ఉన్నప్పటికీ.. పట్టణ డిమాండ్ మందగించిందని పేర్కొంది. దీనికి ప్రధాన కారణం అన్ని విభాగాల ఉత్పత్తుల ధరలు పెరగడమేనని విశ్లేషించింది. మీరే అసెట్ షేర్‌ఖాన్ రిపోర్ట్ ప్రకారం.. అధిక ద్రవ్యోల్బణం, తక్కువ ఉద్యోగావకాశాల ప్రభావంతో పట్టణ వినియోగంలో నిరంతర తగ్గుదల చోటు చేసుకుంటుంది. అదే విధంగా మెరుగైన రుతుపవన పరిస్థితులు, వ్యవసాయ ఉత్పత్తి ద్వారా గ్రామీణ వృద్ధి మెరుగ్గా ఉంది. ఈ సవాళ్లు ఉన్నప్పటికీ, కంపెనీల ఆదాయాలు సంవత్సరానికి 6 శాతం పెరుగుతాయని అంచనా వేసింది. ఇది ప్రధానంగా ధరల పెరుగుదల వల్ల మాత్రమే వాటి ఆదాయాలు పెరుగుతున్నాయి తప్పా.. డిమాండ్ పెరగడం ద్వారా కాదు. అధిక ముడిసరుకు ఖర్చులు, పెరిగిన ప్రకటనల ఖర్చులు, బలహీన నిర్వహణ పరపతి. స్థూల మార్జిన్లలో ఒత్తిడి వల్ల కూడా డిమాండ్ తగ్గింది.

**ఆర్థిక సేవల్లోనూ స్తబ్దత**

ఆర్థిక రంగం కూడా మందగమన వృద్ధిని ఎదుర్కొంటుందని మీరే అసెట్ షేర్‌ఖాన్ వెల్లడించింది. బ్యాంకింగేతర విత్త సంస్థల రుణాల జారీల్లోనూ తగ్గుదల చోటు చేసుకుంటుంది. ముఖ్యంగా అసురక్షిత వ్యక్తిగత రుణాలు, మైక్రోఫైనాన్స్ విభాగాలలో. వాణిజ్య వాహనాలకు డిమాండ్ తక్కువగా ఉంది. ప్యాసింజర్ వాహనాలు, ట్రాక్టర్లు, ఉపయోగించిన వాహనాలు కొంత రికవరీ సంకేతాలను చూపుతున్నాయి. బీమా కంపెనీలు మాత్రం వార్షిక ప్రీమియంలో సమాన వృద్ధిని నమోదు చేసే అవకాశాలున్నాయి. డాలర్‌తో రూపాయి కరెన్సీ క్షీణత కారణంగా అంతర్జాతీయ వ్యాపార ఆదాయ వృద్ధి మధ్యస్థంగా ఉంటుందని ఆ సంస్థ అంచనా వేసింది.

## రూపాయి నూతన రికార్డ్ పతనం

- డాలర్ @85.87

**ముంబయి :** రోజుకో రికార్డ్ స్థాయిలో రూపాయి విలువ పతనం కొనసాగుతూనే ఉంది. అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ మరింత క్షీణించి నూతన రికార్డ్ కనిష్టానికి పడిపోయింది. బుధవారం డాలర్‌తో రూపాయి విలువ 13 పైసలు పతనమై డాలర్‌తో 85.87 కనిష్ట స్థాయికి దిగజారింది. భారత కరెన్సీ చరిత్రలోనే ఇది మరో రికార్డ్ కనిష్ట స్థాయి కావడం ఆందోళనకర అంశం. రూపాయి విలువ పడిపోవడం ద్వారా అనేక దిగుమతి ఉత్పత్తులు భారం కానున్నాయి. విదేశీ చెల్లింపులు పెంచాల్సి వస్తుంది. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో 85.82 వద్ద తెరుచుకున్న రూపాయి విలువ.. ఇంట్రాడేలో ఏకంగా 85.89 కనిష్ట స్థాయిని తాకింది. ఇది భారత దేశ చరిత్రలోనే రూపాయి ఆల్‌టైం పతనం. స్టాక్ మార్కెట్లలో ఒత్తిడి, విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడం, ఇతర దేశీయ బలహీన ఆర్థికాంశాలు రూపాయి విలువను చతికిల పడేలా చేస్తున్నాయి. ఇంతక్రితం మంగళవారం సెషన్‌లోనూ 6 పైసలు కోల్పోయి 85.74 వద్ద ముగిసింది. గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు బ్యారెల్ ధర 0.90 శాతం పెరిగి 77.74 డాలర్ల వద్ద ట్రేడింగ్ అయ్యింది. ఎఫ్ఐఐలు వరుసగా తరలిపోవడానికి తోడు భారత విదేశీ మారకం నిల్వలు డిసెంబర్ 27తో ముగిసిన వారంలో 4.122 బిలియన్ డాలర్లు తరిగి 640.279 బిలియన్ డాలర్లకు పడిపోవడం భారత కరెన్సీపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. మరోవైపు భారత జిడిపి 2024-25లో 6.4 శాతానికి పరిమితం కానుందనే కేంద్ర గణంకాల అంచనాలు రూపాయిపైనా ఒత్తిడిని పెంచుతున్నాయని నిపుణులు భావిస్తున్నారు.. అంతర్జాతీయ మార్కెట్లో మిశ్రమ సంకేతాలతో బుధవారం భారత మార్కెట్లు స్వల్ప నష్టాలను చవి చూశాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 50 పాయింట్ల నష్టంతో 78,148కు చేరగా.. నిఫ్టీ 18 పాయింట్ల నష్టంతో 23,688 వద్ద ముగిసింది. ఐటి, ఎఫ్ఎంసిజి, గ్యాస్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.

## ఓలా ఎలక్ట్రిక్ సెబీ హెచ్చరిక

**ముంబయి :** విద్యుత్ వాహన తయారీ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ సిఇఒ భవీష్ అగర్వాల్‌కు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ హెచ్చరిక జారీ చేసింది. కంపెనీ విస్తరణ ప్రణాళికలను రెగ్యూలేటరీ, స్టాక్ ఎక్స్ఛేంజీలకు ముందుగా సమాచారం ఇవ్వకుండా.. సోషల్ మీడియా వేదికగా వెల్లడించడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. మరోసారి ఆ విధంగా ప్రకటనలు చేయరాదని హెచ్చరిక లేఖ జారీ చేసింది. డిసెంబర్ 2న ఉదయం భవిష్ అగర్వాల్ తమ స్టోర్లను 800 నుంచి 4,000కు విస్తరిస్తున్నామని ఎక్స్‌లో ప్రకటించారు. ఆ తర్వాత మధ్యాహ్నం 1:36 గంటల నుంచి 1:41 గంటలకు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చారు. ఇది నిబంధనలకు విరుద్ధమని సెబీ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా.. మరోసారి అలాంటి పొరపాటు జరగకుండా చూసుకుంటామని ఓలా ఎలక్ట్రిక్ సెబీకి వివరణ ఇచ్చింది.

## ఐదుగురిలో ఒక్కరి ఆదాయాల్లోనే పెరుగుదల

- లోకల్ సర్కిల్స్ సర్వే వెల్లడి

**న్యూఢిల్లీ :** భారత కుటుంబాల్లో పావు శాతం లోపు మంది ఆదాయాలు మాత్రమే పెరగొచ్చని అంచనా. ఈ ఏడాది 2025లో ప్రతీ ఐదుగురిలో ఒక్కరి ఆదాయం మాత్రమే పెరగనుందని తమ సర్వేలో వెల్లడయ్యిందని లోకల్ సర్కిల్స్ తెలిపింది. కుటుంబాల ఆదాయాలపై 16,111 మందిని సర్వే చేసి ఓ రిపోర్ట్‌ను తయారు చేసినట్లు వెల్లడించింది. 2025లో తమ పొదుపు 25 శాతం వరకు తగ్గొచ్చని 48 శాతం మంది ఆందోళన వ్యక్తం చేశారు. తమ పొదుపు పెరగొచ్చని 27 శాతం మంది పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కనీసం వచ్చే బడ్జెట్‌లో అయినా తమకు ప్రోత్సాహకాలు అందించేలా కేంద్రం చొరవ తీసుకోవాలని మెజారిటీ ప్రజలు కోరినట్లు లోకల్ సర్కిల్స్ పేర్కొంది.

HDFC BANK
We understand your world

నమోదిత కార్యాలయం : హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోవర్ పారెల్ (పశ్చిమం), ముంబాయి-400013 మరియు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, 1వ అంతస్తు, I-తింక్ టెక్నో క్యాంపస్, కంజూర్ మార్గ్ (తూర్పు), ముంబాయి-400042 వద్ద ఉన్న రిటైల్ పోర్ట్ పోలీయో నిర్వహణగా దాని కార్యాలయం ఒకటి.

**హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌కి తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించిన అమ్మక సమాచారం మరియు నోటీసు.**

హెచ్‌డిఎఫ్‌సి ("బ్యాంకు") యొక్క దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు బ్యాంకుకు తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించి, రుణం/ఓవర్‌డ్రాఫ్ట్ స్వభావంలో క్రెడిట్ సౌకర్యాలను పొందడం కోసం దీని ద్వారా తెలియజేయబడుతుంది.
అంగీకరించిన లోన్ నిబంధనల ప్రకారం బకాయిలను తిరిగి చెల్లించడంలో రుణగ్రహీతల నిరంతర డీఫాల్ట్ కారణంగా, దిగువ రుణ ఖాతాలు అపరాధ స్థితిలో ఉన్నాయని బ్యాంకు ఈ రుణగ్రహీతలకు అనేక నోటీసులు జారీ చేసింది, దిగువ పేర్కొన్న తేదీలో తుది విక్రయ నోటీసుతో సహా, బ్యాంక్ ప్లెడ్జ్‌ను చేయించిన మరియు దిగువ ఖాతాలలో మొత్తం బకాయిలను తిరిగి చెల్లించడానికి రుణగ్రహీతకు 7 రోజుల సమయం ఇచ్చింది. విఫలమైతే బ్యాంక్ ఈ విషయంలో తదుపరి నోటీసు జారీ చేయకుండా తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడానికి స్వేచ్ఛ ఉంటుంది. రుణగ్రహీతలు నిర్లక్ష్యానికి గురయ్యారు మరియు సరియైన చెల్లింపులు చేయడంలో విఫలమయ్యారు, కాబట్టి రుణ బప్పందం ప్రకారం బ్యాంకు తన హక్కులను వినియోగించుకోవడంలో ప్లెడ్జీగా రుణగ్రహీతల నుండి బ్యాంకుకు చెల్లించాల్సిన బకాయిలను రికవరీ చేయడానికి **16 జనవరి, 2025న** లేదా ఆ తర్వాత సెక్యూరిటీలను విక్రయించాలని/డిస్పోజ్ చేయాలని నిర్ణయించింది. ఇండియన్ కాంట్రాక్ట్ యాక్ట్ 1872 యొక్క సెక్షన్ 176 మొత్తంలో అమ్మకం నోటీసుగా పరిగణించమని రుణగ్రహీలకు ఇక్కడ తెలియజేయడమైనది. రుణగ్రహీతలు మార్జిన్ అవసరంలో మరింత లోపాన్ని సృష్టించడానికి స్టాక్ మార్కెట్‌లో అస్థిరత కారణంగా ఎప్పుడైనా తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విలువ మరింత పడిపోతే, ఈ విషయంలో తదుపరి నోటీసు లేకుండా బ్యాంకు తన అభీష్టానుసారం తాకట్టు పెట్టిన సెక్యూరిటీని క్యాలెండర్ రోజు ఒకటి (1) లోపు విక్రయిస్తుంది. రుణగ్రహీతలు ఏదైనా మిగిలిన బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడానికి, తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడం ద్వారా వచ్చిన మొత్తాన్ని సర్దుబాటు చేసిన తర్వాత బ్యాంకుకు బాధ్యత వహిస్తారు.

| క్ర. సం. | లోన్ అకౌంట్ నెం. | రుణగ్రహీతల పేరు | 6 జనవరి, 2025 నాటికి బకాయి మొత్తం (భారత రూపాయలలో) | విక్రయ నోటీసు తేదీ |
|---|---|---|---|---|
| 1 | XXXX2802 | కె.వెంకట సీతారామరాజు | 61,71,727.82 | 16-01-2025 |
| 2 | XXXX2090 | కె.వెంకట సీతారామరాజు | 10,17,957.82 | 16-01-2025 |
| 3 | XXXX4106 | చుండూరి బ్రంహయ్య | 1,10,966.61 | 16-01-2025 |
| 4 | XXXX5475 | తాడేపల్లి ఎన్ వి ఎస్ కె మోహనరావు | 84,873.78 | 16-01-2025 |
| 5 | XXXX0031 | అయాన్ కంత జెన | 51,241.41 | 16-01-2025 |

తేది : 09.01.2025
ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
సం/-
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

సంపాదకీయం

# జిడిపి పతనం

కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ గురించి ఒకవైపు ఊదరగొడుతూ, దేశ ప్రజలను భ్రమల్లో ముంచే ప్రయత్నం చేస్తుండగా మరోవైపు దానికి భిన్నమైన వాస్తవ దృశ్యాలు ఒక్కొక్కటిగా ఆవిష్కృతమౌతున్నాయి. నిరుద్యోగం, అధిక ధరలు, ద్రవ్యోల్బణం, పాతాళానికి రూపాయి వంటి అంశాల తరువాత ఇప్పుడు స్థూల దేశీయోత్పత్తి (గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్టు-జిడిపి) చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25)లో జిడిపి 6.4 శాతానికి పరిమితం కానుందని అంచనా వేస్తూ నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీసు (ఎన్ఎస్ఓ) తాజాగా విడుదల చేసిన గణాంకాలు చర్చనీయాంశంగా మారాయి. ఈ అంచనాలు నిజమైతే ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా విజృంభణ తరువాత గడిచిన నాలుగేళ్ల కాలంలో అతి తక్కువ పెరుగుదల అంచనా ఇదే రానున్న ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ సమర్పించేందుకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి సన్నద్ధమౌతున్న వేళ ఈ తాజా అంచనాలు విడుదల కావడం గమనార్హం.

నిజానికి గతంలోనే జిడిపి పతనానికి సంబంధించిన సంకేతాలు వెలువడ్డాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25 తొలి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) 6.7 శాతం జిడిపి వృద్ధి మాత్రమే నమోదైంది. గత ఏడాది అదే సమయానికి జిడిపి 8.2 శాతంగా ఉండటం గమనార్హం. గత సంవత్సరం అన్ని త్రైమాసికాల్లోనూ సగటున 8 శాతం జిడిపి వృద్ధి నమోదు కావడంతో ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 7.2 శాతం జిడిపి సాధించవచ్చని ఆర్‌బిఐ తొలుత అంచనా వేసింది. ఆ తరువాత దానిని సవరించి 7.1 శాతం వృద్ధి ఖాయమని పేర్కొంది. అయితే, తొలి త్రైమాసికంలో ఆ అంచనాను అందుకోలేదు. ఇక రెండవ త్రైమాసికంలో (జులై-సెప్టెంబర్)లో వృద్ధి రేటు ఏకంగా 5.4 శాతానికి పడిపోయింది. ఇది రెండేళ్లలో కనిష్టం! మూడవ త్రైమాసికంలో రెండవ త్రైమాసికంతో పోలిస్తే కొంత పుంజుకున్నట్టు కనిపించినప్పటికీ తొలుత వేసిన అంచనాలతో పోలిస్తే దిగదుడుపే! మరోవైపు స్థూల విలువ జోడింపు (గ్రాస్ వాల్యూ యాడెడ్-జివిఎ) గణాంకాలు కూడా తగ్గుదలనే చూపుతున్నాయి. జివిఎ 8.3 శాతం నుండి 6.8 శాతానికి పడిపోయింది. తొమ్మిది నెలల పాటు వరుసగా ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకున్న ఈ దిగజారుడును నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. మొదటి త్రైమాసికంలో ఆర్థిక వ్యవస్థ మందగమనానికి ఎన్నికల కోడ్ కారణమని ప్రధానమంత్రితో పాటు ఆయన వందిమాగధులు ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేశారు. ఇప్పుడు వృద్ధి రేటు నేల చూపులు చూస్తోందని స్పష్టమౌతోంది. ఫిబ్రవరి ఒకటవ తేదీన కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రతిపాదనలను పార్లమెంటులో ప్రవేశ పెట్టనున్న సంగతి తెలిసిందే. దీంతో ఈ ఆర్థిక పతనానికి కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు ఏమని సంజాయిషి ఇస్తుందో వేచి చూడాల్సిందే!

అదాని, అంబాని వంటి కొద్దిమంది కార్పొరేట్లకు మేలు చేసే నయా ఉదారవాద ఆర్థిక విధానాలే ఈ పరిస్థితికి కారణం. ఈ కారణంగానే ప్రజల మధ్య అంతరాలు పెరుగుతున్నాయన్న సత్యాన్ని గుర్తించడానికి మోడీ ప్రభుత్వం నిరాకరిస్తోంది. దేశంలో పెరుగుతున్న పేదరికాన్ని, అకలి కేకలను, నిరుద్యోగం, ఉపాధి రహిత పరిస్థితులను అనేక జాతీయ, అంతర్జాతీయ నివేదికలు ఎత్తి చూపినా కేంద్ర సర్కారులో చలనం ఉండటం లేదు. ప్రభుత్వ ఖర్చును, ముఖ్యంగా పేదల కోసం చేసే ఖర్చును భారీగా పెంచాలని, ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికి, ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎందరో నిపుణులు, ఆర్థిక వేత్తలు చేసిన సూచనలను ఉద్దేశపూర్వకంగానే పెడచెవిన పెడుతున్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలుకు నిధుల దిగ్గోతే దీనికి నిదర్శనం. కనీస మద్దతు ధర చట్టం కోసం ఏళ్ల తరబడి రైతాంగం చేస్తున్న ఆందోళనలను పట్టించుకోవడం లేదు. రూపాయి విలువ పతనం కారణంగా ఎరువుల ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉందంటూ వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. దేశ వ్యాప్తంగా ప్రజల జీవన ప్రమాణాల్లో పెరుగుతున్న అంతరాలే మోడీ ప్రభుత్వ విధానాల వైఫల్యానికి నిదర్శనం!

మహనీయుల మాట



కార్మిక వర్గం చేసే పోరాటాల విజయం అది సాధించే తక్షణ ఫలితాలలో లేదు. ఈ పోరాటాల క్రమంలో అది సాధించే అపూర్వ ఐక్యతే అతి గొప్ప విజయం.

- కార్ల్ మార్క్స్

Karl Marx

విమర్శ

# విశాఖ సాక్షిగా ప్రధాని మరోసారి ద్రోహం

దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 8న రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖ వచ్చి వెళ్లారు. భారీ బహిరంగ సభలో మాట్లాడారు. ఆయన ప్రసంగంలో రాష్ట్రాన్ని వేధిస్తున్న సమస్యలపై స్పందించక పోవడం తీవ్ర నిరాశకు గురి చేసింది. ఈ ప్రాంతం, ఆంధ్ర రాష్ట్ర ప్రజలు గత నాలుగేళ్లుగా పోరాడుతున్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ మాట మాత్రం కనీసంగా కూడా ఎత్తలేదు. పక్కనే ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కనీసంగా కూడా అడగలేదు. సరికదా, ఆయనను ప్రసన్నం చేసుకోవడానికే ఇద్దరూ పోటీ పడ్డారు. ముచ్చటగా ముగ్గురూ కలిపి ఈ సభా వేదికగా ఆంధ్ర రాష్ట్రానికి మోసం చేశారు. సభంతా ఒకర్నొకరు పొగుడుకోవడంతోనే సరిపోయింది. ఆయన సభలో పదేపదే ప్రస్తావించిన గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు నిర్మాణం, ఆయన విధానపరంగానే ద్వేషించే, ఒక ప్రభుత్వ రంగ పరిశ్రమ అయిన ఎన్‌టిపిసి ద్వారా జరగడం ప్రభుత్వ రంగ ప్రాధాన్యత తెలుస్తోంది. సరిగ్గా రెండేళ్ల రెండు నెలల క్రితం అంటే 2022 నవంబర్ 12వ తేదీన ఇదే ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఆయన సభ జరిపారు. అప్పటికే స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమం సాగుతోంది. అప్పుడు కూడా ఆయన దానిపై స్పందించలేదు. ఆయన పక్కనే ఉన్న నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడా ఆయనను అడగలేదు. దీనిపై నాడు ప్రతిపక్షంలో ఉన్న నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్-ఇద్దరూ జగన్మోహన్ రెడ్డి తనపై ఉన్న కేసుల గురించి భయపడి మోడీని అడగలేదని విమర్శించారు. ఆ విమర్శ కూడా సహేతుకమైనదే కావచ్చు. అయితే విచిత్రంగా నేడు అదే వేదికపై అదే మోడీ పక్కన కూర్చున్న చంద్రబాబు నాయుడు గానీ, పవన్ కల్యాణ్ గానీ మోడీని కనీసం మాట వరసకైనా అడగకపోవడం ఆశ్చర్యం కలిగించడమే కాక సమర్థనీయం కూడా కాదు. ఎందుకంటే, వీరు 2024 ఎన్నికలకు ముందు రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడితే విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షిస్తామని, రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో ముందుకు తీసుకు పోతామని హామీ ఇచ్చారు. కానీ అందుకు భిన్నంగా కేంద్రం స్టీల్‌ప్లాంటు కష్టాలను మరింత పెంచింది. కార్మికులను తొలగిస్తోంది.

> ఈ దుస్థితి నుండి ఈ సభలోనైనా ఉపశమనం కలుగుతుందేమోనని కొంతమందైనా ఆశించారు. కానీ ఆ ఆశలను అడియాసలు చేస్తూ, ప్రధానమంత్రి తమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోలేదు. సరికదా, పక్కలో బల్లెంలా రాష్ట్ర ప్రభుత్వం దీనికి సమీపంలోనే అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ప్రైవేట్ రంగంలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడమే గాక దానికి అనుసంధానంగా పోర్టు నిర్మిస్తామని కూడా తెలిపారు. వీటికి మించి, ఇటీవల చంద్రబాబు నాయుడు దేశ రాజధాని ఢిల్లీలో ప్రధానమంత్రిని కలిసినప్పుడు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలని అడగలేదు. కానీ ప్రైవేటు రంగంలోని ఇంకా స్థాపించబడని మిట్టల్ స్టీల్ ప్లాంటుకు మాత్రం గనులు ఇవ్వాలని కోరారు. దీన్నిబట్టే తెలుస్తోంది ఈ డబుల్ ఇంజన్ సర్కార్ పయనమెటో! అందులోని భాగస్వామ్య పక్షాలకు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మీద ఎంత చిత్తశుద్ధి ఉందో! రక్షణ కాదు, భక్షణ వీరి విధానమని.

ఉద్యోగుల జీతాలు కూడా చెల్లించకుండా తిప్పలు పెడుతోంది. బొగ్గు, ముడి సరుకు, రైలు ర్యాకులు కూడా ఇవ్వకుండా స్టీల్ ప్లాంట్‌ను అష్ట దిగ్బంధనం చేస్తోంది.

ఈ దుస్థితి నుండి ఈ సభలోనైనా ఉపశమనం కలుగుతుందేమోనని కొంతమందైనా ఆశించారు. కానీ ఆ ఆశలను అడియాసలు చేస్తూ, ప్రధాన మంత్రి తమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోలేదు. సరికదా, పక్కలో బల్లెంలా రాష్ట్ర ప్రభుత్వం దీనికి సమీపంలోనే అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ప్రైవేట్ రంగంలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడమే గాక దానికి అనుసంధానంగా పోర్టు నిర్మిస్తామని కూడా తెలిపారు. వీటికి మించి, ఇటీవల చంద్రబాబు నాయుడు దేశ రాజధాని ఢిల్లీలో ప్రధానమంత్రిని కలిసినప్పుడు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలని అడగలేదు. కానీ ప్రైవేటు రంగంలోని ఇంకా స్థాపించబడని మిట్టల్ స్టీల్ ప్లాంటుకు మాత్రం గనులు ఇవ్వాలని కోరారు. దీన్నిబట్టే తెలుస్తోంది ఈ డబుల్ ఇంజన్ సర్కార్ పయనమెటో! అందులోని భాగస్వామ్య పక్షాలకు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మీద ఎంత చిత్తశుద్ధి ఉందో! రక్షణ కాదు, భక్షణ వీరి విధానమని.

దీనికి తోడు, రాష్ట్ర విభజన తరువాత జరిగిన 2014 ఎన్నికలలో విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని అప్పటి మిత్రులైన నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. పదేళ్లు గడిచినా నేటికీ అతీ గతీ లేదు. నాయకుల ప్రకటనలే తప్ప ఆచరణలో రైల్వే జోన్ ఏర్పాటు కాలేదు. నేడు తీరుబడిగా పదేళ్ల తరువాత శంకుస్థాపన చేశారు. ఇక ప్రారంభానికి ఎంత సమయం వేచి ఉండాలో! కానీ ఆ పేరున, వందేళ్ళకు పైగా చరిత్ర కలిగి, దేశంలోనే రైల్వేకు అతి పెద్ద ఆదాయం సమకూరుస్తున్న డివిజన్లలో ఒకటిగా ఉన్న విశాఖపట్నం రైల్వే డివిజన్‌ను ఎత్తేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇది పచ్చి దగా తప్ప మరొకటి కాదు. పదేళ్ళ నుండి ఊరిస్తూ, ఊరిస్తూ ఎట్టకేలకు రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేయడంలో గర్వపడవలసినదేముంది? పదేళ్ళ క్రితం రావలసినది ఇంత ఆలస్యం చేసినందుకా?

ఈ వైఖరిని ఎండగట్టి, రాష్ట్ర హక్కులను సాధించుకోవడంలో ముఖ్యమంత్రి క్రియాశూన్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రశ్నిస్తానని బయల్దేరిన పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి అయ్యాక ఆ ప్రశ్న అనే పదాన్నే మరిచిపోయారు. దీనితో నరేంద్ర మోడీ ప్రభుత్వం కేంద్రంలో మెజార్టీ లేకపోయినా, మరింత రెచ్చిపోయి రాష్ట్రానికి ద్రోహం చేస్తోంది. ప్రత్యేక హోదా మాటే మరిచింది. వివిధ విద్యా సంస్థల నిర్మాణ పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయి. విశాఖ, విజయవాడ మెట్రో రైల్ ఊసే కేంద్ర ప్రభుత్వం మరిచింది. కడప ఉక్కు ఫ్యాక్టరీ, దుగ్గరాజపట్నం పోర్టు సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు రావలసిన ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీలను కేంద్ర ప్రభుత్వం ఒక ప్రహసనంలా మార్చేసింది. వీటిపై కూడా కూటమి నేతలు నోరు మెదపడం లేదు.

నేడు పాలకులకు ప్రజలు కోరుకున్నవి కాకుండా ప్రజల ఆలోచనలలో లేనివి ప్రకటించి అదే అభివృద్ధి అని నమ్మబలుకుతున్నారు. ఈ సభలో మోడీ అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో బల్క్ డ్రగ్ ప్లాంట్ ఏర్పాటుకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. విశేషం ఏమిటంటే అక్కడ స్థానికులు ఈ ప్లాంట్ మాకొద్దు బాబోయ్, దీనివల్ల ఇప్పటికే కాలుష్యంతో సతమతమవుతున్న మా ప్రాంతం, సముద్ర తీరం మరింత కలుషితం అవుతుంది, మత్స్యకారులకు ఉపాధి పోతుంది అని మొత్తుకుంటున్నారు. అయినా ఇదే అభివృద్ధి అంటూ కేంద్ర, రాష్ట్ర పాలకులు బలవంతంగా రుద్దుతున్నారు. అచ్యుతాపురం దగ్గర వున్న గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు కూడా వర్చువల్‌గా ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. అక్కడ కూడా 1200 ఎకరాల భూమిని కోల్పోయిన స్థానిక రైతులు, నిర్వాసితులు ఉపాధి, నష్ట పరిహారం గురించి ఇంకా వేచి చూస్తున్నారు.

సి.ఎం చంద్రబాబు నాయుడు ఇటీవల శ్రీకాకుళం జిల్లా పర్యటనలో కూడా అక్కడ ప్రజలు కోరుకుంటున్న నీటి ప్రాజెక్టుల నిర్మాణం, కిడ్నీ వ్యాధి పరిశోధన కేంద్రం, భావనపాడు ఫిషింగ్ హార్బర్ వంటివి కాకుండా ఎయిర్ పోర్టు, కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణం చేస్తామని తెలిపి, పెద్ద ఎత్తున బలవంతపు భూ సేకరణకు పూనుకుంటున్నారు. ఈ ప్రాంత ప్రజల నెత్తిపై కుంపటిలా కొవ్వాడ అణు విద్యుత్ ప్లాంట్ అన్నది ఎలాగూ ఉంది. ఆ ప్రమాదం గుర్తించే ఆలోచనే కనీసంగా కూడా రాష్ట్ర ప్రభుత్వానికి లేకపోవడం శోచనీయమే.

రాష్ట్రంలోని గంగవరం పోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి వున్న 10.39 శాతం వాటాను జగన్ ప్రభుత్వం అదాని సంస్థకు అమ్మేసింది. దీనితో 2852 ఎకరాల భూమితో సహా సర్వ హక్కులు ప్రభుత్వం అదానీ పరం చేసింది. విశాఖ ఏజెన్సీ ఏరియాలో వివిధ ప్రాజెక్టుల పేరుతో గిరిజన ఉపాధికి గండికొడుతూ, గిరిజన చట్టాలను అతిక్రమించి, అదానీ సంస్థకు అనుమతులు ఇచ్చింది. విశాఖ నగరంలో అత్యంత విలువైన 130 ఎకరాల భూమిని అదానీ డేటా సెంటరుకు అప్పజెప్పింది. నేడు అదాని కంపెనీలు అత్యంత అవినీతికి పాల్పడి విద్యుత్ ఒప్పందాలు చేసుకున్నట్లు అమెరికా కోర్టులో కేసు నడుస్తోంది. ఈ అవినీతి వ్యవహారాన్ని ఖండించి, చంద్రబాబు ప్రభుత్వం ఆ ఒప్పందాలను రద్దు చేయవలసింది పోయి వాటిని కొనసాగిస్తూ, తిరిగి సమర్థించుకుంటోంది.

డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే రాష్ట్రానికి ఏదో న్యాయం జరుగుతుందని కొంతమందికైనా వున్న భ్రమలు ఇప్పుడు క్రమేణా కరిగిపోతున్నాయి. విద్యుత్ చార్జీలు, ఇతర బాదుళ్లతో సామాన్యుల నడ్డి విరుస్తున్నాయి. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలన్నా, విభజన చట్టం అమలు కావాలన్నా, ఎడాపెడా వేస్తున్న భారాలను తిప్పికొట్టాలన్నా, చట్టపర హక్కులను నిలబెట్టుకోవాలన్నా ప్రజా ప్రతిఘటనే మార్గం.

- బి. గంగారావు,
సిపిఎం విశాఖ జిల్లా
కార్యదర్శివర్గ సభ్యులు

- ఎ. అజ శర్మ,
ఉత్తరాంధ్ర
అభివృద్ధి వేదిక.

వ్యాఖ్య

# సంక్రాంతి ముంగిట్లో సినీ, రాజకీయ పందేలు

- తె.ర

సమాజంలో చిరకాలంగా సినిమాలకు రాజకీయాలకూ వాటి వాటి స్థానాలున్నాయి. తమిళనాడులో అన్నాదురైతో మొదలుపెట్టి కరుణానిధి, ఎంజిఆర్‌ల ద్వారా సినిమా రంగ ప్రముఖులు రాజకీయాలలో చక్రం తిప్పడం కూడా ఒక ప్రాతిపదికపైనే జరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ అగ్ర కథా నాయకుడైనప్పటికీ నాటి కాంగ్రెస్‌పై ప్రజల అసంతృప్తికి ప్రతిరూపంగానే అధికారంలోకి వచ్చారు. తర్వాత కూడా ఆయన రెంటినీ కలగాపులగం చేసింది తక్కువేనని చెప్పాలి. కానీ గత కొన్నేళ్లలో ఈ పరిస్థితి క్రమేణా మారిపోతున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది. దేశంలోనే వసూళ్లలో రెండవ స్థానంలోకి వచ్చిన 'పుష్ప2' త్వరలో రాబోతున్న 'గేమ్ చేంజర్' మధ్య కాలంలో ఘటనలు దానికి పరాకాష్ట. ఏది సినిమానో ఏది రాజకీయమో ప్రజలకు ఏ ప్రయోజనమో తెలియని గందరగోళం నెలకొంది. 'పుష్ప2' విడుదల సందర్భంలో జరిగిన దురదృష్టకర సంఘటనలపై ఎడతెగని చర్చ వాతావరణాన్ని అత్యంత వివాదాస్పదం చేసింది. ఈలోగా రాజమండ్రి దగ్గర జరిగిన 'గేమ్ చేంజర్' ఈవెంట్‌కు హాజరైన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మరణించిన ఘటనతో ఈ సినీ రాజకీయ చర్చ ఎ.పి కి మారింది. తమ తమ అవసరాల కొద్దీ, అక్కసుల కొద్దీ మాట్లాడటం తప్ప ఒక సామాజిక కోణంలో ఎలా స్పందించాలనే దానికి అవసరమైన సంయమనం గానీ సమతుల్యత గానీ బొత్తిగా లోపించాయి. పాలక పార్టీలు, కొన్ని సినిమా వర్గాలు స్వప్రయోజనం నెరవేర్చుకోవడానికి పడే తంటాలు హాస్యాస్పదంగా మారుతున్నాయి. కొంతమంది దీన్ని మరీ ముందుకు తీసుకుపోయి రెండు తెలుగు రాష్ట్రాల మధ్య, కొన్ని కులాల మధ్య లేదంటే కుటుంబాల మధ్య సమస్యలాగా చేసి చూపడం మరీ దారుణంగా తయారైంది.

## మసాలాలు దట్టి లాభాల పోటీ

'బాహుబలి'తో మొదలుపెట్టి పాన్ ఇండియా, పాన్ వరల్డ్ పాట హిందీలోనూ తెలుగు, తమిళ సినిమాలలోనూ బాగా వినిపిస్తున్నది. చిన్న పరిశ్రమ అయిన కన్నడ కూడా కెజిఎఫ్ తర్వాత ఈ హడావుడిలో భాగస్వామి అయింది. ఈ క్రమంలో ఖర్చులు విపరీతంగా పెంచి అవసరం లేని హంగులతో అతి భారీగా తీస్తేగానీ నడవబోవనే భావం బలపడింది. భారీగా పెట్టుబడులు కుమ్మరించగలిగిన లేదా భారాలు భరించగలిగిన కొన్ని కుటుంబాలు సంస్థలే చక్రం తిప్పుతున్నాయనే భావం బలపడింది. చిన్న చిత్రాలు, భిన్న చిత్రాలు కొన్ని విజయం సాధించినా ఆ ప్రయత్నాలకు పెద్దగా ప్రోత్సాహం లేదు. ప్రభుత్వాలు కూడా స్థిరమైన విధానాలతో ముందుకు రావడం లేదు. తారల తళుకులు, పైపై మెరుగులకు వచ్చిన ప్రాధాన్యత ప్రతిభకు, కొత్త గొంతులకు దక్కడం లేదు. రెండు వందల సినిమాలు వస్తుంటే పది కూడా విజయం సాధించడం లేదనే మాట అందరూ అంటున్నారు గాని అందుకు కారణాలు అన్వేషించడం లేదు. మొత్తం చర్చలో సాంకేతిక నిపుణులు అంతకు మించి పని చేసే సినీ కార్మికుల గురించి అసలు చర్చ జరగడం లేదు.

అంతకంతకూ ఖర్చులు పెంచుకుంటూ, అందులో పారితోషికాలకే అత్యధికంగా వెచ్చిస్తూ పరిశ్రమ ఏం చేసినా తమ హీరోల చిత్రాలకు కేరింతలు కొడుతూవున్న, సొమ్ములు వెచ్చించే అభిమానులనే వారే పునాది. ఒకప్పటి అభిమాన సంఘాల పరిస్థితి మారి సోషల్ మీడియా, మీడియాల ద్వారా వీరిని మరింత గట్టిగా ఉపయోగించుకోవడం ఒక వ్యూహంగా మారింది. పదేపదే ఈవెంట్‌లు, జాతరలు, ప్రీరిలీజ్, సాంగ్ రిలీజ్...ఇలా తొక్కిసలాటతో ఒకటి రెండు వేడుకలను రద్దు చేసుకోవలసిన పరిస్థితులు. వేలాది థియేటర్లలో ఒకేసారి విడుదల చేసి, ఎక్కువ షోలు వేసి తాజా సరుకులా అమ్మేసి సొమ్ములు చుట్టేసుకోకపోతే చల్లబడిపోతుంది. అందుకోసం మల్టీ స్క్రీన్‌ప్లెక్స్‌లు, వీటిపైనా కొద్ది మంది పట్టు. గతంలో లేని విధంగా విడుదల తేదీలు సీజన్లు కూడా కలసి నిర్ణయించుకోవడం నెలల తరబడి వాయిదాలు వేసుకోవడం అంతా మార్కెట్ వ్యూహం. ఆ మార్కెట్ కూడా తెలుగు రాష్ట్రాలను దాటి హిందీ ప్రేక్షకులకూ విదేశాల్లోని వారికి నచ్చేలా రూపొందించడం ఒక వలయంగా మారింది.

## 'పుష్ప' వివాదం

'పుష్ప2' విడుదల సందర్భంగా తొక్కిసలాట ఎవరూ కోరుకున్నది కాదుగానీ ఊహించలేనిది కూడా కాదు. పోలీసులు ఆ అంచనాతోనే హీరోను రావద్దని చెప్పామంటున్నారు. వచ్చిన తర్వాతనైనా జాగ్రత్తలు తీసుకున్నట్టు కనిపించదు. ఇందుకు బాధ్యత గురించి పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నా ఆకర్షణ వున్న హీరో పరివారం జాగ్రత్త తీసుకోవడం అన్నిటికన్నా ముఖ్యం. రేవతి అనే మహిళ మృతి చెందడం నిజంగా విషాదకరం. ఆమె కుమారుడు శ్రీతేజ్ విషమంగా గాయపడి ప్రాణాలతో బయటపడటం ఊరట కలిగించినా అతను ఆరోగ్యపరంగా అనేక సవాళ్లను ఎదుర్కోవలసి వుంటుంది. ఈ మరణం ఆలస్యంగా స్పందించిన చిత్ర బృందం అందిస్తామన్న సాయం అందడానికి కూడా అనేక దశలు, విమర్శలు కావలసి వచ్చింది. ఈ ఘటనలను బట్టి పరిశ్రమనే పంపించేయాలన్నట్టు మాట్లాడిన వారిది కూడా తప్పే. అందులో ఆంధ్ర, తెలంగాణ తేడాలు తీసుకొచ్చిన వారిది మరింత పొరబాటు. కావాలని చేయలేదనేది ఒకటైతే కావలసిన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం తప్పక దిద్దుకోవలిసిన విషయం.

## ప్రచార జాతరలు, ప్రమాదాలు

హీరో ఫంక్షన్‌లో తన పేరు మర్చిపోయారు గనక అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ కక్ష సాధింపుగా కొన్ని పార్టీలు తీవ్రారోపణలు చేశాయి. బిఆర్ఎస్, బిజెపిలు ఈ విషయంలో ముందున్నాయి. కాంగ్రెస్‌తో తమ రాజకీయ వైరాన్ని తీర్చుకోవడానికి, సినిమా పరిశ్రమకూ హీరో అభిమానులకు దగ్గర కావడానికి అవి ఈ మార్గాన్ని ఎంచుకున్నాయా? ఎ.పి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా అల్లు అర్జున్ బయటికి రాగానే ఫోన్ చేసి సంఘీభావం ప్రకటించారు. ప్రస్తుతం ఆయన ఎన్‌డిఎ భాగస్వామి కూడా. ఎపి మాజీ ముఖ్యమంత్రి జగన్ కూడా అరెస్టును ఖండించడం చూస్తే బిజెపి ప్రత్యక్ష, పరోక్ష మిత్రులు ఒక విధానం తీసుకున్నట్టు స్పష్టమవుతుంది. అల్లు అర్జున్ అరెస్టు అవకాశంగా తనపై రాజకీయ దాడికి పాల్పడుతుంటే పరిశ్రమ విడగొట్టుకోకపోవడం, హీరోకు తప్ప బాధిత కుటుంబాన్ని పట్టించుకోకపోవడం సరికాదని రేవంత్ చెప్పడంలో తప్పేమీ కనిపించదు. అసలు ఆ సమావేశానికి వెళ్లడమే తప్పని ఒక వర్గం వాదన. 'పుష్ప2' రేట్లు, షోలు విపరీతంగా పెంచుకోవడానికి అనుమతినిచ్చిన రేవంత్ రెడ్డి ఇకపై ఆ అవకాశం వుండదని ప్రకటించారు. కానీ తాను అనుమతి తెచ్చుకొంటానని మూడు సంక్రాంతి సినిమాల నిర్మాత దిల్ రాజు చెబుతున్నారు. 'పుష్ప' ఘటనల తర్వాత చాలా రోజులకు పవన్ కల్యాణ్ అల్లు అర్జున్ అరెస్టును సమర్థించారు. జాగ్రత్తలు లోపించాయని, పరామర్శకు వెళ్లలేదని వ్యాఖ్యానించారు. అధికార హోదాలో ఎ.పి లో 'గేమ్ చేంజర్' ఈవెంట్‌లో పాల్గొని చేసిన ప్రసంగంలో మాత్రం ఆయన సినిమాలు, రాజకీయాలు అన్నీ కలిపేసి మాట్లాడారు. ఆయన స్వయంగా నటిస్తున్న ఒజి (ఒరిజినల్ గూండా) చిత్రం పేరు ప్రతి అధికార కార్యక్రమంలోనూ వినిపిస్తూనే వుంది. ఆ ఈవెంట్‌కు హాజరై వెళుతున్న ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలుకావడం విషాద వివాదంగా మారింది. రోడ్లు గత ప్రభుత్వంలో దెబ్బతిన్నాయి గనక ఈ ఘటన జరిగిందని పవన్ వ్యాఖ్యానించడం ఒకటైతే 'పుష్ప' ఘటనలతో పోటీ పెట్టి పవన్‌ను అరెస్టు చేయాలని కొంతమంది వైసిపి అభిమానులు పోస్టులు పెట్టడం, మాజీ అంబటి రాంబాబు దీనిపై రాజకీయ దాడి చేయడం మరోవైపు చూశాం. ఇవన్నీ రాజకీయ వ్యూహాల ఫలితమే. జగన్ ముఖ్యమంత్రిగా వుండగా రేట్ల పెంపునకు ఒప్పుకోకపోవడం వచ్చిన హీరోలు, దర్శకుల పట్ల అవమానకరంగా వ్యవహరించారనే విమర్శ వుంటూనే వుంది. వ్యక్తిగత ప్రవర్తన కన్నా పరిశ్రమకూ సమాజానికి ఏం జరుగుతుందనేది ఇక్కడ ముఖ్యంగా చూడాల్సిన అంశం.

> కళాకారులు, పాత్రికేయులపై అనేక విధాల నిర్బంధానికి నిషేధాలకు పాల్పడిన సంఘ పరివార్ ఇక్కడ సంరక్షకురాలిగా మాట్లాడ్డం చెల్లుబాటయ్యేది కాదు. అందరూ ఆనందించవలసిన కళలను సంకుచిత కోణాలతో చూడటం, సులభ లాభాల కోసం సామాన్య ప్రేక్షకులపై భారాలు మోపడం సరైంది కాదు. ఈ విషయంలో పొడుగు చేతుల పందేరంలా ఇష్టానుసారం అనుమతివ్వడం సరైంది కాదు. పరిశ్రమ కూడా మంచి చిత్రాలకు ప్రోత్సాహం, ప్రేక్షకులకు భద్రత కల్పించడం, భారం తగ్గించడం గురించి యోచించాలి.

## బిజెపి రాజకీయాలు?

'బాహుబలి' రచయిత, ఆ చిత్ర దర్శకుడి తండ్రి విజయేంద్ర ప్రసాద్‌కు బిజెపి రాజ్యసభకు నామినేట్ చేయించింది. ఆయన ఆరెస్సెస్‌పై చిత్రం తీస్తానని ప్రకటించారు. అందులో నటించడం కోసం ఎన్టీఆర్‌ను ఒప్పించేందుకు కొన్నేళ్ల కిందట స్వయంగా హోంమంత్రి అమిత్ షా ప్రయత్నించడం తెలిసే వుంటుంది. వైసిపి హయాంలో సైబర్‌నెట్‌ను ఎలా వాడారు? తమకు అనుకూలమైన వ్యూహం చిత్రానికి గాను రాం గోపాల్ వర్మ బృందానికి డబ్బులు ఎలా అందించారనే దానిపైనా కేసులు, ఫిర్యాదుల యుద్ధం నడుస్తున్నది. తాజాగా పాటల రచయిత అనంత శ్రీరాం హిందూ వ్యతిరేక చిత్రాలను బహిష్కరించాలంటూ పైత్య ప్రకోప ప్రలాపాలకు పాల్పడుతున్నారు. కళాకారులు, పాత్రికేయులపై అనేక విధాల నిర్బంధానికి నిషేధాలకు పాల్పడిన సంఘ పరివార్ ఇక్కడ సంరక్షకురాలిగా మాట్లాడ్డం చెల్లుబాటయ్యేది కాదు. అందరూ ఆనందించవలసిన కళలను సంకుచిత కోణాలతో చూడటం, సులభ లాభాల కోసం సామాన్య ప్రేక్షకులపై భారాలు మోపడం సరైంది కాదు. ఈ విషయంలో పొడుగు చేతుల పందేరంలా ఇష్టానుసారం అనుమతివ్వడం సరైంది కాదు. పరిశ్రమ కూడా మంచి చిత్రాలకు ప్రోత్సాహం, ప్రేక్షకులకు భద్రత కల్పించడం, భారం తగ్గించడం గురించి యోచించాలి. ఇప్పుడు గేమ్ ఛేంజర్, ఢాకూ మహరాజ్ సినిమాలకు రేట్ల పెంపుపై పవన్ కల్యాణ్ ముందే ప్రకటన చేయడం ఆసక్తికరం. అయితే స్వయంగా హైకోర్టు పెంపును 14 నుంచి 10 రోజులకే తగ్గించడంలోనూ భారం తగ్గించే భావనే కనిపిస్తుంది.

★

కవిత్వం

## మట్టి మనిషికి ప్రణమిల్లాలి

పిడికెడు బువ్వ పేగుల్ని నింపుతుంది
గింజ గింజలో ఒక స్వేదపు చుక్క
నిక్షిప్తమై పదిలంగా వుంటుంది
మన్నులో మట్టి మనిషి ఆనవాళ్ల
చిగురించే మొక్కగా పరిణమిస్తుంది
అన్నం ముట్టిన ప్రతి చేయి
జై కిసాన్ అంటూ గాల్లో లేస్తుంది.
రెక్కలిరుసుకున్న కష్ట ఫలితం
మెతుకై పిడికిల్లోకి చేరుతుంది
కాళ్ళొంచిన కర్మఫలం
దళారి చేతుల్లో విరచబడుతుంది
అరువు దరువై వీపున మోగుతుంటే
కరువు రక్కసి కోరలు చాస్తుంది
ఎరువు ధర శిఖరాగ్రాన కూర్చున్నాక
మొలకెత్తిన విత్తు మోసు
గుండెలవిసేలా రోదిస్తుంది.
భరోసా భుజం తట్టినట్లే వుంటాది
కుప్పకొచ్చిన కాయ సాగిలపడినాక
రేటు మొహం ముడుచుకుంటాది
గుత్తులుగా కాసిన పంట చివర్లో
ఇంటి గుత్తకు కూడా చాలకపోతాది
ఆర్థిక స్థితి తిరగబడి ఎగబడినాక
మట్టి మనిషికి మన్నే గతైతాది.
దున్నకానికి ఖర్చు భారం
మెడకు చుట్టిన తాడై పోయాక
గిట్టుబాటు ఉసురు తీస్తుంది
ఎన్ని ప్రణాళికలు కాగితాలపై
అక్షరాలుగా ఒలికిపోయినా
నమ్మకం నీటి మీద బుడగైపోతాది
విత్తు విత్తినప్పుడు రేటు కొండంత
కాయ రాశికి రాగానే గులకరాయంత
తాను నష్టపోతూనే మెతుకులు పంచే
మట్టి మనిషికి ప్రణమిల్లాలి.

- నరెద్దుల రాజారెడ్డి,
సెల్ : 9666016636

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

# ప్రధాని పర్యటనకు నిరసన సెగ

- వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తగదని, బల్క్ డ్రగ్ పార్కు వద్దని ఆందోళనలు
- పిఎం బహిరంగ సభ సమీప ప్రాంతంలో హోరెత్తిన మోడీ గో బ్యాక్ నినాదాలు
- ఆందోళనకారుల అరెస్టు - రాజయ్యపేటలో ఉద్రిక్తత

మద్దిలపాలెంలో సిపిఎం నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ విలేకరి (విశాఖ), అనకాపల్లి ప్రతినిధి**

ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనకు నిరసన సెగ తగిలింది. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను నిలిపివేసి ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, విశాఖ వేదికగానే ప్రధాని నిర్దిష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల నాయకులు ప్రధాని బహిరంగ సభ సమీప ప్రాంతమైన మద్దిలపాలెం వద్ద మెరుపు నిరసనకు దిగారు. పోలీసుల రాకతో ఆ ప్రాంతమంతా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మద్దిలపాలెం సమీపంలోని కిన్నెర, కామేశ్వరి థియేటర్ సమీప ప్రాంతం నుంచి మద్దిలపాలెం కూడలి వరకు పోలీసు వలయాన్ని ఛేదించుకుంటూ సిపిఎం, సిపిఐ నాయకులు దూసుకెళ్లారు. మోడీ గో బ్యాక్ నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా బ్యానర్లు, నల్ల జెండాలు పట్టుకుని ఆందోళనకారులు తమ నిరసన తెలిపారు. పోలీసులు వారిని అరెస్టు చేసి విశాఖ మూడో పట్టణ, ఎంవిపి.కాలనీ, నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ.. మోడీకి దాసోహమై విశాఖ స్టీల్ ప్లాంట్‌కు టిడిపి కూటమి ప్రభుత్వం తీవ్ర ద్రోహం తలపెట్టిందని విమర్శించారు. తీరు మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ క్రమంలో పోలీసులు ఆందోళనకారులపై విరుచుకుపడ్డారు. ఈడ్చుకుంటూ వెళ్లి పోలీసు వాహనాలు ఎక్కించారు. అరెస్టయిన వారిలో సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.జగన్, పి.మణి, వి.కృష్ణారావు, నాయకులు బొట్టా ఈశ్వరమ్మ, సిపిఐ నాయకులు ఎ.విమల, కె.సత్యనారాయణ సహా 120 మంది ఉన్నారు. కాంగ్రెస్ నాయకులు దండి ప్రియాంక, మమతా నాగిరెడ్డి, లక్కరాజు రామారావు తదితరులు ఆంధ్ర యూనివర్శిటీ ప్రధాన ద్వారం వద్ద ధర్నాకు దిగగా వారినీ పోలీసులు అరెస్టు చేశారు.

**బల్క్ డ్రగ్ పార్క్ పై వెల్లువెత్తిన నిరసన**

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నియోజకవర్గమైన పాయకరావుపేట పరిధి నక్కపల్లి మండలం రాజయ్యపేటలో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ పాటిమీద, మూలపర్ర, తమ్మయ్యపేట నిర్వాసితులు నిరసన తెలిపారు. బల్క్‌డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలని రాజయ్యపేటలో మత్స్యకారులు ఆందోళన చేపట్టారు. అక్కడ వారితో కలిసి నిరసన తెలుపుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు, నక్కపల్లి మండల కార్యదర్శి రాజేష్, జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణలను పోలీసులు బలవంతంగా వాహనం ఎక్కించి నిరసనకారులను చెదరగొట్టడానికి చేసిన ప్రయత్నాలను ప్రతిఘటించారు. పోలీసు వాహనాన్ని మహిళలు అడుగడుగునా అడ్డుకోవడంతో అరెస్టు చేసిన వారిని ద్విచక్రవాహనాల్లో పలు స్టేషన్లకు పోలీసులు తరలించారు. రాజయ్యపేట వద్ద ఏర్పాటు చేసిన మోడీ వర్చువల్ సభలో నిరసనలు తెలపకుండా నాలుగు వైపులా పోలీసులు నిఘాపెట్టారు. నక్కపల్లి జడ్‌పిటిసి గోసల కాసులమ్మను రాజయ్యపేటలో ఆమె గృహంలో నిర్బంధం చేశారు. వైసిపి సీనియర్ నాయకులు వీసం రామకృష్ణ, చందనాడ ఎంపిటిసి సభ్యులు గంటా తిరుపతిరావు, వైసిపి నాయకులు తళ్ల భార్గవ్, సూరకాసుల గోవిందలను నక్కపల్లి, పాయకరావుపేట పోలీస్ స్టేషన్లకు తరలించారు.

## 'హెల్మెట్' ఆదేశాల అమలుపై హైకోర్టు సంతృప్తి

**ప్రజాశక్తి-అమరావతి**

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలన్న తమ ఆదేశాల అమలు తీరుపై హైకోర్టు సంతృప్తి వ్యక్తం చేసింది. గత 20 రోజుల్లోనే ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన, హెల్మెట్లు ధరించని వాహనదారుల నుంచి రూ.95 లక్షలు చలాన్ల రూపంలో వసూలు చేయడం అభినందించదగ్గ విషయమంది. హెల్మెట్ ధరించకపోవడం వల్ల కలిగే నష్టాలపై పత్రికలు, టివిల్లో ప్రముఖంగా ప్రకటనలు ఇవ్వాలంది. తదుపరి పురోగతిపై ఈ నెల 29న విచారణ నాటికి నివేదిక ఇవ్వాలని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది.

**వాసుదేవరెడ్డి పిటిషన్‌పై విచారణ వాయిదా**

మద్యం బాటిళ్లపై అతికించే హై సెక్యూరిటీ హోలోగ్రామ్స్ తయారీ, సరఫరా కాంట్రాక్టు వ్యవహారంపై దాఖలైన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ ఎపి బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిబిసిఎల్) పూర్వ ఎమ్‌డి వాసుదేవరెడ్డి వేసిన పిటిషన్‌పై విచారణ 17కు వాయిదా పడింది. ఈలోగా సిఐడి కౌంటర్ దాఖలు చేయాలని జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప బుధవారం ఆదేశించారు.

## బెల్టుషాపులపై చర్యలకు హైకోర్టు ఆదేశం

**ప్రజాశక్తి-అమరావతి**

రాష్ట్రంలో బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. తిరుపతి జిల్లా, పెళ్లకూరు మండల పరిధిలోని బెల్టుషాపులపై ఆ జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలంది. బెల్టుషాపులపై నివేదిక ఇవ్వాలంది. విచారణను మార్చి ఐదుకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. పెళ్లకూరు మండల పరిధిలో విచ్చలవిడిగా బెల్టు షాపులున్నాయంటూ ఆ జిల్లాకు చెందిన నన్నం ప్రిస్లీలా, పెన్నేపల్లికి చెందిన లక్కల సుధారాణి పిల్స్ దాఖలు చేశారు.

## నకిలీ వైద్యుని వద్ద మందుల స్వాధీనం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో :** వరంగల్ జిల్లా ఖిలా వరంగల్, ఉర్సూదర్గాకు చెందిన అడ్లూరి దిలీప్ కుమార్ ఎలాంటి అర్హత లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌పై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడి చేశారు. డ్రగ్ లైసెన్స్ లేకుండా అమ్మేందుకు మందులను నిల్వ ఉంచుకున్నట్టు అధికారులు గుర్తించారు. రూ.10 వేల విలువైన మందులను స్వాధీనం చేసుకున్నారు.

**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
Lenin Centre, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

NIT No. 38/MAU61-USI0HB/17/2024-HB/2nd Call Dt.07.01.2025

**E PROCUREMENT SHORT TENDER NOTICE (SECOND CALL)**

**Name of Work:** "Supply and Installation of VRV Daikin Air Condition System of ODU 12 HP along with IDU's of Various capacities in the Peshi and its connected areas of Hon'ble Minister for Human Resources Development, IT Electronics & Communication and RTG in Building-4 at AP Secretariat, IGC, Velagapudi"- **Estimate Cost Rs.11,00,000/-**

The bid can be downloaded on AP e-procurement portal from **09.01.2025 to 16.01.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid **16.01.2025 up to 15.00 Hrs,** Technical bid opening **16.01.2025 @ 16.00 Hrs**. For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/- Commissioner, APCRDA, Vijayawada

**లాంఛనప్రాయ స్వాధీనతా ప్రకటన**

ICICI Home Finance | **రిజిష్టర్డు ఆఫీసు:** ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్ల కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్) ముంబయి-400051
**కార్పొరేట్ ఆఫీసు:** ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, జెబి నగర్, అంధేరి కుర్ల రోడ్, అంధేరి ఈస్ట్, ముంబయి-400059.
**బ్రాంచ్ ఆఫీసు:** సుప్రియా టవర్స్, అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్, డి.నెం.5-37-155, 4/15 బ్రాడిపేట్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002.

ఏదైతే,
క్రింది సంతకందారులు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్‌కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్ 2002లోని రూల్3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ దిగువపేర్కొన్న రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీచేయబడినవి. రుణగ్రహీత బకాయి వాన్నమొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందినకారణంగా, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ-పేర్కొన్న తేదీలలో సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువగల సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలతో క్రింది సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకొన్నారు. ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, సదరు ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఏదేని లావాదేవీలు జరుపదలచిన వారు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ వారికి చెల్లించుటకు లోబడి ఉంటుందని తెలియజేయనైనది.
సెక్యూర్డు అసెట్స్ విమోచనానికి అందుబాటులోవున్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (8) నియమాల క్రింద రుణగ్రహీత శ్రద్ధను కోరుతున్నారు.

| క్ర. సం. | రుణగ్రహీత /సహ-రుణగ్రహీత పేరు / రుణ ఖాతా నంబరు | ఆస్తి యొక్క వివరణ/ స్వాధీనం చేసుకొన్న తేది | డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులోని మొత్తం (రూ.) | బ్రాంచ్ పేరు |
|---|---|---|---|---|
| 1. | కొమ్మనబోయిన శ్రీనివాసరావు (రుణగ్రహీత), కొమ్మనబోయిన లక్ష్మి (సహ-రుణగ్రహీత), LHGTR00001487624. | కర్లపాలెం గ్రామం మరియు మండలం బాపట్ల, ఆర్ఓ బాపట్ల జిల్లా, కర్లపాలెం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522101లోని సర్వేనెం:502/1ఇ లోగల 169.4 చ.గ.ల విస్తీర్ణంతో ఆర్‌సిసి రూఫ్డ్ ఇంటి డి.నెం.7-49 మొత్తం భాగం. సరిహద్దులు: ఉత్తరం: షేక్ మీరా స్థలం, దక్షిణం: పంచాయితీ సిసి రోడ్, తూర్పు: సలగల్ రావు స్థలం, పడమర: పంచాయితీ సిసి రోడ్/ స్వాధీనతా తేదీ: 06-జనవరి-2025 | 16-08-2024 Rs. 19,14,450.14/- | గుంటూరు |
| 2. | కొమ్మనబోయిన శ్రీనివాసరావు (రుణగ్రహీత), కొమ్మనబోయిన లక్ష్మి (సహ-రుణగ్రహీత), LHGTR00001488513. | కర్లపాలెం గ్రామం మరియు మండలం బాపట్ల, ఆర్ఓ బాపట్ల జిల్లా, కర్లపాలెం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522101లోని సర్వేనెం: 502/1ఇ లోగల 169.4 చ.గ.ల విస్తీర్ణంతో ఆర్‌సిసి రూఫ్డ్ ఇంటి డి.నెం.7-49 మొత్తం భాగం. సరిహద్దులు: ఉత్తరం: షేక్ మీరా స్థలం, దక్షిణం: పంచాయితీ సిసి రోడ్, తూర్పు: సలగల్ రావు స్థలం, పడమర: పంచాయితీ సిసి రోడ్/ స్వాధీనతా తేదీ: 06-జనవరి-2025 | 16-08-2024 Rs. 88,797.92/- | గుంటూరు |

ఇందుమూలంగా పైన పేర్కొన్న రుణగ్రహీత(లు)/ హామీదారు(ల)కు బాకీ మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా 30 రోజుల ప్రకటన ఇవ్వబడుతుంది, లేనిచో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 మరియు 9 క్రింద నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 30 రోజులు ముగిసిన తరువాత సదరు తాకట్టుపెట్టిన ఆస్తులు విక్రయించబడును.

**తేది: 09 జనవరి, 2025, ప్రదేశం: గుంటూరు** **అధీకృత అధికారి, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్**

## మినీల్యాబ్స్‌గా తరగతి గదులు

- సమగ్ర శిక్షా డైరెక్టర్ శ్రీనివాసరావు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో :** తరగతి గదులు.. మినీ ల్యాబ్స్‌గా మారి మరెన్నో వినూత్న ఆవిష్కరణలు విద్యార్థుల నుంచి రావాలని సమగ్ర శిక్షా డైరెక్టర్ బి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. పోరంకిలో రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆయన మాట్లాడారు. విద్యార్థుల ప్రయోగాలను వీడియోలుగా చేసి ప్రతి పాఠశాలకూ పంపాలని, పాఠశాలలకు ఇచ్చిన ప్రతి రిసోర్సును ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ ప్రదర్శనలో ఎంపికైనవారు ఈ నెల 20 నుంచి 22 వరకు పాండిచ్చేరిలో దక్షిణ భారతదేశ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారని ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ ఎంవి కృష్ణారెడ్డి తెలిపారు.

## రోడ్డు ప్రమాదాలకు ఏడాదిలో 1.8 లక్షల మంది బలి

**న్యూఢిల్లీ :** గతేడాది 2024 దేశంలో రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 1.8 లక్షల మంది మరణించారు. వీరిలో 30 వేల మంది ద్విచక్ర వాహనాల్లో ప్రయాణం చేస్తూ హెల్మెట్ ధరించని కారణంగా మృతి చెందారు. ఈ వివరాలను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కారీ వెల్లడించారు. అలాగే రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారిలో 66 శాతం మంది 18 నుంచి 34 ఏళ్ల వయస్సువారేనని మంత్రి తెలిపారు. అలాగే మృతుల్లో దాదాపు 10 వేల మంది పాఠశాల విద్యార్థులేనని, విద్యా సంస్థల ముందు సరైన ట్రాఫిక్ ఏర్పాట్లు లేకపోవడం వలనే ఇలాంటి మరణాలు సంభవించాయని మంత్రి తెలిపారు.

## శ్రీచైతన్య విద్యార్థి అనుమానాస్పద మృతి

**ప్రజాశక్తి - కంకిపాడు**

కృష్ణా జిల్లా పెనమలూరు మండలం తాడిగడపలోని శ్రీ చైతన్య కళాశాలలో ఓ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మరణించారు. విద్యార్థిని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడకు చెందిన రామిశెట్టి గంగా భువనేశ్వరి (18) పెనమలూరు నియోజకవర్గం తాడిగడపలోని శ్రీ చైతన్య కళాశాల నర్సరీ భవన్‌లో నీట్ లాంగ్ టర్మ్ కోర్సులో శిక్షణ తీసుకుంటున్నారు. మంగళవారం రాత్రి అనారోగ్యంగా ఉండడంతో వార్డెన్ మందులు ఇచ్చారు. అర్ధరాత్రి సమయంలో ఆమె మరణించారు. ఆమె మృతదేహాన్ని సమీపంలోని కామినేని ఆస్పత్రికి తరలించి విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. విద్యార్థిని తల్లి గోవింద లక్ష్మి మాట్లాడుతూ.. తన కుమార్తెకు ఎటువంటి అనారోగ్య సమస్యలు లేవని తెలిపారు. మంగళవారం రాత్రి కూడా తనతో ఫోన్లో మాట్లాడిందని బోరున విలపించారు. గత రాత్రి తన కుమార్తెకు తల నొప్పి వస్తే అర్ధరాత్రి ఆస్పత్రికి తీసుకెళ్లామని ఆస్పత్రి యాజమాన్యం చెబుతోందని, ఇప్పుడు చనిపోయిందని అంటున్నారని తెలిపారు. తమ కుమార్తె మృతిపై విచారణ చేసి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బంధువులు కోరారు. కుమార్తె మృతి వార్త తెలిసిన వెంటనే ఆమె తండ్రికి గుండెపోటు రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

**విచారణ జరపాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళన**

గంగా భువనేశ్వరి మృతిపై సమగ్ర విచారణ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థిని మృతికి నిరసనగా కళాశాల వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. విద్యార్థిని మృతికి కారణమైన చైతన్య కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎస్‌ఎఫ్‌ఐ కృష్ణాజిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రేమ్ కుమార్, ఎస్.సమరం, రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

**హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్**
HDB FINANCIAL SERVICES
నమోదిత కార్యాలయం : రాధిక, 2వ అంతస్తు, లా గార్డెన్ రోడ్, నవరంగ్‌పుర, అహ్మదాబాద్ - 09.
శాఖా కార్యాలయం : # 76-8-10/1, ఫ్లాట్ నం.4, భవాని టవర్స్, స్వాతి థియేటర్ రోడ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన, భవానిపురం, విజయవాడ - 520012.

**ఇ.-వేలం విక్రయ నోటీసు**

(రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/సాధారణ ప్రజలకు) (సర్ఫాసీ యాక్ట్, 2002 యొక్క రూల్ 9 (1)తో చదువుతూ రూల్ 8(6) క్రింద)

దిగువ సంతకందారు **హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ది ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 క్రింద జారీచేయబడిన నోటీసు అనుసరించి దిగువ ఆస్తిని **స్వాధీనం చేసుకున్నారు,** దిగువ పేర్కొన్న రుణ ఖాతాలలో కంపెనీ బకాయిలను రియలైజేషన్ కొరకు **"ఏది ఎక్కడ ఎలా ఉన్నది మరియు అది అక్కడ అలాగే ప్రాతిపదికన"** వాటిని విక్రయించబడుతుంది.

**దరఖాస్తుదారు మరియు సహ దరఖాస్తుదారు పేరు & చిరునామా: 1) శ్రీ దుర్గా స్వీట్స్,** డో.నం.8-8-5, రైల్వే స్టేషన్ రోడ్డు, తెనాలి-522201, ఆంధ్రప్రదేశ్. మరియు ఇక్కడ కూడా : షాప్ నం.2, స్టేషన్ రోడ్డు, వార్డు-34, తెనాలి-522201, ఆంధ్రప్రదేశ్. మరియు ఇక్కడ కూడా : డో.నం.8-8-5/1, పాలపర్తి వారి వీధి డివిజన్-9, స్టేషన్ రోడ్డు తెనాలి-522201, ఆంధ్రప్రదేశ్. **2. సమ్మెట పెద్ద మద్దిలేటి రాజు (మరణించారు), తండ్రి. సమ్మెట రంగరాజు,** నివాసం : డో.నం.8-16-8/ఎ, రెవెన్యూ వార్డు నం.1, రాములవారి గుడి, రామస్వామి పేట, బాలాజీరావుపేట, తెనాలి-522201, ఆంధ్రప్రదేశ్. **3. సమ్మెట జయమ్మ, భర్త. సమ్మెట పెద్ద మద్దిలేటి రాజు,** నివాసం : డో.నం.8-16-8/ఎ, రెవెన్యూ వార్డు నం.1, రాములవారి గుడి, రామస్వామిపేట, బాలాజీరావుపేట, తెనాలి-522201, ఆంధ్రప్రదేశ్. **4. సమ్మెట మాధవరాజు, తండ్రి. సమ్మెట పెద్ద మద్దిలేటి రాజు,** నివాసం : డో.నం.8-16-8/ఎ, రెవెన్యూ వార్డు నం.1, రాములవారి గుడి, రామస్వామిపేట, బాలాజీరావుపేట, తెనాలి-522201, ఆంధ్రప్రదేశ్. **5. కడిమెళ్ల నాగలక్ష్మి, నాగమణి, తండ్రి. సమ్మెట పెద్ద మద్దిలేటి రాజు,** నివాసం : డో.నం.8-16-8/ఎ, రెవెన్యూ వార్డు నం.1, రాములవారి గుడి, రామస్వామిపేట, బాలాజీరావుపేట, తెనాలి-522201, ఆంధ్రప్రదేశ్. **6. కంపరాజు శాంతి, తండ్రి. సమ్మెట పెద్ద మద్దిలేటి రాజు,** నివాసం : డో.నం.8-16-8/ఎ, రెవెన్యూ వార్డు నం.1, రాములవారి గుడి, రామస్వామిపేట, బాలాజీరావుపేట, తెనాలి-522201, ఆంధ్రప్రదేశ్.
**ఖాతా నం. : 5733120-10917999-12892368, పూర్తి బకాయి మొత్తాలు : 08-01-2025 నాటికి రూ.63,20,969/- (అరవై మూడు లక్షల ఇరవై వేల తొమ్మిది వందల అరవై తొమ్మిది రూపాయలు మాత్రమే). సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తెలిసిన ఏవేని రుణభారాల వివరాలు : ..... నిల్.**

**స్థిర కమర్షియల్ ఆస్తుల వివరాలు :**

సెక్యూరిటీలు-1 షెడ్యూల్ : **1వ అంశం :** గుంటూరు జిల్లా, తెనాలి సబ్ రిజిస్ట్రీ, తెనాలి మున్సిపాలిటీ, టి.ఎస్.నం.8/4బి, 8/6ఎ, బ్లాక్ నం.1, వార్డు నం.2 లో ఉన్న రెండు అంశములు కలిగి ఉన్న 90 చ.గ.లు.+ 2వ అంశం 24-66= విస్తీర్ణం 114-86 చ.గ.లు. లేదా 95-86 చ.మీ.లు. తో పాటు ఇంటి నిర్మాణం ఉన్న **హద్దులు : డో.నం.8-16-8** ఒకటవ అంశం : 114-66 చ.గ.లు. (75-24 చ.మీ.లు.) ఉన్న హద్దులు : డో.నం.8-16-8. **ఉత్తరం :** తులిశెట్టి సాంబశివరావు ఆస్తి, **దక్షిణం :** గిట్టి రాధాకృష్ణమూర్తి ఆస్తి, **తూర్పు :** ఉమ్మడి మార్గం, **పడమర :** తులిశెట్టి సాంబశివరావు ఆస్తి.
సెక్యూరిటీలు-2 షెడ్యూల్ : **రెండవ అంశం :** 24-66 అవిభక్త వాటా బయట మొత్తం పరిధి 74 చ.గ.లు. ఉన్న **హద్దులు : డో.నం.8-16-8** వద్ద, **ఉత్తరం :** తులిశెట్టి నారాయణరావు ఆస్తి, **దక్షిణం :** గిట్టి రాధాకృష్ణ మూర్తి ఆస్తి, **తూర్పు :** రామమందిరం వీధిగా పిలువబడే మున్సిపల్ వీధి, **పడమర :** 1వ అంశం మరియు తులిశెట్టి అనిల్ కుమార్ ద్వారా అమ్మబడిన ఆస్తి.

| రిజర్వు ధర | బయానా మొత్తం | బిడ్ పెంపుదల మొత్తం | వేలం తేది మరియు సమయం | ఇఎమ్‌డి చివరి తేది మరియు సమయం |
|---|---|---|---|---|
| Rs.39,37,734/- | Rs.3,93,773/- | Rs.1,00,000/- | 30-01-2025 at 11 AM to 12 Noon | 29-01-2025 up to 06:00 p.m |

**టెండరు కం వేలం అమ్మకపు నియమాలు మరియు నిబంధనలు :**

**ఋణగ్రహీత(లు) : 1) త్రీ సీజన్స్ ఆక్వాటెక్ ప్రైవేట్ లిమిటెడ్,** ఫ్లాట్ నెం. 201ఎ, గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్, ఖాజాగూడ, మణికొండ, నానక్‌రామ్‌గూడ, గచ్చిబౌలి,హైదరాబాద్-500032. **2) శ్రీ సాయి రాజ్ జంపన,** డి.నెం. ఎ-2-293/82/ఎ/594, ఫ్లాట్ నెం.302, ప్లాట్ నెం. 594, రోడ్ నెం. 29, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033. **3) శ్రీమతి ఉషా గాంధి జంపన,** డి.నెం. ఎ-2-293/82/ఎ/594, ఫ్లాట్ నెం.302, ప్లాట్ నెం. 594, రోడ్ నెం. 29, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033. **4) శ్రీ సాయి రాజ్ జంపన,** మెస్సర్స్ త్రీ సీజన్స్ ఆక్వాటెక్ ప్రైవేట్ లిమిటెడ్, డి.నెం.2-62-8, పెద్దిరెడ్డి వారి వీధి, శాంతినగర్, కాకినాడ-533003. **5) మెస్సర్స్ కెవిఆర్ అసోసియేట్స్, తరుపున మేనేజింగ్ పార్ట్నర్ శ్రీ సాయిరాజ్ జంపన,** ఆర్ఎస్.నెం.135/2, డి.నెం.1-414, ప్రస్తుతం డి.నెం.1-385, దుప్పలపూడి గ్రామం, పీరాయి రామచంద్రపురం పంచాయితీ పరిధి, అనపర్తి మండలం, తూర్పుగోదావరి జిల్లా, **6) శ్రీ సాయి రాజ్ జంపన,** ఎస్.ఎఫ్.నెం. 2/4,5,3/1,2,3, పోతుకూరు గ్రామం, ఐనవల్లి మండలం, తూర్పుగోదావరి జిల్లా-533577, **7) శ్రీమతి ఉషా గాంధి జంపన,** ఎస్.ఎఫ్.నెం. 2/4,5,3/1,2,3, పోతుకూరు గ్రామం, ఐనవల్లి మండలం, తూర్పుగోదావరి జిల్లా-533577, **8) శ్రీమతి ఉషా గాంధి జంపన,** మెస్సర్స్ త్రీ సీజన్స్ అక్వాటెక్ ప్రైవేట్ లిమిటెడ్, డి.నెం.2-62-8, పెద్దిరెడ్డి వారి వీధి, శాంతినగర్, కాకినాడ-533003. **9) మెస్సర్స్ కెవిఆర్ అసోసియేట్స్, తరుపున మేనేజింగ్ పార్ట్నర్ శ్రీ సాయి రాజ్ జంపన,** డి.నెం.59ఎ-9-7/2, సాయి బాబా గుడి వీధి, ఆర్‌టిసి కాలనీ, విజయవాడ.
**విషయం : బ్యాంక్ వారికి మెస్సర్స్ త్రీ సీజన్స్ అక్వాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఋణపడిన బకాయి వసూలు చేసుకొను నిమిత్తమై సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద ఆస్తి విక్రయము గురించి.**
**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), 4వ అంతస్థు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520001 వారు** సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 **సెక్షన్ 13(2)** క్రింద **ది.06.04.2021**న **డిమాండ్ నోటీసు** ద్వారా మిమ్ములను మాకు చెల్లించవలసిన బకాయి మొత్తము నిర్దేశించిన గడువులోపు చెల్లించమని కోరినను, బకాయి మొత్తం నిర్దేశించిన గడువులోపు చెల్లించుటలో మీరు విఫలమైనారు. ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.07.08.2021**న సదరు చట్టంలోని సెక్షన్ 13(4) లోని 6 / 8వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారములతో అధీకృత అధికారి **లాంఛనాత్మక స్వాధీనం** చేసుకోవడమైనది.
ఆస్తిని **లాంఛనాత్మక స్వాధీనం** చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తమును చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు అందిన తేది నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా పబ్లిక్ ఇ-వేలం నిర్వహించడం ద్వారా దిగువ పేర్కొన ఆస్తిని విక్రయించడం అనివార్యమైనది.
ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం తేదీ మరియు సమయం ఇ-వేలం నిర్వహించబడే సర్వీస్ ప్రొవైడర్ యొక్క వివరములు విడిగా జారీచేయబడుతుంది.
కాబట్టి, మీరు బ్యాంకుకి చెల్లించాల్సిన మొత్తాన్నా విక్రయ నోటీసును ప్రచురించే తేదీకి ముందు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు బ్యాంక్ వెచ్చించిన ఖర్చులతో కలిపి చెల్లించినట్లయితే, ఆస్తి అమ్మకంపై తదుపరి చర్య తీసుకోబడదు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం తనఖాఆస్తులను విడిపించుకొను హక్కు కలదు.

**షెడ్యూల్ ఆస్తి**
**తనఖావుంచబడిన స్థిరాస్తి వివరములు దిగువ పేర్కొనబడినవి : ఆస్తి 1:** తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి మండలం, పీరాయి రామచంద్రాపురం గ్రామపంచాయతీ, దుప్పలపూడి గ్రామము, అసెస్మెంట్ నెం.412, ఆర్.యస్.నెం.135/2, డి.నెం.1-414 నందు **మెస్సర్స్ కె.వి.ఆర్. అసోసియేట్స్ (రిజిస్టర్డ్ నెం.5/2010 ప్రకారం) తరపున మేనేజింగ్ పార్ట్నర్ శ్రీ జంపన సాయిరాజ్‌కు** చెందిన ఎ.4.52 సెంట్లు లేదా 21876.80 చ॥గ॥ల విస్తీర్ణముగల భూమి మరియు అందులోని రెండు ఆర్‌సిసి షెడ్లు కలిగిన గోడౌన్ బిల్డింగ్‌లకు సంబంధించిన యావదాస్తి. **స్థలమునకు హద్దులు: తూర్పు:** అనపర్తి నుండి రాజానగరంకు వెళ్ళు రోడ్డు, **దక్షిణం:** చిటికెన నాగమణి, మట్టె అనంతలక్ష్మి, కొవ్వూరి రామకృష్ణారెడ్డి మరియు ఇతరుల యొక్క భూమి, **పడమర:** నల్లమిల్లి వనమారెడ్డి మరియు ఇతరుల యొక్క భూమి, **ఉత్తరం:** తిరుపతి వెంకటేశ్వర రైస్‌మిల్ కొంత భాగము మరియు నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి మరియు ఇతరుల యొక్క భూమి కొంత భాగము.
**అక్షాంశ-రేఖాంశములు :16.963104,81.941980.**

స్థలం : విజయవాడ — సం/- అధీకృత అధికారి
తేది : 03-01-2025 — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

## యుజిసి ముసాయిదా నిబంధనలు ఉపసంహరించుకోండి

- సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్

**న్యూఢిల్లీ :** ఇటీవల విడుదల చేసిసిన యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) నిబంధనలు– 2025 ముసాయిదాను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని సిపిఎం డిమాండ్ చేసింది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో బుధవారం నాడు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ముఖ్యంగా వైస్ ఛాన్సలర్ల నియామకం కోసం సవవరించిన నిబంధన రాష్ట్రాల హక్కులపై నేరుగా దాడి చేయడమేనని పొలిట్‌బ్యూరో విమర్శించింది. వైస్ ఛాన్సలర్లను ఎంపిక చేసే అధికారం గవర్నర్–ఛాన్సలర్ నియమించే ముగ్గురు సభ్యుల సెలక్షన్ కమిటీకి కట్టబెట్టడాన్ని, పైగా ఈ కమిటీకి గవర్నరే చైర్‌పర్సన్‌గా ఉండటాన్ని పొలిట్ బ్యూరో ప్రశ్నించింది. ప్రస్తుతం కొన్ని ప్రతిపక్ష పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాల్లో వైస్‌ఛాన్సలర్ల నియామకంలో గవర్నర్లు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్న సమయంలో ఈ నిబంధన తీసుకు రావడంలో ఔచిత్యాన్ని ప్రశ్నించింది. ఈ సెలక్షన్ కమిటీలో ఎవర్ని నియమిస్తారనే విషయం రాష్ట్ర ప్రభుత్వానికి తెలియదని, ఈ నిబంధనతో గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో తనకు నచ్చిన వైస్‌ఛాన్సర్లలను నియమించుకోడానికి ఇది వీలు కల్పిస్తోందని పొలిట్‌బ్యూరో ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ముసాయిదా ద్వారా విద్య అనేది ఉమ్మడి జాబితాకు చెందుతుందనే రాజ్యాంగ నిబంధనను కేంద్రం ఉల్లంఘించిందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలతో సహా అన్ని ప్రజాస్వామిక వర్గాలు ఈ ప్రమాదకరమైన నిబంధనను ఐక్యంగా వ్యతిరేకించాలని పొలిట్‌బ్యూరో విజ్ఞప్తి చేసింది.

## ఆశారాంతో ప్రాణహాని

- బెయిల్ మంజూరుపై బాధిత తండ్రి ఆందోళన

**షాజహాన్‌పూర్ :** బాలికపై అత్యాచారం కేసులో వివాదస్పద అధ్యాత్మిక గురువు ఆశారాంకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో బాధిత కుటుంబం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆశారాం జైలులో ఉన్న సమయంలోనే ఈ కేసుకు సంబంధించిన నలుగురు సాక్షులు హత్యకు గురయ్యారు. మరో ఇద్దరు సాక్షులు కనిపించకుండా పోయారు. అలాగే ఆశారాం జైల్లో ఉన్నప్పుడే జమ్ము, జోధ్‌పూర్, ఢిల్లీ, సురసాగర్‌ల్లో తనపై తప్పుడు కేసులు బనాయించినట్లు బాధిత బాలిక తండ్రి తెలిపారు. ఇప్పుడు ఆయన బయటకు వస్తే తమ కుటుంబం బతికిబట్టకట్టే అవకాశం ఉంటుందా? అని ఆయన ప్రశ్నించారు. మైనర్లపై నేరాలకు సంబంధించిన కేసుల్లో దోషులకు ఉరిశిక్ష విధించేవిధంగా చట్టాలు ఉన్నాయని చెబుతున్నా..ఆ చట్టాలన్నీ ఆశారాం విషయంలో ఎందుకు అమలు కావడం లేదో అర్థం కావడం లేదన్నారు. న్యాయస్థానాలు ఆశారాం పట్ల మెతక వైఖరిని కొనసాగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే బాధిత బాలిక కుటుంబానికి భద్రత పెంచినట్లు ఉత్తరప్రదేశ్ పోలీసులు బుధవారం వెల్లడించారు.

## ఇయు జోలికి వస్తే సహించబోం !

- ట్రంప్‌పై ఫ్రాన్స్ ఆగ్రహం

**పారిస్ :** తమ సరిహద్దులపై దాడులు చేస్తే యురోపియన్ యూనియన్ సహించబోదని ఫ్రాన్స్ స్పష్టం చేసింది. గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటామంటూ అమెరికా అధ్యక్షునిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జేన్ నోయల్ బారట్ బుధవారం ఈ మేరకు హెచ్చరిక జారీ చేశారు. గ్రీన్‌ల్యాండ్, పనామా కాలవపై అమెరికా నియంత్రణను కలిగివుండాలన్న ఆకాంక్షలో భాగంగా సైనిక లేదా ఆర్థికపరమైన చర్యలు తీసుకోవడాన్ని తోసిపుచ్చడానికి ట్రంప్ సోమవారం నిరాకరించారు. 600 ఏళ్ళకు పైగా డెన్మార్క్‌లో భాగంగా వున్న అపారమైన ఆర్కిటిక్ దీవిపై అమెరికా దండయాత్ర చేస్తుందని తాను భావించడం లేదని ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి పేర్కొన్నారు. ఎవరైనా కానీ తమ సార్వభౌమాధికారం కలిగిన సరిహద్దులపై దాడి చేస్తే యురోపియన్ యూనియన్ సహించబోదని స్పష్టం చేశారు.

# న్యాయవ్యవస్థ అధికారాల సంగతేంటి?

- సూటిగా ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం
- సిఇసి, ఇసిల నియామక వ్యవహారంపై ఫిబ్రవరిలో విచారణ

**న్యూఢిల్లీ :** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి), ఎన్నికల కమిషనర్ల (ఇసి) నియామకాలకు సంబంధించి 2023లో మోడీ సర్కార్ తీసుకొచ్చిన చట్టం చెల్లుబాటు వ్యవహారంలో జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం బుధవారం కీలక వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగంలోని 141వ అధికరణ కింద న్యాయవ్యవస్థకు ఉన్న అధికారాలను ఈ చట్టం ఉల్లంఘిస్తోందా? లేదా నీరుగార్చనుందా? అనేది ఇక్కడ తేలాల్సిన అసలు సమస్య అని జస్టిస్ సూర్యకాంత్ నొక్కి చెప్పారు. ఈ చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను వచ్చే ఫిబ్రవరి నెలలో విచారిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రధాన ఎన్నికల అధికారి త్వరలోనే పదవీవిరమణ చేస్తారని, కాబట్టి ఈ వ్యవహారంపై అత్యవసర విచారణ జరపాలని త్రిసభ్య ధర్మాసనాన్ని పిటిషనర్ల తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోరారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ 2023లో చేసిన చట్టంపై విచారణ జరపడానికి కొంత సమయం అవసరమని చెబుతూ ఇది అంతిమంగా శాసన అధికారాలకు, న్యాయస్థానం అభిప్రాయానికి మధ్య నడుస్తున్న కేసు అని వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలోని 141వ అధికరణ కింద సుప్రీం కోర్టుకు వున్న అధికారాలను ఈ చట్టం ఉల్లంఘిస్తోందా లేదా నీరు గారుస్తోందా అనేదే ఇక్కడ ప్రధానమైన సమస్య అని ఆయన పేర్కొన్నారు. 141వ అధికరణ కింద సుప్రీం కోర్టు తీసుకునే నిర్ణయాల (బైండింగ్ డెసిషన్స్)కు దేశంలోని అన్ని న్యాయస్థానాలు, అధికారిక సంస్థలు కట్టుబడి వుండాల్సి వుంటుంది. కోర్టు అభిప్రాయానికి, చట్టసభల అధికారాల అమలుకు మధ్యనే అసలు పరీక్ష లేదా సవాలు అనేది వుంటుందని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును సవరిస్తూ లేదా కొట్టివేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడానికి పార్లమెంట్‌కు అధికారం వుందా లేదా అనే కీలకమైన అంశాన్ని పిటిషన్లు లేవనెత్తుతున్నాయి.

ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకం పార్లమెంట్ తీర్మానించి, రాష్ట్రపతి ఆమోదం పొందిన చట్టంలోని నిబంధనలకు లోబడి ఉండాలని రాజ్యాంగంలోని 324వ అధికరణ నిర్దేశిస్తోంది. అయితే అలాంటి చట్టమేదీ అమలులో లేదని పిటిషనర్లు గతంలో కోర్టు దృష్టికి తెచ్చారు. సిఇసి, ఇసిల నియామకం కోసం కొలీజియం తరహా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై 2023 మార్చిలో ఐదుగురు సభ్యుల ధర్మాసనం రూలింగ్ ఇస్తూ ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ సలహా మేరకు వారి నియామకాలు జరపాలని తెలిపింది. అయితే సిఇసి, ఇసిల నియామకాలు, సర్వీస్ నిబంధనలు, పదవీకాలానికి సంబంధించి మోడీ ప్రభుత్వం 2023లో పార్లమెంటులో ఓ చట్టాన్ని చేసింది. దీని ప్రకారం సిఇసి, ఇసిల నియామకాల కమిటీలో ప్రధానమంత్రి, కేంద్ర క్యాబినెట్ మంత్రి, ప్రతిపక్ష నేత లేదా లోక్‌సభలో అతి పెద్ద ప్రతిపక్ష పార్టీ నాయకుడు సభ్యులుగా ఉంటారు. ప్రధాన న్యాయమూర్తిని కమిటీ నుండి తప్పించారు.

నూతన చట్టాన్ని స్వచ్ఛంద సంస్థ అయిన అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్), మధ్యప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు జయ ఠాకూర్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అయితే నూతన చట్టంపై స్టే ఇచ్చేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. కాగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన త్రిసభ్య బెంచ్ ముందు ప్రశాంత్ భూషణ్ బుధవారం వాదిస్తూ వచ్చే వారమే దీనిపై విచారణ జరపాలని కోరారు. ప్రస్తుత సిఇసి వచ్చే నెలలో పదవీవిరమణ చేస్తున్నారని ఆయన కోర్టు దృష్టికి తెచ్చారు. ఫిబ్రవరి 5వ తేదీన ఢిల్లీ శాసనసభ ఎన్నికలు జరుగుతాయి. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రస్తుత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ పదవీవిరమణ చేస్తారు. పిటిషనర్ల తరపున హాజరైన మరో సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ తన వాదనలు వినిపిస్తూ 2023లో ఇచ్చిన తీర్పు ప్రాతిపదికను ప్రభుత్వం తొలగించలేదని, కేవలం కొత్త చట్టాన్ని మాత్రమే తీసుకొచ్చిందని తెలిపారు. కేసు విషయమై ఫిబ్రవరి 3వ తేదీన కోర్టుకు గుర్తు చేయాలని, నాలుగో తేదీన దీనిపై విచారణ జరిపేందుకు వీలు కలుగుతుందని జస్టిస్ కాంత్ సూచించారు.

### డివైఎఫ్ఐ నేత రజిత్ హత్య కేసులో 9 మంది బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలకు కఠిన కారాగార శిక్ష

**కన్నూర్ :** డివైఎఫ్ఐ నేత రిజిత్ (26) హత్య కేసులో 9మంది బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలకు న్యాయస్థానం కఠిన కారాగార శిక్ష విధించింది. 2005లో కన్నాపురంలో జరిగిన ఈ హత్య కేసును విచారించిన కన్నూరులోని తలస్సెరి అదనపు సెషన్స్ కోర్టు ఈ మేరకు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. న్యాయమూర్తి కె.జోస్ వారికి రూ.1.10లక్షల జరిమానా కూడా విధించారు. ఈ కేసులో 10 మంది నిందితులు వుండగా, వారిలో మూడో నిందితుడు అజేష్ విచారణ సమయంలో కారు ప్రమాదంలో చనిపోయాడు. మిగిలిన 9 మందికి ఇప్పుడు శిక్ష పడింది. సంఘ్ పరివార్ గూండాలు 2005 అక్టోబరు 3న రిజిత్‌ను దారుణంగా హత్య చేశారు. స్నేహితులతో కలిసి ఇంటికి వెళుతుండగా రాత్రి 9గంటల సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. సమీపంలోని ఆలయంలో ఆర్‌ఎస్‌ఎస్ శాఖను తెరవడంపై తలెత్తిన వివాదంతో 10మంది సభ్యుల ముఠా ఈ హత్యకు పాల్పడింది. ఈ ముఠా పొంచి వుండి దాడి జరిపి, కత్తులు, కర్రలు, ఇనుప రాడ్‌లతో అత్యంత దారుణంగా హతమార్చింది. అనంతరం పోలీసులు ఆ ఆయుధాలను, రక్తపు మరకలంటిన దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. దాంతో దాడి సమయంలో రిజిత్‌తో పాటూ వున్న కె.వి.నికేష్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారు. కాగా ఈ తీర్పు పట్ల బాధిత కుటుంబం అసంతృప్తిని వ్యక్తం చేసింది. మరణ శిక్ష విధిస్తారని ఆశించామని వ్యాఖ్యానించింది. దీనివల్ల తమ కుమారుడు తిరిగి రాడని, అయితే ఆ వ్యక్తులు తిరిగి సమాజంలో తిరగడానికి అనుమతించకూడదని కుటుంబ సభ్యులు వ్యాఖ్యానించారు. అయితే ఈ న్యాయం కోసం కూడా తాము సుదీర్ఘంగా 19ఏళ్ళు వేచి వుండాల్సి వచ్చిందన్నారు.

### జమిలి ఎన్నికలపై జెపిసి తొలి భేటీ

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

'ఒక దేశం–ఒకే ఎన్నిక' బిల్లును పరిశీలించేందుకు ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ సంఘం (జెపిసి) బుధవారం నాడిక్కడ తొలిసారి సమావేశమైంది. జమిలి ఎన్నికలపై ప్రతిపక్షాలు వ్యక్తం చేస్తున్న ఆందోళనపైన ఇది దృష్టి సారించనుంది. బిజెపి ఎంపి పిపి చౌదరి నేతృత్వంలోని 39 మంది సభ్యుల కమిటీ పార్లమెంట్ భవనంలో జరిపిన ఈ ప్రారంభ సమావేశానికి కేంద్ర శాసన, న్యాయ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులు హాజరై ప్రభుత్వ వాదనను వినిపించారు. అదే సమయంలో సిపిఎం సభ్యులు కె. రాధాకృష్ణన్‌తో సహా ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదిత బిల్లుపై తీవ్ర నిరసనను వ్యక్తం చేశారు. సమావేశం అనంతరం ఓ పెద్ద సూట్‌కేస్‌లో 18వేలకు పైగా పేజీల పత్రాలను కమిటీ సభ్యులకు అందజేశారు.జమిలి ఎన్నికలపై ప్రతిపక్ష, బిజెపి ఎంపిల మధ్య తీవ్ర చర్చ జరిగింది. కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా, సిపిఎం నేత రాధాకృష్ణన్, ఆప్ నేత సంజయ్ సింగ్, టిఎంసి నేత కళ్యాణ్ బెనర్జీతో సహా ప్రతిపక్ష ఎంపిలు ఖర్చు తగ్గుతుందనే అంశాన్ని ప్రశ్నించారు. మరోవైపు బిల్లుల్లోని నిబంధనలను బిజెపి ఎంపిలు సమర్థించారు. కాంగ్రెస్, టిఎంసి, సిపిఎం, డిఎంకె, ఆప్ తదితర పార్టీలు బిల్లుల్లోని రాజ్యాంగ ఉల్లంఘలను ఎత్తి చూపారు. "నిబంధనలు రాజ్యాంగానికి విరుద్ధంగానూ, ఫెడరలిజంపై దాడి చేసే విధంగానూ ఉన్నాయి" అని ఆందోళన వ్యక్తం చేశారు. "డబ్బు ఆదా చేయడం కంటే ప్రజల ప్రజాస్వామ్య హక్కులను సమర్థించడం చాలా ముఖ్యం" అని స్పష్టం చేశారు. బిల్లులు రాష్ట్రాల హక్కులకు భంగం కలిగిస్తున్నాయని విమర్శించారు. బిల్లులను క్షుణ్ణంగా పరిశీలించడానికి జెపిసికి కనీసం ఒక సంవత్సరం సమయం ఇవ్వాలని ప్రతిపక్ష ఎంపిలు సూచించారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్ని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఇవిఎం) అవసరమని కాంగ్రెస్ ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. ఒకే దేశం– ఒకే ఎన్నిక ఆచరణ సాధ్యం కాని సంస్కరణ అని, ఈ అంశంపై అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాన్ని తెలుసుకోవాలని సిపిఎం ఎంపి కె. రాధాకృష్ణన్ డిమాండ్ చేశారు. కేంద్రం ప్రతిపాదించిన బిల్లులు రాష్ట్రాల అధికారాలను లాక్కుంటూ సమాఖ్య సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు.

# కార్చిచ్చుతో కకావికలం

- లాస్‌ఏంజెల్స్‌ను చుట్టుముట్టిన దావానలం
- వీధుల్లోకి హాలివుడ్ తారలు
- రక్షిత ప్రాంతాలకు 30 వేల మంది తరలింపు

**లాస్‌ఏంజెల్స్ :** అమెరికాలో హాలివుడ్ దిగ్గజ సినీ నటులు, సంపన్నులు అధికంగా నివసించే లాస్‌ఏంజెల్స్ ఈశాన్య ప్రాంతాన్ని దావానలం చుట్టుముట్టింది. దాదాపు 3 వేల ఎకరాలు మంటలకు ఆహుతయ్యాయి. ఇప్పటికే 30 వేల మందికి పైగా ప్రజలను తరలించారు. ఉధృతంగా గాలులు వీస్తుండడంతో మంటలు చాలా వేగంగా వ్యాపిస్తున్నాయి. అధికార యంత్రాంగం అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. నగరంలో తీరం పొడవునా గల అత్యంత సంపన్నమైన పసిఫిక్ పాలిసాడ్స్ ప్రాంతానికి కూడా మంటలు పాకాయి. ఫలితంగా టామ్ హాంక్స్, మార్క్ హామిల్, హైదీ మాంటెగ్ వంటి పలువురు హాలివుడ్ ప్రఖ్యాత నటులు, రియాల్టీ షో ప్రముఖులు ఇళ్లను వీడాల్సి వచ్చింది. లాస్‌ఏంజెల్స్‌లోని పసిఫిక్ పాలిసాడ్స్ ప్రాంతంలో సంపన్నులు, సెలబ్రిటీలు ఎక్కువగా వున్నారు. కొండ ప్రాంతాల్లో రోడ్లకు ఇరు వైపులా కూడా మంటలు చెలరేగుతుండడంతో ఆ రోడ్లపై ప్రయాణం కూడా చాలా కష్టంగా మారింది. వీధుల్లో దట్టంగా పొగ కమ్మేయడంతో ఎదురుగా ఏం వస్తున్నాయో కూడా తెలియని ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ప్రజలు ఒక్కసారిగా వీధుల్లోకి రావడం వల్ల ట్రాఫిక్ జామ్ కావడంతో చాలామంది తమ కార్లను అక్కడే వదిలిపెట్టి కాలి నడకన సాగడం కూడా కనిపిస్తోంది.

అంతటా కార్చిచ్చు కమ్మేస్తుండడంతో బుధవారం ఉదయం జరగాల్సిన ఫిల్మ్ ప్రీమియర్లు సహా అనేక కార్యక్రమాలు రద్దయ్యాయి. సాయంత్రం 6.30గంటల ప్రాంతంలో అల్టాడెన్‌లో వృద్ధుల సంరక్షణ కేంద్రం సమీపంలో మంటలు చెలరేగాయి. దీంతో వీల్‌చైర్స్‌లో, మంచాలు, దుప్పట్లను ఉపయోగించి వృద్ధులను తరలిస్తున్నారు. మంగళవారం ఉదయం ప్రారంభమైన మంటలు రాత్రి వరకు కొనసాగుతునే వున్నాయి. రాత్రి వేళల్లో గాలులు మరింత ఉధృతంగా వుంటాయని గంటకు వంద మైళ్ళ వేగంతో గాలులు వీచే ప్రమాదం ఎక్కువగా వుంటుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితులు కొన్ని రోజుల పాటు కొనసాగే అవకాశం వుందని అంచనా వేస్తున్నారు. మంగళవారం ఉదయం నుండి 28వేలకు పైగా ఇళ్ళకు విద్యుత్ లేదు. వేలాది ఇళ్ళు అగ్నికి ఆహుతయ్యాయని కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ పేర్కొన్నారు. మరికొన్ని ప్రాంతాల్లో కూడా కార్చిచ్చు తలెత్తే ప్రమాదముందని అగ్నిమాపక శాఖ అధికారులు ఇప్పటికే హెచ్చరించారు. ఇప్పటివరకు 13వేలకు పైగా ఇళ్ళు, భవనాలకు కార్చిచ్చు ముప్పు పొంచి వుందని చెప్పారు. మంటలను ఆర్పేందుకు విమానాలు, హెలికాప్టర్లు, బుల్డోజర్లను అధికారులు రప్పించారు. అధ్యక్షుడు బైడెన్ ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాల్సిందిగా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.

## ఇంటర్మీడియట్‌లో ఎన్‌సిఇఆర్‌టి సిలబస్

(మొదటి పేజీ తరువాయి)

ఉందన్నారు. నూతన సంస్కరణలను తమ బోర్డు వెబ్‌సైట్ bieap.gov.in లో పొందుపరిచామని, ప్రజలు, విద్యా ర్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు ఈ నెల 26వ తేదిలోపు biereforms@gmail.com మెయిల్ ద్వారా సలహాలు, సూచనలు, అభ్యంతరాలను తెలపవచ్చని చెప్పారు.

**సిబిఎస్ఇ విధానం ఇలా...**

ఇంటర్మీడియట్ విద్య విధానం సిబిఎస్ఇ విధానంలోకి మారనుంది. ప్రస్తుతం ప్రథమ, ద్వితీయ విద్యార్థులకు రెండు భాషలతో పాటు ఆ గ్రూపునకు సంబంధించిన సబ్జెక్టులు ఉంటాయి. సైన్స్ విద్యార్థులకు నాలుగు సబ్జెక్టులు, ఆర్ట్స్ విద్యార్థులకు మూడు సబ్జెక్టుల విధానం ఉంది. ఇప్పుడు ఎంపిసి విద్యార్థులకు ఉన్న మ్యాథ్స్ రెండు పేపర్లను ఒకే పేపర్‌గా, బైపిసి విద్యార్థులకు రెండుగా ఉన్న బొటానీ, జువాలజీని ఒకే పేపర్‌గా తీసుకొస్తున్నారు.

**నూతన సబ్జెక్టుల కాంబినేషన్లు ఇలా..**

ఇంగ్లీష్ సబ్జెక్టు అందరికీ కచ్చితంగా ఉంటుంది. ద్వితీయ సబ్జెక్టుగా ఏదైనా భాష గానీ లేదా ఇతర గ్రూపునకు చెందిన ప్రధాన సబ్జెక్టుగానీ ఎంపిక చేసుకోవచ్చు. దీనికోసం 23 ఆప్షన్లు ఉంటాయి. అంటే, ఎంపిసి చదివే విద్యార్థులు జువాలజీ, బొటానీ సబ్జెక్టు గానీ, ఆర్ట్స్ సబ్జెక్టుగానీ తీసుకోవచ్చు. మూడు, నాలుగు, ఐదో సబ్జెక్టులు ఎంపిక చేసుకున్న గ్రూప్ సబ్జెక్టులు ఉంటాయి. ఐచ్ఛికంగా 6వ సబ్జెక్టు ఉంటుంది. దీనికి కూడా భాష లేదా ఇతర గ్రూపునకు చెందిన (23 ఆప్షన్ల నుండి) ప్రధాన సబ్జెక్టును ఎంపిక చేసుకోవచ్చు. ప్రధానంగా ఎంచుకున్న ఐదు సబ్జెక్టులలో ఒకటి తప్పితే, ఆప్షన్ సబ్జెక్టు పాసయితే దానిని పరిగణనలోకి తీసుకొని విద్యార్థులను ఉత్తీర్ణులు చేస్తారు. ఈ విధానం అమలవ్వాలంటే ఐదు ప్రధాన సబ్జెక్టులలో ఇంగ్లీష్ తప్పనిసరిగా ఉండాలి.

**మార్కుల విధానం ఇలా**

ఇప్పటి వరకు ప్రథమ సంవత్సరంలో 500 మార్కులకు, ద్వితీయ సంవత్సరంలో 500 మార్కులకు పరీక్షలు జరుగుతున్న సంగతి తెలిసిందే. నూతన విధానంలో మార్కులు అదే మాదిరి ఉన్నప్పటికీ, ఉత్తీర్ణత శాతం కోసం ప్రథమ సంవత్సరం మార్కులను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ద్వితీయ సంవత్సరం మార్కులనే పరిగణనలోకి తీసుకొని ఉత్తీర్ణత శాతం విద్యార్థులకు కేటాయిస్తారు. ఈ విధానంలో ప్రతి సబ్జెక్టులోకు అంతర్గత మార్కులు ఉంటాయి. ఇంగ్లీష్‌తో పాటు ఎంచుకున్న సబ్జెక్టుకు థియరీ మార్కులు 80, అంతర్గత మార్కులు 20 ఉంటాయి. సైన్స్, ఆర్ట్స్ విద్యార్థులకు ఇలానే ఉంటుంది. సైన్స్ సబ్జెక్టుల్లో థియరీ 70 మార్కులు, అంతర్గత మార్కులు 30 ఉంటాయి. ఆర్ట్స్ గ్రూపు సబ్జెక్టుల్లో ప్రధాన సబ్జెక్టులకు థియరీ 80 మార్కులు, అంతర్గత మార్కులు 20 ఉంటాయి. అదేవిధంగా ప్రశ్నాపత్రాల్లో ఒక మార్కు ప్రశ్నాలను, 5, 6 మార్కుల ప్రశ్నలను ప్రవేశపెట్టనున్నారు.

**విస్తృతమైన చర్చ జరగాలి : కె.ఎస్ లక్ష్మణరావు**

ఇంటర్మీడియట్ విద్యలో చేపట్టే మార్పులపై విస్తృతమైన చర్చ జరగాల్సి ఉందని పిడిఎఫ్ ఎంఎల్‌సి కె.ఎస్ లక్ష్మణరావు అన్నారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ఇప్పుడు సిలబస్‌లో ఉన్న మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులు జాతీయ పోటీ పరీక్షకు కూడా ఉపయోగంగా ఉన్నాయని చెప్పారు. నిర్ణయాలు తీసుకునే ముందు విద్యావేత్తలు, మేధావులు, విద్యారంగ నిపుణులు తదితరులతో చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఎమ్మెల్సీలతో కూడా చర్చించలేదని చెప్పారు.

## సిపిఎస్ రద్దు చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తరాంధ్ర, గోదావరి, ఉత్తర రాయలసీమ, దక్షిణ రాయలసీమల్లో సన్నాహక సమావేశాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం మహాసభ పలు తీర్మానాలను ఆమోదించింది.

**బకాయిల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : కాకినాడ ఎంపి ఉదయ్ శ్రీనివాస్**

మహాసభలో మాట్లాడుతున్న ఉదయ్‌శ్రీనివాస్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కారానికి కృషి చేస్తానని కాకినాడ ఎంపి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ హామీ ఇచ్చారు. చివరి రోజు మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. టిడిపి కూటమి అధికారంలోకి రావడంలో ఉపాధ్యాయుల పాత్ర కూడా ఉందన్నారు. కూటమి సర్కారు హయాంలో రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయని వివరించారు. భవిష్యత్తులో యువతకు మంచి ఉపాధి అవకాశాలు ఏర్పడతాయన్నారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లోనూ భారీ ఎత్తున పరిశ్రమలు రానున్నాయని తెలిపారు. కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ మాట్లాడుతూ సమస్యలను అధికారుల దృష్టికి నివేదిస్తూ విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేసే తత్వం యుటిఎఫ్ ప్రత్యేకత అని అన్నారు. నిబద్ధతతో పనిచేసే ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ అని పేర్కొన్నారు. కాకినాడ పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి.బి.తిరుపాణ్యం మాట్లాడుతూ 140 సంవత్సరాల చరిత్ర కలిగిన రాష్ట్రంలో రెండవ అతిపెద్ద ప్రభుత్వ కళాశాల అయిన పిఆర్ కళాశాలలో యుటిఎఫ్ స్వర్ణోత్సవాల రాష్ట్ర మహాసభ జరుపుకోవడం హర్షణీయమన్నారు.

**పలు తీర్మానాలు ఆమోదం**

యుటిఎఫ్ 17వ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక స్వర్ణోత్సవ మహాసభ పలు తీర్మానాలను ఆమోదించింది. సిపిఎస్‌ను, 117 జిఒను రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాల వ్యవస్థ (1 నుంచి 5 తరగతులు)ను పునరుద్ధరించాలని, హైస్కూళ్లలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలు కొనసాగించాలని, ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని, ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు, కల్పించాలని, 12వ నూతన వేతన సవరణ సంఘం నియమించాలని, ఐఆర్ వెంటనే చెల్లించాలని తదితర తీర్మానాలను ఆమోదించారు. ఖాళీ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, యాప్‌ల భారం తగ్గించాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, నూతన విద్యా విధానం రద్దు చేయాలని, కామన్ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, జూనియర్ లెక్చరర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని, మున్సిపల్ టీచర్ల, ట్రైబల్ వెల్ఫేర్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని, ప్రతి తరగతికీ ఒక ఉపాధ్యాయుడు ఉండాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానించారు.

## ఆదుకోండయ్యా !

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. జిల్లాలో వేరుశనగ పంట సాధారణ విస్తీర్ణం 1,07,935 ఎకరాలు కాగా, 138,865 ఎకరాల్లో సాగు చేశారని తెలిపారు. కేంద్ర కరువు నిర్ధారణ కమిటీ డైరెక్టర్ డాక్టర్ ప్రదీప్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ దీపాంకర్ సెట్, లైవ్ స్టాక్ అసిస్టెంట్ కమిషనర్ మన్నాజీ ఉపాధ్యాయ పాల్గొన్నారు.

శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని ముదిగుబ్బ మండలం జొన్నలకొత్తపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి మండల కేంద్రంలో కేంద్ర బృందం పర్యటించింది. అనంతరం అనంతపురం జిల్లా అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామం, రాప్తాడు పంచాయతీలోని పంట పొలాలను పరిశీలించింది. పంట సాగు, దిగుబడి, నష్టం తదితర వివరాలను రైతులను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా కరువు బృందం సభ్యులకు స్థానిక రైతులు పలు వినతులను అందజేశారు. అనంతపురం జిల్లాలో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కేంద్ర కరువు బృందం సభ్యులుగా జయంతి కనోజియా, కె.పొన్నుస్వామి ఉన్నారు. అన్నమయ్య జిల్లాలో బి.కొత్తకోట, వాల్మీకిపురం, మదనపల్లె, తంబళ్లపల్లె తదితర మండలాల్లో కరువు బృందం పర్యటించింది. సుప్రియ మాలిక్ ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యులు పర్యటించారు. పంట నష్టం వివరాలను స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. కరువు తీవ్రతను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు.

## ఎల్గర్ పరిషత్ కేసులో రోనా విల్సన్‌కు, సుధీర్ ధావలేకు బెయిల్

(మొదటి పేజీ తరువాయి)

పరిషత్ కార్యక్రమాన్ని సాకుగా చెబుతూ అనేక మందిపై అక్రమ కేసులు బనాయించిన సంగతి తెలిసిందే. నిషిద్ధ మావోయిస్టు సంస్థలు ఈ ఎల్గర్ పరిషత్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయని పోలీసులు ఆరోపించారు. డిసెంబర్ 31న జరిగిన ఎల్గర్ పరిషత్ కార్యక్రమంలో వక్తలు చేసిన ప్రసంగాలు ఆ మరునాడు హింసకు దారితీశాయని అభాండాలు మోపారు. మాజీ విద్యార్థి ఉమర్ ఖలీద్, గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మెవానీ సహా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరు కావడంతో కేసుకు ప్రాధాన్యత ఏర్పడింది. భీమా కోరేగావ్ హింసలో ఒక వ్యక్తి చనిపోగా అనేక వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు భాష్పవాయు గోళాలను ప్రయోగించారు. ఈ కేసుల్లోనే 2018 ఏప్రిల్‌లో పూనే పోలీసులు ఢిల్లీలోని రోనా విల్సన్ ఇంటిపై దాడి చేసి ఆయనను అరెస్ట్ చేశారు. అదే ఏడాది జూన్‌లో మానవ హక్కుల కార్యకర్త సుధీర్ ధావలేను కూడా అరెస్ట్ చేశారు. వీరిద్దరిపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద కేసులు పెట్టారు. ఈ కేసులో సుధీర్ భరద్వాజ్, గౌతమ్ నవ్‌లఖా, వెర్నన్ గన్‌సాల్వ్స్, అరుణ్ ఫెరైరా, వరవరరావులను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు విచారణను 2020 ఫిబ్రవరిలో జాతీయ దర్యాప్తు సంస్థకు బదిలీ చేశారు.

## ఉక్కు ఊసే లేదు!

(మొదటి పేజీ తరువాయి

ముందుకొచ్చినట్లు చెప్పారు. పూడిమడకలో రూ1.85 లక్షల కోట్లతో తలపెట్టిన ఎన్‌టిపిసి గ్రీన్ హైడ్రోజన్ హబ్ అత్యంత కీలకమైనదని, దీనికి పునాదిరాయి వేయడం ద్వారా 70 వేల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు వస్తు తయారీ రంగం, ఫార్మా రంగ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ ప్రాంత ప్రజల కల అయిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి కూడా శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులన్నీ రాష్ట్ర అభివృద్ధిలో సరికొత్త శిఖరాలుగా నిలుస్తాయన్నారు.

**మోడీ గ్లోబల్ లీడర్ : సిఎం చంద్రబాబు**

ఈ దేశమే కాదు.. ప్రపంచం మెచ్చిన 'గ్లోబల్ లీడర్' మోడీ అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధానిని పొగడ్తలతో ముంచెత్తారు. ఒకే రోజున రూ.2.85 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయడం తన జీవితంలో ఎప్పుడూ చూడలేదన్నారు. ఎన్‌డిఎ కాంబినేషన్ భవిష్యత్‌లోనూ కొనసాగుతుందని చెప్పారు. గత ప్రభుత్వం విశాఖ రైల్వేజోన్‌కు స్థలం కూడా చూపించలేదన్నారు. విశాఖ ఉక్కు గురించి పెదవి విప్పని చంద్రబాబు అదే సమయంలో ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్ గురించి మాట్లాడారు. మిట్టల్ ప్లాంటు గురించి ఢిల్లీ వెళ్లి వివరించానని, మిట్టల్‌కు ఐరన్ ఓర్‌ను మామూలుగా సరఫరా చేస్తే పర్యావరణ సమస్య ఉంటుందని, పైప్‌లైన్ ద్వారా చేయాలని తాను కోరగా, వెంటనే ప్రధాని సరేనన్నారని ఆయన చెప్పారు. 'ఇంతకంటే విశాఖ ప్రజలకు ఇంకేం కావాలి' అని ఆయన అన్నారు.

జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు టిడిపి కూటమి పార్టీలు కృషి చేస్తున్నాయన్నారు. ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ప్రభుత్వం కొనసాగింపు అనేది అభివృద్ధికి మూలమని, మూడు పర్యాయాలు మోడీ గెలిచినందునే దేశం అభివృద్ధిలో ప్రపంచంలో దూసుకెళ్తోందని అన్నారు. ప్రజావేదిక సభలో తొలుత అనకాపల్లి ఎంపి సిఎం రమేష్ స్వాగతోపన్యాసం చేశారు. ప్రధాని హిందీ ప్రసంగాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలుగులోకి అనువదించారు.

**ఘన స్వాగతం**

విశాఖ పర్యటనలో భాగంగా ప్రధాని తొలుత ప్రత్యేక విమానంలో ఐఎన్ఎస్ డేగకు చేరుకున్నారు. అక్కడ ఆయనకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం సాయంత్రం 4.50 నిమిషాలకు సిరిపురం వద్దగల వెంకటాద్రి వంటిల్లు నుంచి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో మోడీ రోడ్డు షో నిర్వహించారు. ఆయన పక్కన చంద్రబాబు, పవన్, పురంధరేశ్వరి ఉన్నారు.

**వర్చువల్‌గా చేపట్టిన ప్రాజెక్టులివే..**

అనకాపల్లి జిల్లా నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కుకు రూ.1876 కోట్లతో, పూడిమడకలో ఎన్‌టిపిసి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టును రూ.1.85 లక్షల కోట్లతో మోడీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి రూ.149 కోట్లతో పునాది రాయి వేశారు. రూ.2,139 కోట్లతో కృష్ణపట్నం పారిశ్రామిక పార్క్‌కు, రూ.4593 కోట్లతో 10 ప్రాజెక్టులకు సంబంధించిన రోడ్ల కనెక్టివిటీ, విస్తరణ పనులకు, 6028 కోట్లతో 6 రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. రూ.3,044 కోట్లతో నిర్మించిన 234.28 కిలోమీటర్ల రోడ్లను, 323 కిలోమీటర్ల మేర వేసిన రైల్వే లైన్లను ప్రారంభించి జాతికి అంకితం చేశారు.

ఇటీవల కన్నుమూసిన అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ (100) భౌతిక కాయాన్ని జార్జియా రాష్ట్రంలోని అట్లాంటా నుంచి రాజధాని వాషింగ్టన్‌కు వెలుపల మేరీ లాండ్స్‌లోని ఆండ్రూస్ నేవీ జాయింట్ బేస్‌కు ప్రత్యేక విమానంలో మంగళవారం మధ్యాహ్నం తీసుకొచ్చారు. అక్కడి నుంచి పెన్సిల్వేనియాలోని యుఎస్ నేవీ మెమోరియల్‌కు తీసుకెళ్లి ప్రజల సందర్శనార్థం వాషింగ్టన్‌లో మంగళవారం సాయంత్రం నుంచి గురువారం వరకు ఉంచుతారు. ఆ తరువాత వాషింగ్టన్‌లోని నేషనల్ కేథడ్రాల్‌లో అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఆ రోజు (గురువారం) జాతీయ సంతాప దినంగా పాటించనున్నట్లు అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు.

## అమెరికాలో మంచు తుపాను

- స్తంభించిన విద్యుత్ సరఫరా

**మిస్సోరి:** అమెరికాలో భారీ మంచు తుపానుతో వర్జీనియా, కాన్సాస్, న్యూజెర్సీ రాష్ట్రాలు గజగజ వణుకుతున్నాయి. మంచు పెద్దయెత్తున పేరుకుపోవడంతో రోడ్లపై వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. విమానాశ్రయాల్లో విమానాల ల్యాండింగ్‌కు తీవ్ర అంతరాయమేర్పడింది. మధ్య, తూర్పు అమెరికా అంతటా హిమపాతం విపరీతంగా పెరిగి రికార్డులు బద్దలుగొడుతోంది. భారీ మంచు కారణంగా వాషింగ్టన్ డిసిలో పాఠశాలలు, ఫెడరల్ కార్యాలయాలను మూసివేశారు. దాదాపు రెండు లక్షల నివాస గృహాలు, వ్యాపార సంస్థలు విద్యుత్ సరఫరా లేక అంధకారంలో చిక్కుకున్నాయి. మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ అంత్యక్రియల షెడ్యూల్‌ను కూడా ప్రతికూల వాతావరణం ప్రభావితం చేసింది.

### మీకోసం

బాగా మగ్గిన టమాటాలను ఉప్పు కలిపిన చల్లటి నీటిలో రాత్రంతా ఉంచితే ఉదయానికల్లా తాజాగా మారతాయి.

### జీవన సౌరభం

తనకు నచ్చితే మూర్ఖుడు సైతం ఘనకార్యం సాధిస్తాడు. కానీ వివేకి ప్రతి పనినీ తనకు నచ్చే రీతిలో మలచుకుంటాడు. ఏ పనీ అల్పమైనది కాదు.

## కొయ్యకూరకు సిగ్గులేదు

'అమ్మా జడ వెయ్యవా!' అడిగింది మమత. 'ఏడో తరగతికి వస్తున్నావు. ఇంకా ఎప్పుడు జడ వేసుకోవడం నేర్చుకుంటావు?' తిడుతూనే జడ వేసింది అమ్మ. 'కొయ్యకూరకి సిగ్గు లేదు, కొడవలికి సిగ్గు లేదు, అన్నట్లుంది మీ పద్ధతి. నువ్వు తిట్టడం మానవు. అది అడగడం మానదు' అంది బామ్మ.

'బామ్మా! కొయ్య కూర అంటే ఏంటి? చిలక్కొయ్యా? మంచం కొయ్యా?" అడిగింది మమత. 'కొయ్యకూర అంటే కొయ్య తోటకూర. మొక్క పొడుగ్గా, ఎత్తుగా పెరుగుతుంది. చేతితో తుంచలేం. కాడ గట్టిగా ఉండి, కొడవలితో కోస్తారు. ఎన్ని సార్లు కోసినా త్వరగా పెరుగుతూనే ఉంటుంది' చెప్పింది బామ్మ.

'పూర్వం అంగరాజ్యంలో శంకరవ్వ అనే పూటకూళ్లవ్వ నివసిస్తూ ఉండేది. నిత్యం యాత్రికులతో శంకరవ్వ ఇల్లు సందడిగా ఉండేది. ఆమె కొయ్యకూర మెంతి పులుసు గొప్ప రుచికరంగా చేసేది. ఇంటి పరిసరాల్లో దొరికే ఆకుకూరలు, కాయగూరలతో పులుసు, కూర, పప్పు, పచ్చడి చేసేది. ఎంతో రుచికరంగా ఉండడంతో అందరూ తృప్తిగా భోజనం చేసి వెళ్లేవారు. కొయ్యకూరను కొడవలితో కోసి, వండి పెట్టేది. ఇలా కొంతకాలం గడిచింది. ఓసారి కొడవలి పట్టుకుని శంకరవ్వ పెరట్లోకి వెళ్ళింది. అక్కడున్న కొయ్య కూరను కోయబోతూ ఉంటే 'అవ్వా నన్ను ఎదగనివ్వవా? మొన్ననే కదా కోసావు' అని అడిగింది కొయ్య కూర. ఆ మాటలకు ఆశ్చర్యపోయింది అవ్వ.

'నువ్వు నిత్రాటలా తొందరగా పెరిగేస్తున్నావు. పదిమంది ఆకలి తీరుస్తున్నావు. అయినా కోసే కొడవలికి సిగ్గులేదు. 'ఎన్నిసార్లు కొయ్యాలని' అది ఎప్పుడూ అనుకోదు. నీకూ అంతకంటే సిగ్గు లేదు. కోసే కొద్దీ పెరుగుతున్నావు. అవతల భోజనాల వేళ అవుతోంది. నాకు అడ్డుపడకు' అంది శంకరవ్వ.

అప్పటి నుంచి 'కొయ్యకూరకు సిగ్గులేదు, కొడవలికి సిగ్గులేదు' అనే సామెత పుట్టింది. నిత్యం ఒకరినొకరు తిట్టుకున్నప్పటికీ కలిసి ఉండేవాళ్లని చూసినప్పుడు ఈ సామెత వాడుతారు' అని చెప్పింది బామ్మ.

– కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

### ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.

### నేను గీసిన బొమ్మ

ఎం.డి.అర్ఫ,
7వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్, నిజాంపేట,
మెదక్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# విదేశాలకు వెళ్లే ముందు జాగ్రత్త!

**చదువు, ఉద్యోగం, ఉపాధి అవకాశాల కోసం విదేశాలకు వెళ్లాలనేది చాలామంది రంగుల కల. అక్కడికి వెళ్తే తమ జీవితాల్లో వెలుగు నిండుతుందని సంపాదన బాగా ఉంటుందని, మంచి జీతాన్ని, జీవితాన్ని అనుభవించొచ్చుననే ఆశతో ఎక్కువమంది విదేశాలకు వెళ్లాలనుకుంటారు. అలాంటివారు ముందుగానే తగిన సమాచారం తెలుసుకోవాలి.**

## నేడు ప్రవాస భారతీయుల దినోత్సవం

ప్రపంచంలోని పలు దేశాలు ఇప్పుడు తమ దేశంలో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఇతర దేశాల వారిని ఆహ్వానిస్తున్నాయి. అక్కడి ప్రభుత్వాలు చదువుకునేందుకు కొన్ని రాయితీలు, చదువు పూర్తయిన తర్వాత తమ దేశంలో ఉద్యోగాలు చేసుకోవటానికి అవకాశాలు కల్పిస్తుండటంతో మన దేశం నుంచి లక్షలాది మంది విద్యార్థినీ విద్యార్థులు వెళ్తున్నారు. కొందరు అక్కడే స్థిరపడుతున్నారు కూడా. గతంతో పోలిస్తే నేడు మారుమూల ప్రాంతాల నుంచి కూడా 10 నుండి 15 మంది వరకూ విదేశాలకు వెళ్లిన వారు ఉంటున్నారు.

**జీవనోపాధి కోసం**

భవన నిర్మాణ రంగం, క్లీనింగ్, డ్రైవర్లుగా, సెక్యూరిటీ తదితర విభాగాల్లో పనిచేసేందుకు చాలామంది గల్ఫ్ దేశాలకు వెళ్తున్నారు. మహిళలైతే ఇళ్లల్లో పనులు చేసేందుకు వెళ్తున్నారు. విదేశాలకు వెళ్లిన వారు కారణాలు ఏమైనా అక్కడ పడే ఇబ్బందులు అనేకం ఉంటున్నాయి. ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు స్వదేశానికి తిరిగి రావాలంటే నానా యాతనలు పడుతున్నారు. అన్ని ధృవీకరణ పత్రాలు, వీసా, పాస్‌పోర్టు వంటివి ఉంటే ఇబ్బందులు ఉండవు. కానీ విదేశాలకు పంపుతామని కొందరు డూప్లికేట్ పత్రాలు సృష్టించటం, అక్రమ పద్ధతుల్లో పంపిస్తుండటంతో అక్కడికి వెళ్లిన వారు ఆ తర్వాత ఇబ్బందులు పడుతున్నారు.

**అక్రమార్కులతో జాగ్రత్త**

'ఎంత ఖర్చయినా ఫర్వాలేదు.. విదేశాలకు వెళ్తే సంపాదించుకుని అప్పులు తీర్చుకోవచ్చు, పిల్లల భవిష్యత్తుకు తోడ్పాటు ఉంటుందని, ఇల్లు కట్టుకోవాలని చాలామంది ఆశతో వెళ్తున్నారు. అలాంటి వారి ఆశలను ఆసరాగా చేసుకుని అక్రమార్కులు మోసగిస్తుంటారు. చదువు, ఉద్యోగం పేరుతో విదేశాలకు చాలా తక్కువ డబ్బుతో పంపిస్తామని కొందరు ఏజెంట్లు నమ్మి ముందే డబ్బులు తీసుకుంటారు. ఆ తర్వాత వీసా, పాస్‌పోర్టులు ఏర్పాటు చేయకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల అధీకృత ఏజెంట్లు, కన్సల్టెంట్ల ద్వారానే విదేశాలకు వెళ్లటం చాలా ఉత్తమం. సక్రమంగా వలస వెళ్ళని వారు జైలు పాలవ్వడం, జరిమానాలు కట్టాల్సి రావడం జరుగుతుంది. ఎలాగోలా విదేశాలకు వెళ్లాలనే ఆలోచన సరైంది కాదు.

విదేశాలకు వెళ్లాలనుకునే వారు అధీకృత ఏజెంట్లు, కన్సల్టెంట్ల ద్వారానే వెళ్ళాలి. ఆ కంపెనీ వివరాలు పూర్తిగా తెలుసుకుని వీసా వచ్చాక మాత్రమే వెళ్ళాలి. ప్రతిదాన్ని ఒకటికి రెండుసార్లు ఆలోచించటం మంచిది.

**ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం**

ఆకర్షణీయమైన హామీలతో కూడిన బ్రోచర్లను కొందరు ఆన్‌లైన్ మోసగాళ్లు సోషల్ మీడియాలో పెడుతున్నారు. యువత అవి చూసి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటున్నారు. వీరి సమాచారాన్ని సేకరించిన ఆన్‌లైన్ మోసగాళ్ళు వారిని బెదిరింపులకు గురిచేస్తున్నారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్‌క్రైంలకు పాల్పడే ముఠాలు కూడా పెద్దఎత్తున సైట్లలో పొంచివున్నాయి. అందువల్ల విదేశాలకు వెళ్లే వారికి అక్కడి విధివిధానాలపై అవగాహన చాలా ముఖ్యం. ఉన్నత చదువులు చదివి పై చదువుల కోసం వెళ్లే వారికి పెద్దగా ఇబ్బందులు ఉండవు. స్థానికంగా పరిశ్రమల్లో పనిచేసి, ఆ అనుభవంతో కంపెనీ సాయంతోనూ విదేశాలకు వెళ్లే వారికి అంతగా ఇబ్బంది ఉండకపోవచ్చు. కన్సల్టెన్సీల ద్వారా విదేశాల్లో ఉద్యోగంలో స్థిరపడాలనుకునే వారికి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. డబ్బులు తీసుకుని విదేశాలకు పంపే సంస్థలు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇబ్బడిముబ్బడిగానే ఉన్నాయి. అయితే కన్సల్టెన్సీలు నమ్మకమైనవి ఉన్నత శ్రేణికి చెందినవి కూడా ఉన్నాయి. కొన్ని మోసపూరితమైనవీ ఉన్నాయి. అందువల్ల మనం ఎంచుకునే సంస్థ, వ్యక్తులను సరిగ్గా పరిశీలించి ఎంపిక చేసుకోవాలి. కంపెనీ గతం, దీని ద్వారా వెళ్లిన అభ్యర్థుల సమాచారం, మిగతా వివరాలు తెలుసుకున్నాకే నిర్ణయం తీసుకోవటం మంచిది. కొన్ని కన్సల్టెన్సీలు తమ వ్యాపారం కోసం అభ్యర్థులను తప్పుడు మార్గాలు, నకిలీ ధ్రువపత్రాల సాయంతో విదేశాలకు పంపాలని చూస్తుంటాయి. అభ్యర్థులు కూడా తమ పని సులువుగా అవుతుందనే ఆశతో వారికి సహకరిస్తుంటారు. విదేశాల్లోని అధికారులు గుర్తిస్తే చాలా చిక్కుల్లో పడతారు. అందువల్ల నకిలీ ధ్రువపత్రాలతో వెళ్తే ఎప్పటికైనా ప్రమాదకరమే అనేది తెలుసుకోవాలి.

### ఇవి పాటించటం మేలు

- అవకాశాలు మళ్లీ రావంటూ ఏజెన్సీలు తొందరపెట్టినా, ఒప్పించే ప్రయత్నం చేసినా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.
- ఎంచుకున్న సంస్థ హిస్టరీ, ఇతర వివరాలు తెలుసుకోవాలి.
- వెళ్లాలనుకుంటున్న దేశం, అక్కడ జాబ్ ఆఫర్ చేస్తున్న కంపెనీ పూర్తి వివరాలు, జీతం ధృవీకరించుకోవాలి.
- ప్రతి విషయంలోనూ ఇచ్చిన సమాచారం వాస్తవమా? కాదా? బేరీజు చేసుకోవాలి
- 'చాలామంది వెళ్తున్నారు' అనే భ్రమలో వెళ్లేందుకు సిద్ధపడితే ప్రమాదాల్లో పడతారు.
- బ్యాక్‌లాగ్స్ పూర్తిచేయలేక, పట్టా చేతిలో లేనివారు, త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశతో వెళ్ళడానికి ప్రయత్నం చేస్తే అక్రమార్కుల బారిన పడి ఇబ్బందులు పడతారు.
- ఎవ్వరినీ గుడ్డిగా నమ్మొద్దు. ప్రాసెసింగ్ ఫీజు పేరుతో డబ్బులు అడగ్గానే ఇవ్వొద్దు.

**ప్రపంచ వ్యాప్తంగా మన భారతీయులు**

మన భారతీయులు ప్రపంచమంతా విస్తరించివున్నారు. ఐక్య రాజ్యసమితి లెక్కల ప్రకారం ప్రపంచంలో ఇప్పటివరకూ అత్యధికంగా వలస వెళ్లిన వారు భారతీయులే. భారత్ తర్వాత మెక్సికో, రష్యా, చైనా, సిరియా ఉన్నాయి. భారతీయ విదేశాంగ మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం 2020 విదేశాల్లోని ప్రవాస భారతీయులు, భారతీయ మూలాలున్న వారు 3.2 కోట్లు. ఇందులో భారతీయ పౌరసత్వం ఉన్న వారు సుమారు 1.4 కోట్లు, భారతీయ సంతతివారు 1.8 కోట్లు. అమెరికాలో ఎక్కువగా మనవారు 45 లక్షల మంది వరకూ ఉన్నారు. ప్రవాస భారతీయులు ఉన్న దేశాల్లో యూఎఇ, సౌదీ అరేబియా, అమెరికా, కువైట్, ఖతార్, ఒమన్, నేపాల్, మలేషియా,యూకే తదితర దేశాలు ఉన్నాయి. ఆ తర్వాత మారిషస్‌లో ఉన్నారు. మినీ ఇండియాగా చెప్పుకునే ప్రాంతాల్లో లండన్ సౌతాల్, మలేషియా రాజధాని కౌలాలంపూర్ బ్రిక్‌ఫీల్డ్స్, అమెరికా షికాగో నగరంలోని డెవాన్ ఎవెన్యూ, సింగపూర్, ప్యారిస్‌లోని రూదుఫాబో తదితర ప్రాంతాలను మినీ ఇండియాగా చెబుతుంటారు.

- చక్రవర్తి మద్దాల
(ఎన్ఆర్ఐ), ఆస్ట్రేలియా, కెరీర్ బాబా మేనేజింగ్ డైరెక్టర్, రిజిస్టర్డ్ మైగ్రేషన్ ఏజెంట్ ఆస్ట్రేలియా, లైసెన్డ్ ఇమ్మిగ్రేషన్ అడ్వయిజర్, న్యూజిలాండ్ : సెల్ : 9849511112

### రంగవల్లి



7 చుక్కలు 4 వచ్చేవరకు (మధ్య చుక్క) 4-1

ఎన్.వెన్నెల,
పెర్నమిట్ట, ఒంగోలు,
ప్రకాశం.

**మా చిరునామా**
మెయిల్ ఐడి : jeevana-pageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

## 'గేమ్ ఛేంజర్' కొండదేవర...

రామ్ చరణ్ నటిస్తున్న 'గేమ్ ఛేంజర్' చిత్రం రేపు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ మూవీ నుంచి జాతర సాంగ్ 'కొండ దేవర.. కొండ దేవర..' అంటూ సాగే పాటను చిత్రబృందం విడుదల చేసింది. 'నెత్తురంతా ఉడుకుతున్న ఊరువాడ జాతర' అంటూ సాగే ఈ పాట లిరిక్స్‌ను కాసర్ల శ్యామ్ అందించారు. తమన్, శ్రావణ భార్గవి ఆలపించారు. ఆర్ఆర్ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ నుండి వస్తున్న సినిమా కావడంతో ఈ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. శంకర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. దిల్ రాజు ఈ సినిమాను నిర్మించారు.

## డెంగ్యూ జ్వరం వల్లే ...

### విశాల్ ఆరోగ్యంపై కుష్బు

కోలీవుడ్ స్టార్ హీరో విశాల్ తాజా చిత్రం 'మదగజరాజ'. సుమారు 11 ఏళ్ల తరువాత ఈ చిత్రం విడుదల కాబోతోంది. ఇటీవల ఈచిత్ర ప్రమోషన్ కార్యక్రమానికి విశాల్ హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో ఆయన చాలా అనారోగ్యంగా కనిపించారు. మాట్లాడుతున్నప్పుడు చేతులు వణికాయి. ఇవి చూసిన అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు. విశాల్ త్వరగా కోలుకోవాలంటూ సోషల్‌మీడియాలో ప్రకటనలు చేశారు. అవి బాగా వైరల్ అయ్యి, విశాల్ ఆరోగ్యంపై అనేక కథనాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీనియర్ నటి కుష్బు, విశాల్ ఆరోగ్యంపై స్పందించారు. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో ఆమె విశాల్ ఆరోగ్యం గురించి మాట్లాడారు. 'విశాల్‌కు ఢిల్లీలో ఉన్నప్పుడే ఫీవర్ వచ్చింది. ఆ విషయం ఎవరికీ తెలియదు. కానీ, 'మదగజరాజ' సినిమా 11 ఏళ్ల తర్వాత రిలీజ్ అవుతుందని అనారోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా ఈవెంట్‌కు వచ్చారు. ఆ రోజు విశాల్ డెంగ్యూ ఫీవర్‌తో బాధ పడుతున్నారు. జ్వరంతో ఎందుకు వచ్చారని అడిగాను. '11 ఏళ్ల తర్వాత ఇది ప్రేక్షకుల ముందుకు వస్తోంది. దీనికి కచ్చితంగా రావాలనుకున్నాను' అని చెప్పారు. 103 డిగ్రీల జ్వరం కారణంగా వణికిపోయారు. ఆ ఈవెంట్ పూర్తికాగానే మేం విశాల్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లాం. ఇప్పుడు కోలుకుంటున్నారు. ఎవరూ కంగారు పడాల్సిన అవసరం లేదు. కొంతమంది యూట్యూబర్స్ వ్యూస్ కోసం విశాల్ ఆరోగ్యంపై తప్పుడు వార్తలు రాస్తున్నారు. సెలబ్రిటీల విషయంలో నిజానిజాలు తెలుసుకోకుండా తేలికగా వదంతులు రాసేస్తున్నారు' అని ఆమె అసహనం వ్యక్తం చేశారు.

## 'టాక్సిక్' గ్లింప్స్ విడుదల

కన్నడ నటుడు యష్ చేస్తున్న 'టాక్సిక్' చిత్రం నుండి తాజాగా ఓ వీడియో విడుదలైంది. 'ఏ ఫెయిరీ టెల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ఈ సినిమా ఉపశీర్షిక. నేషనల్ అవార్డు విన్నర్ మలయాళ దర్శకురాలు గీతూమోహన్ దాస్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. కేవీఎన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఏప్రిల్ 10న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం యష్ పుట్టినరోజు సందర్భంగా మూవీ నుంచి స్పెషల్ గ్లింప్స్ విడుదలచేశారు. 'టాక్సిక్ బర్త్‌డే పీక్' అంటూ విడుదల చేసిన ఈ వీడియోలో యష్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపిస్తున్నారు. ఈ సినిమాను కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నారు.

## హాలీవుడ్ రేంజ్‌లో

యువ దర్శకుడు ప్రశాంత్ వర్మ అగ్రశ్రేణి ఆర్కిటెక్ట్‌ల పర్యవేక్షణలో ఓ పెద్ద భవనాన్ని తన ఆఫీస్‌గా తీర్చిదిద్దుతున్నారు. ప్రపంచ స్థాయి సౌకర్యాలతో పాటు, సినిమాకి సంబంధించి ఏ టూ జెడ్ ప్రతి విషయం అక్కడ నుంచి ఆపరేట్ అయ్యే విధంగా అడ్వాన్స్ టెక్నాలజీతో రూపొందిస్తున్నారు. స్టోరీ డిస్కషన్ దగ్గర నుంచి సెట్స్‌కి వెళ్లే వరకూ ప్రాజెక్ట్‌కి సంబంధించిన పనులన్నీ అదే ఆఫీస్‌లో పూర్తయ్యే విధంగా దీన్ని నిర్మిస్తున్నారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, చెన్నై, ముంబై తిరగకుండా తన ఐడియాలజీ, విజన్‌కి తగ్గట్లు అన్ని సౌకర్యాలు ఒకే చోట ఉండే విధంగా రెడీ చేస్తున్నారు. రైటర్స్ టీమ్, వీఎఫ్ ఎక్స్ టీమ్, పీవీసీయూ ఉద్యోగులు ఇలా అందర్నీ ఒకే తాటిపైకి తీసుకొచ్చి తన ఆఫీసు నుంచే పని చేయించేలా వాళ్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈ ఆఫీస్ వుంటుందని సమాచారం. ఈ రేంజ్‌లో ఇంత వరకూ టాలీవుడ్‌లో ఏ దర్శకులకు ఆఫీసు లేదు. టాలీవుడ్‌లో ఖరీదైన సినిమా ఆఫీస్ అంటే, పూరి జగన్నాథ్ కట్టించుకున్న 'కేవ్' గుర్తొస్తుంది. ఇప్పుడా కేవ్‌ని మించి ప్రశాంత్ వర్మ సినిమా ఆఫీస్ ఉండబోతున్నట్లు తెలుస్తోంది.

## కార్చిచ్చులో హాలీవుడ్ నటుల ఇళ్లు

అమెరికాలోని లాస్ ఏంజెల్స్ లో భీకర కార్చిచ్చు రాజేసుకుంది. కొన్ని గంటల్లోనే మంటలు సుదూర ప్రాంతాలకు వ్యాపించాయి. కొన్ని వేల హెక్టార్ల అడవులు దగ్ధం అయ్యాయి. పరిసర ప్రాంతాల్లోని 13 వేల నివాసాలు, దాదాపు 30 వేల మందిని ఇతర ప్రాంతాలకు తరలించారు. ఇందులో ప్రముఖ హాలీవుడ్ నటులు కూడా ఉన్నారు. ఈ కార్చిచ్చు కారణంగా హాలీవుడ్ స్టార్ యాక్టర్స్.. జెన్నిఫర్ అనిస్టన్, బ్రాడ్లీ కూపర్, టామ్ హాంక్స్, రీస్ విథర్‌స్పూన్, ఆడమ్ సాండ్లర్, మైఖేల్ కీటన్ వేరే ప్రాంతాలకు తరలి వెళ్లారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మూడు వేల ఎకరాల వరకు మంటలు వ్యాపించినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదానికి ముందు మంగళవారం సాయంత్రం లాస్ ఏంజెల్స్ లో చిన్న కార్చిచ్చు ఏర్పడింది. గాలి తీక్షణంగా వీయడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. ఈ మంటల్ని ఆపడానికి అగ్నిమాపక సిబ్బంది తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు శాంటి మోనికా, మాలిబు సిటీల మధ్య ఉన్న పసిఫిక్ పాలిసేడ్స్ లో సుమారు 12 స్క్వేర్ కిలోమీటర్ల మేర అడవి కాలిపోయింది. లాస్ ఏంజెల్స్ లోని 46 వేల ఇండ్లకు విద్యుత్తు సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఆల్టడేనాలో 200 ఎకరాల్లో అడవి దగ్ధం అయ్యింది.

## సత్తా చాటిన పంత్

- ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్‌లో టాప్-10లో చోటు

**దుబాయ్:** అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ప్రకటించిన తాజా టెస్ట్ బ్యాటర్ల జాబితాలో టీమిండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్ సత్తా చాటాడు. ఐసిసి బుధవారం ప్రకటించిన టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో రిషబ్ పంత్ టాప్-10లో చోటు దక్కింది. ఆస్ట్రేలియాతో సిడ్నీ టెస్టులో రాణించిన పంత్.. ఏకంగా మూడు స్థానాలు మెరుగుపరుచుకొని 739 రేటింగ్ పాయింట్లతో 9వ స్థానంలో నిలిచాడు. సిడ్నీ టెస్టులో పంత్ తొలి ఇన్నింగ్స్‌లో 40, రెండో ఇన్నింగ్స్‌లో 61 పరుగులు చేశాడు. ఐసిసి తాజాగా వెల్లడించిన బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో టాప్-5లో ఎలాంటి మార్పులు లేవు. జో రూట్, హ్యారీ బ్రూక్, కేన్ విలియమ్సన్, యశస్వి జైస్వాల్, ట్రావిస్ హెడ్ వరుసగా మొదటి ఐదు స్థానాల్లో ఉన్నారు. దక్షిణాఫ్రికా కెప్టెన్ తెంబా బవుమా మూడు స్థానాలు మెరుగుపరచుకొని ఆరో ర్యాంకులో నిలిచాడు. పాక్ బ్యాటర్ బాబర్ అజామ్ ఐదు స్థానాలు ఎగబాకి 12వ ర్యాంక్‌లో ఉన్నాడు. భారత బ్యాటర్లు శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ మూడేసి స్థానాలు పడిపోయి 23వ, 27వ ర్యాంకులకు పరిమితమయ్యారు. ఆసీస్‌తో చివరి టెస్టుకు దూరంగా రోహిత్ శర్మ రెండు స్థానాలు దిగజారి 42వ ర్యాంకులో ఉన్నాడు. ఇక బౌలర్ల జాబితాలో ఆస్ట్రేలియా పేసర్ స్కాట్ బోలాండ్ ఏకంగా 29 స్థానాలు ఎగబాకి టాప్-10లోకి దూసుకొచ్చాడు. 745 పాయింట్లతో రవీంద్ర జడేజాతో కలిసి బోలాండ్ 9వ స్థానాన్ని పంచుకున్నాడు. భారత్‌తో జరిగిన చివరి టెస్టులో బోలాండ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. మరోవైపు, జస్‌ప్రీత్ బుమ్రా భారత్ తరఫున అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన బౌలర్‌గా నిలిచాడు. గత వారం 907 పాయింట్లతో ఉన్న బుమ్రా ఈ వారం ఒక పాయింట్ మెరుగుపర్చుకుని టాప్‌లోనే కొనసాగుతున్నాడు. 2016లో అశ్విన్ 904 రేటింగ్ పాయింట్లు సాధించగా.. బుమ్రా దాన్ని గత వారం అధిగమించిన విషయం సంగతి తెలిసిందే.

**సిడ్నీ పిచ్‌కు ఐసిసి రేటింగ్..**

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌లో భాగంగా జరిగిన ఐదు టెస్ట్ మైదానాల రేటింగ్స్‌నూ ఐసిసి ప్రకటించింది. పెర్త్, అడిలైడ్ ఓవల్, గబ్బా, మెల్‌బోర్న్ పిచ్‌లకు 'వెరీ గుడ్' అని, సిడ్నీ పిచ్‌కు 'సంతృప్తికరం' అనే రేటింగ్ ఇచ్చింది. ఇంతకుముందు పిచ్ రేటింగ్ విధానం ఆరు కేటగిరీలుగా ఉండేది. 2023లో దీన్ని నాలుగుకు (వెరీ గుడ్, సంతృప్తికరం, అసంతృప్తికరం, అన్‌ఫిట్) కుదించింది.

## మాళ్విక శుభారంభం

### మలేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

**కౌలాలంపూర్:** మలేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో మాళ్విక బన్సోద్ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో మాళ్విక 21-15, 21-16తో మలేషియాకు చెంది న జుహాను చిత్తుచేసింది. ఇతర పోటీల్లో ఆకర్షి కశ్యప్ 14-21, 12-21తో డెన్మార్క్‌కు చెందిన జాకోబ్‌సేన్ చేతిలో, అనుపమ ఉపాధ్యాయ 17-21, 21-18, 8-21తో ఛో-ఛువాంగ్ (ఇండోనేషియా) చేతిలో పోరాడి ఓడారు. ఇక పురుషుల సింగిల్స్ లో ప్రియాన్షు రాజ్‌వత్ 11-21, 16-21తో చైనా స్టార్ ఆటగాడు ఎస్.ఎఫ్.లీ చేతిలో ఓటమిపాలయ్యాడు.

**రెండోరౌండ్‌కు చిరాగ్, సాత్విక్**

పురుషుల డబుల్స్‌లో చిరాగ్‌శెట్టి-సాత్విక్ సాయిరాజ్ రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లారు. తొలిరౌండ్ పోటీలో సాత్విక్-చిరాగ్ 21-10, 16-21, 21-5తో చైనీస్ తైపీ షట్లర్లను చిత్తుచేశారు. ఇక మహిళల డబుల్స్‌లో తానీసా కాస్ట్రో-పొన్నప్ప, పండా ద్వయం తొలిరౌండ్‌నే నిష్క్రమించారు. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో ఆధ్యా-కరుణాకరన్ జంట పరాజయాన్ని చవిచూడగా.. కాస్ట్రో-ధ్రువ్ కపిల జంట 21-13, 21-14తో కొరియా జంటను చిత్తుచేసి రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లారు.

## పోరాడి ఓడిన ఆంధ్ర

- సెమీస్‌కు కేరళ, తమిళనాడు, హర్యానా
- అండర్-19 జాతీయ బాలికల వాలీబాల్ టోర్నీ

'డోంట్ క్రయింగ్.. బెటర్ లక్ నెక్స్ట్ టైమ్' అంటూ పశ్చిమ బెంగాల్ ప్లేయర్‌ను ఓదార్చుతున్న తమిళనాడు క్రీడాకారిణులు. - టి.వి. రమణ.

**ప్రజాశక్తి-విజయవాడ స్పోర్ట్స్**

విజయవాడలోని పిబి సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరుగుతున్న అండర్-19 జాతీయ బాలికల వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నా యి. గ్రూప్-లీగ్‌లో అగ్రస్థానంతో నాకౌట్‌కు చేరిన ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ జట్టు బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో కేరళ చేతిలో పరాజయాన్ని చవిచూసింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో కేరళ జట్టు 25-23, 25-20, 25-16తో ఆంధ్రప్రదేశ్‌ను ఓడించి సెమీస్‌కు చేరింది. దీంతో సెమీఫైనల్‌కు చేరాలనే ఆతిథ్య జట్టు ఆశలు అడియాసలయ్యాయి. తొలి సెట్‌లో గట్టి పోటీనిచ్చిన ఆంధ్ర.. రెండో సెట్‌లోనూ ప్రత్యర్థికి చుక్కలు చూపించింది. కానీ మూడో సెట్‌లోనూ ఓడి నిష్క్రమించింది. మరో పోటీలో తమిళనాడు 3-1 (25-23, 25-15, 16-25, 25-14)తో పశ్చిమ బెంగాల్‌పై, హర్యానా జట్టు 3-0 (25-12, 25-23, 25-14) ఉత్తరప్రదేశ్‌పై గెలిచి సెమీకు చేరాయి.

## ఖోఖో వరల్డ్ కప్ చీఫ్ రిఫరీగా ప్రసాద్

**ప్రజాశక్తి – గుడివాడ (కృష్ణాజిల్లా)**

న్యూఢిల్లీలో ఈ నెల 13 నుంచి జరిగే మొట్టమొదటి ఖో ఖో వరల్డ్ కప్‌కు చీఫ్ రిఫరీగా కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన రాష్ట్ర ఖోఖో సంఘం రిఫరీస్ బోర్డు కన్వీనర్ మడకా ప్రసాద్‌ను నియమిస్తూ జాతీయ ఖో-ఖో సమాఖ్య నుంచి సమాచారం అందించిందని రాష్ట్ర ఖోఖో సంఘం కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రసాద్ ఇప్పటికే ఏషియన్, సౌత్ ఏషియన్, జాతీయ క్రీడల్లో ఖో-ఖో న్యాయ నిర్ణేతగా వ్యవహరించారని పేర్కొన్నారు. మరోసారి మడకా ప్రసాద్ అంతర్జాతీయ పోటీలకు రిఫరీగా నియమితులు కావడంతో పలువురు ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలిపారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68